# అపరాధ పరిశోధన

రు. 7.50 | ఆగస్టు '87



Blank Page

సంపుటి: 45
సంచిక: 1

ఫోన్ నెం:
64843

# అపరాధ పరిశోధన

## సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

ఆగస్టు, 1987

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

# అపరాధ పరిశోధన పోటీ-227

## [ఫలితాలు]

జూన్ '87 నెల "అపరాధ పరిశోధన పోటీ-227" కు పరియైన సమాధానాలు:

1. బోఫర్స్
2 నీటి కలహాలు.
3 బందిపోట్లు.
4. కయ్యం
5 పేదరిక నిర్మూలన

పై జవాబుల ప్రకారం ఇద్దరు పాఠకులు మాత్రమే అతి కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ శేషాచలపతిరావు,
సి-24, స్టేట్ బ్యాంక్ కాలనీ,
సైదాబాద్ యూనిట్ —3,
హైద్రాబాదు — 500 659.

(2) శ్రీ కె. మహేష్‌కుమార్,
S/O కె. నాగభూషణ,
తాలూక ఆఫీసు రోడ్డు,
దేవనహళ్ళి— 562 110.
(కర్ణాటక రాష్ట్రం)

# ఈ నెలలో...

## కథలు (మాస పత్రిక)


4. కత్తుల బోను—వసుంధర
24. పంచపాతకులు—సుంకరి రాంప్రసాద్
47. మారుపేరాలు—కె.వి.ఎస్.ఎన్. మూర్తి
70. దొంగల వేట—వి. చంద్రశేఖరఆజాద్
85. ఉత్తరంలో ఉపాయం—జొన్నలగడ్డ రామలక్ష్మి
104. నేను హంతకుడినా?—యస్.డి.వి. అజీజ్
123. కసి — కె.బి.యస్. కుమార్
135. ఆత్మకు ఆహ్వానం—ఫణిబాబు
147. దొంగలు-దొంగలు—చవాన్ సుదర్శనరావు
160. మిస్ మిస్టరీ (సీరియల్) —వసుంధర


## నవలలు (సప్లిమెంట్)


3. పిలి పిడలు—వి.యస్. రావ్
89. స్నేహం—వసుంధర
129. దేవుడు చేసిన నేరం—కె.బి.యస్. కుమార్
177. అన్వేషణ—(సీరియల్) వి.యస్. రావ్


ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

గురవయ్య తన ముందున్న పళ్ళెంవంక చూసుకుని నవ్వుకున్నాడు. ఆ పళ్ళెంనిండా తళతళ మెరుస్తున్న కత్తులు. కత్తులు వాడిగా ఉన్నాయి. చేత్తో తాకితే క్షణాలమీద రక్తం చిమ్మేటంత వాడి ఉన్నదా కత్తుల్లో.

సూటిగా గుండెలకు తాకితే బాధ తెలిసేలోగా ప్రాణం తీయగల కత్తులవి.

గురవయ్య ఆ కత్తులతో పదేళ్ళుగా సాధన చేస్తున్నాడు.

ఒక్కసారి కూడా అతడి గురి తప్పలేదు.

ఒక్కసారి కూడా అతడి కత్తి విసురుకు మనిషి రక్తం చిందలేదు.

గురవయ్య ప్రదర్శన అపూర్వం, అద్భుతం—అని పేరు పడింది.

అతడి ప్రదర్శన చిన్న చిన్న పాఠశాలల నుంచి—జాతీయ సభావేదికల వరకూ పేరు కాంచింది.

అంతర్జాతీయంగా అతడి కాహ్వానాలు రప్పించడానికి కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

గురవయ్యకు రాజకీయంగా పలుకుబడిలేదు. అందుకే అతడికి రావలసినంతగా ప్రచారం లభించలేదు.

అందుకు గురవయ్య బాధపడలేదు. అతడికి విద్యాప్రదర్శనలో ఉన్న ఆనందం—ప్రచారంలో లేదు.

డబ్బెలాగూ అతడు దండిగా సంపాదిస్తూనే ఉన్నాడు.

గురవయ్య ప్రదర్శనల్లో చాలా విశేషాలున్నాయి.

గోడకానుకుని నిలబడ్డ మనిషినతడు కత్తులు విసిరి బందీని చేయగలడు. తిరిగి అతడు విడిపించేవరకూ ఆ మనిషి కదలలేడు. కదలనంతకాలం ఆ మనిషికి బాధ లేదు. కదిలితే రక్తం చిందక తప్పదు.

వేదికపై పారిపోతున్న మనిషిని కత్తులు విసిరి ఆపగలడతడు. ముందడుగువేస్తే పాదం ముందు కత్తి.

ఆ దృశ్యం చూసి ఆనందించవలసిందే!

ప్రస్తుతం గురవయ్య ముందు పళ్ళెంలో కత్తులున్నాయి. ఇంకాస్త దూరంలో అతడి కూతురు "గులాబి" ఉంది.

గులాబి గులాబి పూవుకన్న మృదువుగా ఉంటుంది. అందంలో ఆమె కామే సాటి. అందాన్ని మించిన ధైర్యమామెకుంది.

వేదికపై ఆమె అందం, ధైర్యం—గురవయ్యకు అస్సెట్.

గురవయ్య తదేక దీక్షతో కూతురివంకే చూస్తూ నెమ్మదిగా కత్తులు విసరసాగాడు.

గులాబి రెండు చేతులూ అడ్డంగా చాచింది. కాళ్ళు ఎడంగా పెట్టింది.

ఆమె అప్పుడు జీన్సులో ఉంది.

గురవయ్య విసిరిన కత్తులామె శరీరాన్ని రాసుకుంటూ వెడుతున్నాయి.

అమె అంగుళం మేరకూడా కదలలేదు.

కత్తులామెను రాసుకుంటూవెళ్ళి—ఆమె వెనుక సుమారు మూడు గజాల దూరంలో ఉన్న గోడకు గుచ్చుకుంటున్నాయి. కొన్ని ఆమె చేతుల్ని, కొన్ని ఆమె కాళ్ళను, కొన్ని ఆమె మెడను దూసుకుంటూ వెళ్ళి గోడలో గుచ్చుకుంటున్నాయి.

గురవయ్య పళ్ళెంలోని కత్తులైపోయాయి.

"శెభాష్ నాన్నా!" అంది గులాబి.

"నువ్వు నన్ను మెచ్చుకోకూడదు—" అన్నాడు గురవయ్య.

"మెచ్చుకోకుండా ఎలా నాన్నా? నీకులా కత్తులు విసరగలిగేవాడీ భూమ్మీదుంటాడని అనుకోను—" అంది గులాబి.

"ముందు నువ్వు గోడదగ్గరకు వెళ్ళి నిలబడ్డాక అప్పుడు మాట్లాడు—" అన్నాడు గురవయ్య గంభీరంగా.

గులాబి గోడదగ్గరకు వెళ్ళింది.

గోడనిండా వరసగా కత్తులు.

ఆమె నెమ్మదిగా ఆ కత్తులమధ్యకు వెళ్ళి యిరుక్కుంది.

ఇప్పుడామెను చూస్తూంటే గురవయ్య ఆమెను గోడ కానించి నిలబెట్టి అప్పుడు కత్తులు విసిరాడా అనిపిస్తుంది.

గురవయ్య తృప్తిగా తలాడించి— "బయటకురా—" అన్నాడు.

గులాబి జాగ్రత్తగా కత్తుల మధ్యనుంచి బయటకు వచ్చింది.

"ఇలాంటి విద్య నింతవరకూ ఎవ్వరూ ప్రదర్శించ లేదు. మనిషికీ గోడకూ మధ్య దూరముంచి కూడా — తిన్నగా మనిషి ఆకారంలో కత్తులు విసరడం — నేనే కనిపెట్టాను — సాధించాను. ఇది నేను ఎల్లుండి స్టేజిమీద ప్రదర్శిస్తాను. నువ్వు మాత్రం ఇదే ధైర్యాన్నప్పుడూ ప్రదర్శించాలి...." అన్నాడు గురవయ్య.

"ధైర్యంగురించి నువ్వు నాకు చెప్పాలా నాన్నా!" అంది గులాబి.

"సరే— ఈ రోజుకు ప్రాక్టీసై పోయింది...." అన్నాడు గురవయ్య.

## 2

రాత్రి పదకొండు గంటలవుతుంది.

గురవయ్య తనగదిలో మంచంమీద నిద్రపోతున్నాడు.

ఆ సమయంలో గురవయ్యింటి ముందో వ్యక్తి ఆగాడు. అతడి చేతిలో ఓ బ్రీఫ్ కేసుంది.

అతడు నెమ్మదిగా తలుపుతట్టాడు.

ఆ తలుపు చప్పుడు గులాబి వింది.

అది గులాబికి కలల సమయం.

జీవితంమీద, భవిష్యత్తుమీద—ఆమె కెన్నో ఆశ లున్నాయి.

ఆమె మనసునిండా వయసుకు తగ్గ కోర్కెలున్నాయి.

తండ్రి నిద్రకు పడ్డాక ఆమె తీరుబడిగా పడుకుని కలలు కంటుంది. ఆ కలలనిండా బంగళాలు, కార్లు, రాజ కుమారులు....

గులాబి పెద్దగా చదువుకోలేదు కానీ—తెలుగొక్కటే కాక ఆమెకు మొత్తం దక్షిణాది భాషలన్నీ వచ్చు.

ఆపైన హిందీ, ఇంగ్లీషు చక్కటి ఉచ్చారణతో మాట్లాడుతుంది.

చక్కటి పొడవు, అంగసౌష్టవం కారణంగా—ఆధునిక దుస్తులూ, సంప్రదాయపరమైన దుస్తూలూ—అన్నిరకాల అలంకారాలూ ఆమెకు నప్పుతాయి.

తండ్రి ప్రదర్శనల కారణంగా ఆమె ఎన్నోసార్లు వేదిక నెక్కింది.

అందువల్ల ఆమె చాలామంది దృష్టికి వచ్చింది.

ఎందరో ఆమె అంటే యిష్టపడ్డారు.

వారిలో భాగ్యవంతులున్నారు, రాజకీయ నాయకు లున్నారు, విద్యాధికులున్నారు.

వారందరూ ఆమెకు నచ్చారు కానీ గురవయ్యకు నచ్చ లేదు.

"నువ్వంటే యింకా గొప్పవాళ్ళుకూడా యిష్టపడతారు. నీక్కావలసిం దిష్టం కాదు — ప్రేమ!" అన్నాడు గురవయ్య.

ప్రేమకూ యిష్టానికీ తేడా ఏమిటో గులాబికి తెలియ లేదు.

గురవయ్య మాత్రం ఆమెకు పరోక్షంగా చెప్పాడు.

"నా దగ్గర బాగా డబ్బు చేరుతోంది. ఒకరోజున నేను నిన్ను చాలా గొప్పవాడికిచ్చి పెళ్ళి చేస్తాను. నువ్వు పెళ్ళి చేసుకుని స్థిరంగా కాపురం చేసుకోవాలి" అని గురవయ్య ఆమెకు చెప్పాడు.

గులాబి అంటే యిష్టపడ్డ వాళ్ళు గురవయ్యకు తెలియకుండా ఆమెను కలుసుకుని మాట్లాడ్డానికి ప్రయత్నించారు. గులాబి వాళ్ళను మాటాడనిచ్చింది కానీ ముందడుగు వెయ్యనివ్వలేదు.

"మీ నాన్న నీకు పెళ్ళిచేయడు. నిన్నడ్డుగా పెట్టుకుని డబ్బు సంపాదిస్తున్నాడు" అన్నారు కొందరు.

"అసలు మీ నాన్న గురవయ్యకాడు. వాడు నిన్నెక్కడ్డించో ఎత్తుకొచ్చి తన ప్రదర్శనల కుపయోగించుకొంటున్నాడు" అన్నారు కొందరు.

గులాబి వారి మాటలకు చలించలేదు.

ప్రేమ విలువ అది పొందేవారికే తెలుస్తుంది.

గురవయ్య ఆమెకు తండ్రి అవునా, కాదా అన్నదామెకీ తెలియదు. కానీ ఆమె అతడిలో తండ్రిని చూస్తోంది.

గురవయ్య ఆమెకు అసలు సిసలు తండ్రి ప్రేమను చూపిస్తున్నాడు.

అతడి ననుమానించడం ఆమె మనసుకు నచ్చదు.

అందుకే ఆమె తండ్రి తనను మోసగిస్తాడనికాక— మంచి యువకుణ్ణి తెచ్చి పెళ్ళిచేస్తాడని నమ్ముతోంది. ఆ నమ్మకమే ఆమెను రాత్రిపూట కలలు కనేలా చేస్తూంది.

కలలు కన్నాకనే ఆమె నిద్రపోతుంది.

క్రమశిక్షణ, వ్యాయామం కారణంగా ఆమె శరీరారోగ్యం గొప్పది. అందువల్ల నిద్రలో ఆమెకు కలలు రావు.

గులాబి నిద్రపోకుండా కలలు కంటున్న సమయంలో తలుపు తట్టిన శబ్దం వినబడి—స్వప్న ప్రపంచంలోంచి బైటకు వచ్చింది.

నెమ్మదిగా వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా అతడు....అతడి చేతిలో బ్రీఫ్ కేసు....

తాను తిరిగి స్వప్నప్రపంచంలోకి వెళ్ళిపోయానా అనుకుందామె.

అతడు చాలా అందంగా యువతుల స్వప్నసుందరుడిలా ఉన్నాడు.

అతడి మనోహర మందహాసం—ఏ యువతి గుండెలోనైనా వెన్నెలలు కాయించగలదు.

"లోపలకు రావచ్చా!" అన్నాడతడు.

అతడి పలుకుల కామె మనసులో వేయి వీణలు మ్రోగాయి.

అప్రయత్నంగా పక్కకు తప్పుకుందామె.

అతడు లోనికి వచ్చి తనే తలుపువేసి "మంచి నీళ్ళు కావాలి" అన్నాడు.

ఆమె మంత్రముగ్ధురాలిలా వెళ్ళి మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

అప్పటికతడు బ్రీఫ్ కేసు కింద పెట్టేడు. ఆమె ఇచ్చిన మంచినీళ్ళు తాగి—"మీరిచ్చిన మూలాన కాబోలు—తీయగా ఉన్నాయి" అన్నాడు.

గులాబి మొహమాటంగా నవ్వి—"ఎవరు మీరు?" అంది.

"కొందరు దుర్మార్గులు నన్ను వెన్నంటి వస్తున్నారు. ఈ బ్రీఫ్ కేసు మీ యింట్లో దాచాలి. ఇందులో ప్రభుత్వానికి సంబంధించిన విలువైన కాగితాలున్నాయి" అన్నాడతడు.

"ఉండండి—మా నాన్నను నిద్రలేపి వస్తాను" అంది గులాబి.

"వద్దు—నేను వెళ్ళిపోవాలి"—అన్నాడతడు కంగా రుగా.

అతణ్ణి కాసేపాపాలని ఆమె కనిపించింది — "మా నాన్నకు తెలియకుండా ఈ బ్రీఫ్ కేసు మా యింట ఉంచ లేను. ఆయన్ను లేపాలి" అందామె.

"వద్దు" అన్నాడతడు.

"అయితే బ్రీఫ్ కేసు తీసుకుని వెళ్ళిపొండి" అంది గులాబి.

"నేను నిజంగా తొందరలో ఉన్నాను. లేకుంటే నీ వంటి అందాల రాశితో కాసేపైనా మాటాడకుండా వెళ్ళి పోగలనా?" అన్నాడతడు.

తన నతడందాలరాశి అనడం ఆమెకెంతో సంతోషాన్ని కలిగించింది.

"నాన్నా!" అందామె అప్రయత్నంగా.

గురవయ్యకా పిలుపు చాలు.

అతడు చటుక్కున లేచి అక్కడికి వచ్చాడు.

ఆ యువకుడు తెల్లబోయాడు.

"ఎవరు నువ్వు?" అన్నాడు గురవయ్య.

ఆ యువకుడు మాట్లాడకుండా గురవయ్య వంకే చూస్తు న్నాడు.

గులాబి తండ్రికా యువకుడి గురించి చెప్పింది.

తండ్రి అతడిగురించి తెలుసుకుంటే—అతడంటే యిష్టపడతాడేమోనని ఆమె ఆశ!

"అంటే ఈ బ్రీఫ్ కేసు నేను దాచాలంటావు" అన్నాడు గురవయ్య.

యువకుడు మౌనంగా తలాడించాడు.

"నీ పేరు?" అన్నాడు గురవయ్య.

"రాజ్‌కుమార్—"

"అచ్చం రాజకుమారుడి లాగే ఉన్నాడు" అనుకుంది గులాబి.

"మిస్టర్ రాజ్‌కుమార్! ఈ పెట్టెలో ఏముందో నేను చూడొచ్చా?" గంభీరంగా అడిగాడు గురవయ్య.

"చూడకూడదు—" అన్నాడు రాజ్‌కుమార్.

"నేను గౌరవంగా బ్రతుకుతున్నాను. ఒకరిచేత ఇంత వరకూ వేలెత్తి చూపించుకోలేదు. నువ్వు ప్రభుత్వాధి కారివో, స్మగ్లరువో నాకు తెలియదు. నీ వంటివాడు నా యింట్లో చొరబడితే—పట్టుకుని పోలీసుల కప్పగించడం నా బాధ్యత. నిజానిజాలు పోలీసులే తేల్చుతారు" అన్నాడు గురవయ్య.

అప్పుడు యువకుడి చేతిలో నల్లటి వస్తువొకటి నిగ నిగలాడుతూ మెరిసింది.

అది పిస్తోలు!

పిస్తోలు తిన్నగా గురవయ్యకే గురిపెట్టబడి ఉంది.

"ఈ బ్రీఫ్‌కేసు మీ యింట్లో ఉంటుంది—తిరిగి నే నొచ్చి తీసుకెళ్ళే వరకూ. ఇది పోలీసుల పరం చేశావా— నువ్వూ నీ కూతురూ వికలాంగులై రోడ్లమీద అడుక్కుం టారు. నేను ప్రమాదకరమైన మనిషిని. నాజోలికి రాకు. నేను చెప్పినట్లు విను" అన్నాడతడు.

గురవయ్య తెల్లబోయాడు.

గులాబి ఆరాధనాపూర్వకంగా ఆ యువకుడివంకే చూస్తోంది.

జరుగుతున్నదేమిటో ఆమెకు తెలియడంలేదు.

ఆమెకంటి కతడు దుర్మార్గుడిలా కాక హీరోలా కన బడుతున్నాడు.

"నేను వెడుతున్నాను" అంటూ యువకుడు వెనుకడుగు వేశాడు.

"ఆగు" అన్నాడు గురవయ్య.

మరుక్షణం గురవయ్య చేతిలోంచి కత్తి ఒకటి శర వేగంతో రాజకుమార్ కుడిచేతిని తాకింది.

రాజకుమార్ చేతిలోని పిస్తోలు ఎగిరి దూరంగా పడింది.

"కదలకు...." అన్నాడు గురవయ్య.

జరిగిన విశేషానికి రాజకుమార్ నిశ్చేష్టుడయ్యాడు.

గురవయ్య చేతిలో యిప్పుడు మరో కత్తి ఉంది.

"నేను కావాలని నీ చేతికి కత్తిపిడి తగిలేలా విసిరాను. కాబట్టి నీకే గాయమూ అవలేదు. కత్తిమొన ఈసారి సూటిగా నీ గుండెల్ని తాకుతుంది...." అన్నాడు గుర వయ్య.

"ఎవర్నువ్వు? ఏదైనా ముఠా నాయకుడివా?" అన్నాడు రాజకుమార్ ఆశ్చర్యంగా.

"నాపేరు గురవయ్య. నేర్పుగా కత్తి విసరడం నా వృత్తి. నేను విసిరిన కత్తి తుపాకి గుండును మించిన వేగంతో పోతుంది. నా గురి అర్జునుడి గురికంటె గొప్పది."

"ఓహో — నీపేరు విన్నాను" అన్నాడతడు.

"ఇప్పుడు నా నేర్పు చూద్దువుగాని....ముందు మర్యాదగా లోపలకు నడు...." అన్నాడు గురవయ్య.

గత్యంతరం లేక అతడు లోపల గదిలోకి నడిచాడు.

గురవయ్య అతణ్ణి గోడకానుకొని నిలబడమన్నాడు.

గోడకు కొత్తగా అట్టతాపడం చేయబడి ఉంది. అతడాను కుని ఉన్నచోట పూర్వపు గుర్తులేమీ లేవు.

"కదిలావా—కత్తులు నీ శరీరాన్ని చీల్చుతాయి. అలాగే కదలకుండా నిలబడు...." అన్నాడు గురవయ్య.

రాజకుమార్ గోడకానుకుని కదలకుండా నిలబడితే గురవయ్య కత్తులు విసిరాడు.

గులాబి సంతోషంతో చప్పట్లు కొట్టింది.

"కత్తులన్నీ వాడిగా ఉన్నాయి. కదిలావా—నీ శరీరం తునాతునక లవుతుంది. అలాగే ఉండు....నేనువెళ్ళి పోలీసులను పిల్చుకొని వస్తాను" అన్నాడు గురవయ్య.

"వద్దు...." అన్నాడు రాజకుమార్.

"నువ్వు నన్నాపలేవు. నేనొచ్చి కత్తులు తీసేదాకా నువ్వు కదలలేవు. వస్తాను" అన్నాడు గురవయ్య.

రాజకుమార్ గురవయ్యవంకే చూస్తున్నాడు.

గురవయ్య గులాబితో—"చూడమ్మా! నేను గంటలో పోలీసుల్ని వెంటబెట్టుకుని వస్తాను....ఈలోగ నీకు నిద్ర వస్తే పడుకో" అన్నాడు.

"నేనూ నీతో వస్తాను" అంది గులాబి.

"వద్దమ్మా — రాత్రిపూట నువ్వెందుకు?" అంటూ గురవయ్య వెళ్ళిపోయాడు.

తండ్రి వెళ్ళగానే తలుపులువేసి రాజకుమార్ దగ్గరకు వెళ్ళింది గులాబి.

"మా నాన్నంటే ఏమనుకున్నావు? పిస్తోలు చూసి బెదిరిపోతాడనుకున్నావా? అనవసరంగా ఆయన్ను రెచ్చ గొట్టి కత్తులబోనులో చిక్కుకున్నావు—" అంది గులాబి.

రాజకుమార్ నిట్టూర్చి—"నా గురించి నాకు బెంగ లేదు. దేశం గురించీ, మీ నాన్నగురించీ బెంగ పెట్టు

కున్నాను....'' అన్నాడు.

"ప్రమాదం సీకై తే—మా నాన్నగురించి బెంగెందుకు?" అంది గులాబి.

"నేను ప్రభుత్వ గూఢచారిని. మన దేశంమీద కుట్ర పన్నుతున్న పొరుగుదేశపు పథకం వివరాలు తెలుసుకున్నాను. ఈ లోగా వాళ్ళ మనుషులు నా వెంటబడ్డారు. వాళ్ళ కళ్ళుగప్పి నేను మీ యింట్లో ప్రవేశించాను.

నేను వాళ్ళకు దొరికినా ఫరవాలేదు. ఈ కాగితాలు దొరక్కూడదనుకున్నాను. మీ నాన్న వెంటనే ఒప్పేసుకుంటే బాగుండేది. ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌కు వెడతాడు. పోలీసుల్ని రప్పిస్తాడు. ఊరంతా విదేశీ కుట్ర దారులు మాటువేసి ఉన్నారు. వాళ్ళకు నా ఉనికి తెలిసిపోతుంది. వాళ్ళ నాపేశక్తి పోలీసులకులేదు. గూఢచారుల కుతంత్రాలకు పోలీసులు తట్టుకోలేరు. ఆ విధంగా రహస్య పత్రాలు శత్రువుల పాలవుతాయి. నా ప్రాణాలుకూడా శత్రువులు పొట్టన పెట్టుకోవచ్చు.

ఇంతకూ నీ తండ్రి కారణం. నీ తండ్రిని ప్రభుత్వం అనుమానిస్తుంది. విదేశ గూఢచారి అంటుంది. నేను మీ యింట్లో రహస్య పత్రాలు దాచడానికి ప్రయత్నించానని విదేశీ గూఢచారులకు తెలిస్తే మీ నాన్నకు ప్రభుత్వ గూఢచారులతో సంబంధముందని వాళ్ళనుమానిస్తారు. అన్ని వైపులనుంచీ అందరూ మీ నాన్నను వేటాడ్డం మొదలు పెడతారు...."

గులాబి భయంగా—"మరి నువ్వు స్మగ్లరువికాదా?" అంది.

"నన్ను చూస్తే నీ కలాగనిపిస్తోందా?" అన్నాడు రాజకుమార్.

"లేదు —" అంది గులాబి వెంటనే.

"నన్ను వెంటనే ఈ కత్తుల బోనులోంచి విడిపించు. ఆ విధంగా మన దేశాన్నీ, మీ నాన్ననూ కూడా రక్షించు కున్నదాని వౌతావు...." అన్నాడు రాజకుమార్.

"ఇవన్నీ నువ్వు మా నాన్నకు చెప్పాల్సింది...."

"చెప్పేవాడినే! కానీ అర్థం చేసుకునే తెలివిలేని వాడి కెన్ని చెప్పీ ఏం ప్రయోజనం!" అన్నాడు రాజకుమార్.

"నాకా తెలివి ఉందా?"

"కొన్ని విద్యల్లో నేర్పరితనం ఉన్నవారికి లోకజ్ఞాన ముండదు. మీ నాన్న ముఖం చూడగానే నాకా విషయం తెలిసింది. నీ విషయమలాకాదు. నీ ముఖంలో వర్చస్సుంది. తెలివి కొట్టొచ్చినట్లు కనబడుతోంది...."

గులాబి మొహమాటంగా నవ్వింది.

"నీ పేరు?" అన్నాడతడు.

"గులాబి...." అందామె.

"రూపానికితగ్గ అందమైన పేరు"—అని అతడు నిట్టూర్చి—"గులాబీ! గతంలో నిన్ను చూసి ఉంటే ప్రమాదకరమైన ఈ గూఢచారి వృత్తిని చేపట్టి ఉండేవాణ్ణి కాదు. హాయిగా నీలాంటి అమ్మాయిని పెళ్ళిచేసుకుని జీవితంలో నలుగురికిలా స్థిరపడి ఉండేవాణ్ణి...."అన్నాడు.

"నీ వృత్తి నీ కిష్టంలేదా?"

అతడు తిరిగి నిట్టూర్చి— "చూశావుగా ప్రస్తుతం నా పరిస్థితి. నీ తండ్రి మంచివాడు. దేశభక్తుడు. ఆయన నన్ననుమానించి బంధిస్తేనే ప్రస్తుతం నా గతిలాగుంది. శత్రువులు బంధిస్తే వేరే చెప్పాలా? వాళ్ళు గుండు సూదులతో గుచ్చి ఆ కన్నాల్లో కారంచల్లి నిమ్మకాయ

పిండుతారు. ఒకో తలవెంట్రుకకే పట్టి లాగుతూంటారు. ఆ బాధలు భరించలేరు - ఎటువంటి ధైర్యవంతులూ కూడా!" అన్నాడు.

"మరి నువ్వెందుకీ వృత్తిని చేపట్టేవు....?" అందామె.

"ఏం చేయను? నా కెవ్వరూలేరు. ఇంట్లో సవతితల్లి పోరు...." అంటూ అతడు తనకు సంబంధించిన ఓ విషాదగాధ చెప్పాడు.

ఆ కథవింటూ గులాబి చలించిపోయింది. ఆమె కళ్ళలో నీళ్ళు కూడా తిరిగాయి.

"గులాబీ! నన్ను విడిపించవూ?" అన్నాడతడు దీనంగా.

గులాబి మాట్లాడలేదు.

"అమాయకమైన నీ ముఖం, అందమైన రూపం, కోమలమైన నీ శరీరం కఠినత్వాల్ని భరించలేవు గులాబీ! నువ్వు నీ దేశం కోసం, నీ తండ్రి కోసం, నా కోసం నన్ను విడిపించాలి. అందుకు ప్రతిఫలంగా ఒకరోజున నిన్ను భారత ప్రభుత్వం సన్మానిస్తుంది. ప్లీజ్....నన్ను విడిపించు....గులాబీ! నన్ను విడిపించు...."

ఏమనుకుందో గులాబి అతణ్ణి సమీపించి — ఒకో కత్తినే తీసి నేలమీద పడేయసాగింది.

## 3

"ఎంతపని చేశావమ్మా?" అన్నాడు గురవయ్య.

"ఆడపిల్లల్ని వల్లో వేసుకోవడంలో వాడికి వాడేసాటి. ఇంతవరకూ వాడు—ఆడపిల్లల సాయంతోటే తప్పించు కుంటూ వస్తున్నాడు. ఈ రోజూ అలాగే జరిగింది—" అంటూ నిట్టూర్చాడు పోలీసినస్పెక్టర్.

రాజకుమార్ అసలు పేరదికాదు. అతడికన్ని భాష ల్లోనూ. అన్ని మతాల్లోనూ పేర్లున్నాయి. అండి బ్రీఫ్ కేసులో లక్షలు విలువచేసే మాదక ద్రవ్యాలున్నాయి. పోలీసులతణ్ణి సరైన సమయంలో పట్టుకోబోగా అతడు పారిపోయాడు. అతణ్ణి పోలీసులు తరుముతున్నారు. అన్ని పోలీసు స్టేషన్లకూ రాత్రికి రాత్రి వార్త వెళ్ళింది.

"చేతికి చిక్కినట్లే చిక్కి తప్పించుకొన్నాడతడు.

"మాదక ద్రవ్యాలంటే?" అంది గులాబి.

"యువతరాన్ని లొంగదీసుకుని నిర్వీర్యులను చేసే మత్తుపదార్థాలమ్మా అవి!" అంటూ పోలీసినస్పెక్టరామెకు వాటి గురించిన వివరాలు చెప్పాడు.

"అమ్మయ్యో!" అంది గులాబి.

ఆమె కళ్ళముందు అందమైన రాజకుమార్ ముఖం చిరునవ్వులు చిందిస్తూ వెలుగుతోంది.

అందంవెనుక ఎంత మోసం?

"గురవయ్యగారూ—మీ కృషికి మిమ్మల్నభినందిస్తున్నాను. కానీ మా అదృష్టం బాగోలేదు. అయితే మా మనుషులు ఊరంతా గాలిస్తున్నారు. అతడు గుండెలు తీసినబంటు. అతడు కనుక పట్టుబడితే గుర్తించడానికి మీరు మాకు సహకరించాలి—" అని వెళ్ళిపోయాడు పోలీసినస్పెక్టరు.

పోలీసులు వెళ్ళిపోయాక గురవయ్య. కూతుర్ని బాగా మందలించాడు.

గులాబి ఏడుస్తూ— "నేనతడి మాటలు నమ్మాను నాన్నా! నీకు ప్రమాదమని భయపడ్డాను—" అంది.

గురవయ్యకు కూతురి మనసు తెలుసు. ఆమె అమాయకత్వమూ తెలుసు.

"తప్పు నాదమ్మా! నాతో వస్తానన్న నిన్ను కాదని ఇంట్లో వదిలివెళ్ళాను. ఆ దుర్మార్గుడే ఏ ఘాయిత్యమూ చేయకుండా నిన్ను వదిలిపెట్టాడు. అదే గొప్ప అదృష్టం మనకు...." అన్నాడు గురవయ్య.

"చేతికి చిక్కిన దుర్మార్గుణ్ణి చేజేతులా వదిలిపెట్టేను. వాడి మూలంగా మన యువతరమంతా నాశనమవుతోందంటే నా గుండె మండిపోతోంది—" అంది గులాబి.

"వాడు నా కత్తుల బోన్నించీ తప్పించుకున్నాడంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది....బాధగానూ ఉంది—" అన్నాడు గురవయ్య.

ఆ తండ్రీ కూతుళ్ళు కాసేపు బాధపడి నిద్రపోదామనుకునేటంతలో యింటిముందు పోలీసు జీపాగింది.

ఇనస్పెక్టర్ హడావుడిగా వాళ్ళను కలుసుకుని—"మీరిప్పుడే నాతో రావాలి...." అన్నాడు.

"ఏమయిందిసార్?" అన్నాడు గురవయ్య.

"ఒక రాత్రివేళ మీ యింటినుంచి బైటపడ్డ బ్రీఫ్‌కేసు యువకుణ్ణి మా పోలీసు మనిషొకడు చూసి అనుమానించి వెంటాడాడు. వాడు అరుణాహోటల్లో ఇరవై రెండో నంబర్లో దూరాడు. వాడు బైటకు పారిపోకుండా కట్టుదిట్టమైన కాపలా ఏర్పాటుచేసి—మా మనిషి నాకు కబురందించాడు. వాడే నేరస్థుడని నా కర్థమైపోయింది. అయితే అతణ్ణి గుర్తించడానికి మీరు రావాలి...."

"మీ పోలీసు రికార్డుల్లో వాడి ఫొటో లేదా?" అన్నాడు గురవయ్య.

"లేదు అయినా నిముషానికో వేషం వేసేవాడి వివరాలు పట్టుకోవడం చాలా కష్టం. ఇన్నాళ్ళకు మాకా

అవకాశం వచ్చింది....'' అన్నాడినస్పెక్టర్.

ఆ నేరస్థుణ్ణి గుర్తు పట్టడానికి గులాబి కూడా ఆత్ర పడింది.

ముగ్గురూ జీపులో అరుణాహోటలుకు వెళ్ళారు.

"ఆ మనిషి గదిలోంచి బైటకురాలేదు సార్!'' అన్నాడు హోటల్ దగ్గర కాపలావున్న మనిషి.

"గుడ్ వర్క్!'' అని ఇనస్పెక్టరతణ్ణి మెచ్చుకున్నాడు.

రిసెప్షన్లో అతడి గురించి వివరాలు సేకరించా డినస్పెక్టరు.

అక్కడ అతడిపేరు రాజకుమార్ అని నమోదయింది. వచ్చి నాలుగు రోజులయింది. రోజూ అతణ్ణి కలుసు కొనేందుకెందరో వచ్చివెడుతున్నారు. అతడు గది తాళం రిసెప్షన్ కౌంటర్లో యివ్వడు. ఎప్పుడో బైటకు వెళ్ళి ఎప్పుడో లోపలకు వెడుతూంటాడు. కాసేపటి కితం అతడు చాలా హడావుడిగా తన గదికి వెళ్ళిపోయాడు. పోలీసు మనిషతణ్ణనుసరించి రావడంవల్లనే రిసెప్షనిస్టు కతడి రాక గురించిన స్పృహ కలిగింది.

"ఒక్క రూం నంబరిరవై రెండు తప్ప తక్కిన తాళా లన్నీ మా దగ్గిరేనా ఉన్నాయి—లేదా కష్టమర్సు బైటకు వెళ్ళలేదు. దాన్నిబట్టి వచ్చినదతడేనని అనుకున్నాను తప్ప—అప్పుడు నేనతడి ముఖంకూడా చూడలేదు—'' అన్నాడు రిసెప్షనిస్టు.

అతడు జాగ్రత్తపడుతున్నాడని ఇనస్పెక్టరు కర్థ మయింది.

అది సహజం కూడా: పోలీసులే ఈ నేరస్థుడి ధాటికి తట్టుకోలేనప్పుడు సామాన్యుడు తట్టుకోగలడా?

"సరే!'' నని అతడు ముందుకు వెళ్ళాడు. గురవయ్య,

గులాబీ అతడి ననుసరించి వెళ్ళారు.

ఇనస్పెక్టరు తటపటాయించకుండా ఇరవై రెండో నంబరు గది తలుపు తట్టాడు.

తలుపు తెరుచుకుందుకెంతోసేపు పట్టలేదు.

విసుగ్గా తలుపు తీశాడోవ్యక్తి.

అతణ్ణి చూస్తూనే గులాబి తెల్లబోయింది.

ఆమెకతడు బాగా గుర్తున్నాడు. కానీ యితడు ఆకార మంతా అదేకానీ—మనిషి ముఖం వేరుగా ఉంది.

"ఎవరుకావాలి?" అన్నాడతడు.

అతడిమాట బొంగురుగా అదోలాగుంది.

"మీరేనా రాజకుమార్?" అన్నాడినస్పెక్టర్.

"ఊఁ" అన్నాడతడు.

"ఇనస్పెక్టర్—నాకు తెలిసిన రాజకుమార్ ఇతడు కాడు...." అంది గులాబి.

ఆమె అతణ్ణి రక్షించడానికి ప్రయత్నిస్తోందేమోనని ఇనస్పెక్టరు కనుమానంవచ్చి గురవయ్యవంక ప్రశ్నార్థకంగా చూశాడు. అతడుకూడా గులాబితో ఏకీభవించాడు.

"ఏం జరిగింది?" అన్నాడా బొంగురు గొంతువ్యక్తి.

ఇనస్పెక్టర్ జరిగింది చెప్పాడు.

"ఏమో—మీరంటూంటే నా కనుమానంగా ఉంది. రూంనంబరు ఇరవై నాలుగులోని వ్యక్తి తానొచ్చేదాకా తన గదిలో ఉండమని నన్ను రిక్వెస్టుచేస్తే ఒప్పుకున్నాను. తాసేపటిక్రితం అతడు హడావుడిగా వచ్చాడు. నేను నా గదికి వచ్చేశాను...." అన్నాడు రాజకుమార్.

అందు కవకాశమున్నదని ఏసెప్షనిస్టూ పోలీసు మనిషీ కూడా అంగీకరించారు. పోలీసుమనిషి రిసెప్షనిస్టుతో మాట్లాడి అక్కడకు రావడానికి కాస్త వ్యవధివుంది.

"నేరస్థుడు చాలా తెలివిగా వ్యవహరించాడు. తనే గదిలో దూరుతున్నదీ మనకు తెలియకుండా చేశాడు...." అన్నాడినస్పెక్టరు.

"కానీ ఇరవై నాలుగో నంబరు గదినుంచి కూడా ఎవ్వరూ బైటకు రాలేదుసర్ — నేరస్థుడింకా ఆ గదిలోనే ఉండొచ్చు—" అన్నాడు పోలీసుమనిషి.

ఇనస్పెక్టర్ పోలీసు మనిషిని రాజకుమార్ దగ్గిరుండమని తనువెళ్ళి ఇరవై నాలుగో నంబరు గది తలుపు తట్టాడు. గులాబి గురవయ్య అతడి వెనుకనే ఉన్నారు.

తలుపు తెరుచుకుందు క్కాసేప్పట్టింది.

ఓ వ్యక్తి ఆవులిస్తూ—"ఇంత రాత్రివేళ— ఎవరు మీరు?" అన్నాడు.

అతడిమాట, ముఖం—గులాబి గుర్తుపట్టింది.

"అతడే — రాజకుమార్ —" అందామె. ఆ వెనువెంటనే...."కానీ...." అని ఆగిపోయిందామె.

గురవయ్య కూడా ఆ యువకుడివంకే ఆశ్చర్యంగా చూస్తున్నాడు,

అతడి ముఖం రాజకుమార్‌దే అనడంలో సందేహం లేదు. కానీ ఇతడు బాగా సన్నగా—మరింత పొడవుగా వున్నాడు.

"ముఖం సరిపోయింది కదా—మిగతా విషయంలో పొరపడి ఉంటారు" అంటూ ఇన్‌స్పెక్టరతడి గదంతా శోధించాడు. అనుమానించతగ్గదేమీ దొరకలేదు.

ఇన్‌స్పెక్టరతణ్ని పోలీసు మనిషికి చూపించాడు.

"వెనుకనుంచి చూస్తూంటే ఇరవై రెండో నంబరు గదిలోని వ్యక్తినే నేననుసరించినట్లు తెలుస్తూంది. ఇరవై నాలుగో నంబరు గది వ్యక్తి ఆకారం నేను చూడలేదు."

"ఎలా చూస్తావు? నేను ఎనిమిదింటినుంచి వళ్ళెరక్కుండా నిద్రపోతూంటే?" అన్నాడా వ్యక్తి కోపంగా. అతడు రాజకుమార్ చెప్పినదంతా అబద్ధమన్నాడు.

రాజకుమార్ గది శోధించా డినస్పెక్టర్.

అక్కడా అనుమానించ తగ్గదేమీ దొరకలేదు.

"నేరస్థుడు వీళ్ళిద్దరిలోనే ఉన్నాడు. రాజకుమార్ ఇరవై నాలుగో నంబరు గదిలోని వ్యక్తి మేకప్‌లో మీ యింటికి వచ్చి ఉండవచ్చు. కానీ ఋజువు చేయడమెలా?" అన్నాడినస్పెక్టర్ దిగులుగా.

జరిగింది గులాబీ కర్థమయింది. రాజకుమార్ మారు వేషంలో తమ యింటికొచ్చి—తిరిగి తన హోటలు గది చేరుకుని వేషం మార్చుకున్నాడు. రూపంతో తామందర్నీ కంగారు పెడుతున్నాడు.

గురవయ్య చటుక్కున ఇనస్పెక్టర్ చెవిలో—"అయ్యా! నా యింట్లో రాజకుమార్ని కత్తుల బోనులో పెట్టానుగా. గోడలో ఆ కత్తుల వేసిన గుర్తులన్నీ ఫ్రెష్‌గా ఉన్నాయి.ఇతడా గుర్తుల్లో ఇమిడిపోతే ఇతడే రాజకుమార్. నా కత్తులబోను .... వేలిముద్రలకంటే నిఖారైనదని ఏ కోర్టులోనైనా ఋజువు చేయగలను...." అన్నాడు.

ఆధారం కోసం వెతుకుతున్న ఇన్‌స్పెక్టర్‌కీ మాట లపరిమితానందం కలిగించాయి. తాత్కాలికంగా రాజకుమార్ నరెస్టు చేయడానికి కీ ఆధారం చాలు.

గురవయ్య కత్తులబోను—ఇరవై రెండో నంబరు గది వ్యక్తినే రాజకుమార్‌గా నిరూపించింది. ఆ తర్వాత అతడే నేరస్థుడని పోలీసులు నిరూపించగలిగారు.

"నా కత్తులబోనే నేరస్థుణ్ణి పట్టిచ్చింది" అని గురవయ్య ఎంతో సంతోషించాడు. □

# పంచపాతకాలు

సుంకరి రాంప్రసాద్

మోహన్‌పురా రిజర్వ్ ఫారెస్ట్‌కు దక్షిణాన, కుశీ, కారో నదీ తీరాలలో దిగంత వ్యాప్తమైన మహారణ్యంలో నివసించే ఆదిమజాతి తెగలలో అతి ప్రాచీనమైన జాతి సంతాల్!

ఆ సంతాల్ రాజ్యంలో....

చాలా ఏళ్ళ క్రితం....

మహాలిఖారూప పర్వతం మాటున సూర్యుడు అస్త

మిస్తున్న వేళ....! పర్వత పాదం వెంబడి రాళ్ళగుట్టల మీదుగా జరజర ప్రవహిస్తూ సాగిపోతున్న కారో నదిలో సంధ్యాకాంతులు ప్రతిఫలిస్తున్నాయి.

ఆ నదీ తీరాన వ్యాపించి ఉన్న విశాలమైన శాలవనం మధ్య నిలబడి ఉన్నాడొక సంతాల్ యువకుడు.

తెల్లని అడవి తేవుడీ పువ్వులు గుత్తులు గుత్తులుగా విరబూసి. ఆ తోపుకు వింత వెలుగులు తెస్తున్నాయి.

ఆ తోపు మధ్య వరుసలో నిర్మించి ఉన్నాయి చిన్న, చిన్న రాతి అరుగులు. చిన్న, చిన్న కొండరాళ్ళు దీర్ఘ చతురస్రాకారంతో అరుగుల్లా పేర్చబడ్డాయి. ఒక్కొక్క అరుగు ముందు ఒక పెద్ద బరిసె నాటబడి ఉంది.

అది సంతాల్ జాతి వారి పవిత్ర స్మశానం. దోసిలి నిండా పట్టి ఉంచిన అడవి తేవుడీ పూలను ఒక రాతి అరుగుపై ఉంచాడతడు.

రెండు క్షణాలసేపు కన్నులు అరమోడ్చి, తలవాల్చి ఆ రాతి అరుగుముందు మౌనంగా నిలబడ్డాడు. తరువాత మెల్లగా కళ్ళు తెరిచాడు.

అతని కళ్ళు ఎర్రగా నిప్పుకణాల్లా మండిపోతున్నాయి. పట్టలేని ఆవేశంతో అతని శరీరంలోని నరాలు ఉప్పొంగుతున్నాయి.

"బాసంతీ!

అమాయకురాల్ని చేసి, నీ అందాన్ని దోచుకొని, నీకు అన్యాయం చేసినవాడు, పవిత్రమైన మన సంతాల్ రక్తాన్ని కలుషితం చేసినవాడు....

ఆ రోజున మాయమై మళ్ళీ యిన్నాళ్ళకు కనుపించాడు సోదరీ!

చంపుతాను.

స్నేహానికి ప్రాణమిచ్చే సంతాల్ జాతికే ద్రోహం తల పెట్టిన ఆ తుచ్ఛుడినీ, అతని నలుగురు అనుచరులనూ చిత్రవధ చేసి చంపుతాను.

నా పూర్వ పురుషుల ఆత్మలు అనునిత్యం హాయిగా విహరించే ఈ మరు భూమిలో....అడవి దున్నల రేడు, మన కులదైవం టాండ్ బారో సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను.

సంతాల్ జాతికి జరిగిన ద్రోహానికి ప్రతీకారం చేసి తీరతా డీ జగరూపన్నా?''

సంతుష్టులైన అతని పూర్వీకుల ఆత్మలు అతనిని దీవిస్తున్నాయా అన్నట్లు....

మెల్లగా వీచిన పిల్లగాలికి కొమ్మలపై విరియబూసిన అడవి తేవిడీ పూలు అతని శిరస్సుపై జల్లుగా కురిసాయి.

రాతి అరుగు ప్రక్కనుంచిన బరిసెను చేతిలోనికి తీసుకొని, మెల్లగా అడుగులు వేస్తూ ఆ తోపు బయటకు నడిచాడు జగరూపన్నా.

## 2

"టాండ్ బారో!" అంటూ పెద్దగా నవ్వాడు దేవీ సింగ్.

అతని ముఖంలో కన్పిస్తున్న హేళనా, అపహాస్యాలను చూసి చలించిపోయాడు తివారీ.

"అలా తేలిగ్గా కొట్టి పారేయకండి బాబూ! ఈ సంతాల్ రాజ్యంలోని క్రీకారణ్యంలో....ఇంతవరకూ ఏ వేటగాడు కూడా అడవి దున్నను మాత్రం వేటాటలేదు. వాటిని టాండ్‌బారో రక్షిస్తుంటాడు.'' అన్నాడు తివారీ.

దేవీసింగ్ నవ్వుతూ తివారీవంక చూసాడు.

"టాండ్ బారో అంటే .... సంతాల్‌లు పూజించే

నిత్రాయే కదూ! ఆ నల్లరాయి ఒక దేవత! అది అడవి దున్నలను రక్షించడమూనూ!

చూద్దాం తివారీ!

ఈ దేవీసింగ్ ఆ అడవిదున్నలనే వేటాడబోతున్నాడు. ఆ నల్లరాయి కదలి వచ్చి తన కారు ఎనుములను ఎలా కాపాడుకుంటుందో....అదీ చూద్దాం!" పకపకా నవ్వుతూ అన్నాడు దేవీసింగ్.

గుర్రాలపై మాటువేసి కూర్చున్న అతని అనుచరులు నలుగురూ అతనితో పాటు శృతి కలిపారు.

దట్టంగా అలుముకున్న అడవి మధ్య ఉంది ఆ నీటి మడుగు. గుబురుగా పెరిగిన పొదలు, వాటిపై అల్లిబిల్లిగా అల్లుకున్న అడవి తీగెలూ, ఆ ప్రదేశాన్ని పూర్తిగా మరుగుపరుస్తున్నాయి.

ఓ పెద్ద వెదురు పొదచాటున గుర్రాలను నిలబెట్టి, కళ్ళాలను బిగించి పట్టుకొని, చప్పుడు చేయకుండా కూర్చుని ఉన్నారు దేవీసింగ్, అతని సహచరులు.

గంట గడిచింది.

"ఏం తివారీ! ఇక్కడేనా? నీవు సరిగ్గా చూశావా?" అసహనంగా చుట్టూ చూస్తూ అడిగాడు దేవీసింగ్.

"ఇక్కడే బాబూ! అవిగో కావాలంటే ఆ గిట్టల గుర్తులు చూడండి."

మడుగు ఒడ్డున నీరు ఎండి ఏర్పడిన బురదలో స్పష్టంగా కన్పిస్తున్న అడవిదున్నల కాలిగిట్టల గుర్తులను వారికి చూపించాడు తివారీ.

బురదలో కొట్టవచ్చినట్లు కన్పిస్తున్నాయి అరచేతి వెడల్పున ఉన్న గిట్టల గుర్తులు. వాటివంక చూసి సంతృప్తిగా తలాడించాడు దేవీసింగ్.

మడుగు ఒడ్డునా, బురదమీదా ఎనిమిదో, పదో చిన్నవీ, పెద్దవీ పాములు మెల్లగా కదలాడుతున్నాయి. పాములన్నీ విష సర్పాలే! కరాత, శంఖచితి జాతి సర్పాలు.

అవి తాము దాక్కున్న దిక్కుగా రాకూడదని మనసులోనే మ్రొక్కుకున్నాడు తివారీ.

అవి ఎంత ప్రమాదకరమైన సర్పాలో....వారిలో ఆతనికి మాత్రమే తెలుసు.

అంతలో ....

ఎదురుగా నున్న పొదలు చిన్నగా కదిలాయి. ఉలిక్కి-పడుతూ అంతా ఆ వంక చూశారు.

పొదల మధ్యనుండి మెల్లగా నడుచుకుంటూ వచ్చిందొక చిరుతపులి. మడుగు ఒడ్డుకు చేరాక, ఒకసారి చుట్టూ పరికించి చూసి, తరువాత నెమ్మదిగా నీటిని త్రాగ సాగింది.

చిరుతను చూడగానే, దానికి తుపాకీనీ గురిపెట్టాడొక అనుచరుడు. ఛటుక్కున అతని చేతిని పట్టుకొని ఆపు చేసాడు దేవీసింగ్.

"హేయ్! రాందేవ్!

ఏమిటి నీవు చేస్తున్నది? మనం వచ్చింది చిరుతల్ని వేటాడటానికా? ఎనుముల్ని వేటాడటానికా?" కోపంగా మందలించా డతడు.

తుపాకీ పేలిన మరుక్షణం ఆ శబ్దం అడవిలో ప్రతిధ్వనిస్తుంది. చిరుతమాట ఎలా ఉన్నా, ఆ శబ్దాన్ని విన్నాక మరో రెండు, మూడు దినాల వరకు అడవి దున్నలు ఆ మడుగు ఛాయలకు కూడా రావు.

అప్పుడు ఇన్ని శ్రమలకూ ఓర్చి, వేసిన ఈ మాటూ, ఈ వేటా అంతా వ్యర్థమే అవుతుంది.

తొందరపాటుతో తానెంత తప్పు చేయబోయాడో అర్థం అయ్యేసరికి చిన్నబోయింది రాందేవ్ అని పిలవబడ్డ ఆ అనుచరుని ముఖం.

అదే సమయంలో....

ఎండుటాకులు గలగల మన్నాయి. ఏవో భారీ జంతువులు బలంగా అడుగులు వేస్తున్న చప్పుడు. ఎండుకట్టెలు దేనిక్రిందోపడి పుటుక్కుమంటూ విరిగిన ధ్వని!

నీటిని త్రాగుతున్న చిరుతపులి మోరను పైకెత్తి, వాసనను పసిగడుతున్నట్లుగా ముక్కు పుటాలను ఎగురవేసింది.

అంతే!

కంగారుగా ముందుకు దూకుతూ ఆ ప్రదేశాన్ని వీడి పారిపోయింది.

'ఏదో జంతువు వస్తూంది.' అనుకున్నారు వారు.

అయితే....

తీరిగ్గా నీటిని త్రాగుతున్న చిరుతను పారిపోయేటంతగా భయపెట్టిన ఆ జంతువేమిటో అర్థంగాక....ఆశ్చర్యంగా ఆ పొదలవంక చూస్తున్నారు వారు.

చిన్న, చిన్న కొమ్మలనూ, రెమ్మలనూ కొమ్ములతో విరచుకుంటూ, పొదల మధ్యనుండి మత్తగజాల్లా ఠీవిగా నడుచుకుంటూ వచ్చాయి రెండు కారు ఎనుములు.

నల్లని విపులకాయం, ఒంటిపై పొడుగ్గా వ్రేలాడుతున్న దట్టమైనబొచ్చు, పెద్ద, పెద్ద కొమ్ములు, మండుతున్న అగ్ని గోళాల్లా మెరుస్తున్న ఎర్రనికళ్ళు....చూస్తేనే గుండెలు జలదరించేలా ఉన్నాయి వాటి ఆకారాలు.

పెద్దపులి సైతం ఒంటరిగా అడవిదున్నను ఎదుర్కొనడానికి సాహసించదంటారు! భయంకరమైన వాటి ఆకారా

లను చూశాక, ఆ మాట అక్షరాలా నిజమనిపించింది దేవీసింగ్‌కు.

మెల్లగా అడుగులు వేసుకుంటూ మడుగును సమీపించాయి ఆ దున్నలు. మోరలు సాచి నీటిని త్రాగటం ప్రారంభించాయి.

ఒక్క తివారీ తప్ప మిగిలిన అయిదుగురూ తమచేతుల లోని తుపాకులను వాటికి గురిపెట్టారు.

అయితే....అంతవరకూ మడుగునుండి దేవీసింగ్ వాళ్ళ దిక్కుగా వీస్తున్నగాలి, ఒక్కసారిగా దిశ మారింది.

గాలి ఇంతవరకూ వీరికి వాలుగా వీయటంవలనే, ఆ చిరుతపులిగాని, ఈ అడవిదున్నలుగాని వీరి వాసనను పసిగట్టలేక పోయాయి.

కాని, ఎప్పుడయితే గాలి దిశ మారిందో, వీరు దాక్కున్న పొదలనుండి మడుగు దిశగా వీయటం ప్రారంభించిందో....

ఆ మరుక్షణం మనుషుల వాసనను పసిగట్టేయి ఆ అడవి దున్నలు.

వాటి శరీరం మీది రోమాలు నిక్కబొడుచుకున్నాయి. కాలి గిట్టలతో నేలను దువ్వుతూ మోరలను పైకెత్తి, చెవులను నిగిడ్చి, ముక్కు పుటాలను పెద్దవిచేస్తూ, బలంగా నిశ్వసిస్తూ హుంకారం చేసాయవి.

అంతవరకూ ఆ ఇంకిన పంకంపై హాయిగా, స్వేచ్ఛగా విహరిస్తున్న సర్పాలు....ఆ దున్నల హుంకారానికి భయవిహ్వాలలై....జర జరా ప్రాకుకుంటూ ఆ ప్రదేశాన్ని వీడి పారిపోయాయి.

ఒక శంఖచితి జాతి సర్పం దేవీసింగ్ వాళ్ళుదాక్కున్న పొదవైపు ప్రాకుకుంటూ రాసాగింది.

తివారీతో సహా....ఎవరూ ఆ సర్పాన్ని గమనించలేదు. వారి దృష్టి అంతా అడవి దున్నలపైనే ఉంది.

అదే సమయంలో....

వారికి ఇరవై గజాల దూరంలోనున్న మరో పొదలో దాక్కొని ఉన్న జగరూపన్నా చేతిలోని వింటిని ఎక్కుపెట్టేడు. విషం పూయబడ్డ వాడియైన శరం ఆ వింటికి సంధింపబడి ఉంది.

శరం శరీరాన్ని తాకిన రెండు క్షణాలలో ప్రాణాలను హరించే శక్తివంతమైన విషం అది.

జగరూపన్నా దృష్టి అంతా వారిపైనే ఉంది. ఆకర్ణాంతమూ నారిని సారించి సిద్ధంగా పట్టుకున్నాడతడు.

ట్రిగ్గర్లపై వారి చూపుడు వేళ్ళు బిగుసుకుంటున్నాయి. మరో క్షణంలో....

వారి తుపాకులు నిప్పులు గ్రక్కబోతూన్నాయి. జగరూపన్నా సంధించిన అమ్ము విషం గ్రక్కబోతూంది.

అంతలో....

ఆ అడవిదున్నల ఉగ్రరూపాన్ని చూసి అసహనంగా చిన్నగా కదిలాయి వారు కూర్చున్న గుర్రాలు. అదే క్షణంలో ఆ గుర్రాల కాళ్ళక్రిందనుండి ప్రాకుకుంటూ పోతూంది ఆ శంఖచితి సర్పం. ఒక గుర్రపు కాలిడెక్కసరిగ్గా ఆ సర్పం తోకపై పడింది.

అంతే!

చివ్వున వెనుతిరిగి, పడగనువిప్పి పూత్కారం చేస్తూ, పట్టలేని కోపంతో ఆ గుర్రపు కాలుపై కసిగా కాటు వేసిందా సర్పం.

అంతే!

భరించలేని బాధతో సకిలిస్తూ ముందు కాళ్ళను

పైకెత్తిందా అశ్వం. దానిపై అదాటుగా కూర్చున్న ఒక అనుచరుడు పట్టుతప్పి క్రిందకు జారిపోయాడు. మిగిలిన అశ్వాలు కూడా బెదరి, సకిలిస్తూ చిందర వందరగా కదం త్రొక్కసాగాయి.

ఆ త్రొక్కిసలాటలో, ఆ అశ్వాల కాళ్ళమధ్య చిక్కుకు పోయాడు క్రిందపడ్డ ఆ అనుచరుడు గుండెనూ, పొట్టనూ, ముఖాన్నీ భుజాలనూ ఆ అశ్వాలు తమ కాలి డెక్కలతో చితక త్రొక్కేస్తుంటే భరించలేని బాధతో ఆర్తనాదం చేశాడా అనుచరుడు.

అదే క్షణంలో వారి చేతులలోని తుపాకులు గర్జించాయి. జగరూపన్నా సంధించిన అమ్ముని విడిచిపెట్టాడు.

అయితే గుర్రాలు చిందరవందర కావడంతో వారి గురి తప్పింది. తుపాకీ గుళ్ళు గాలిలో దూసుకుపోయాయి. వాటి మ్రోతలతో అడవి మార్మోగిపోయింది. ఆ శబ్దానికి బెదరి ఆ అడవిదున్నలు పారిపోయాయి.

తుపాకీ గుళ్ళు వట్టిపోయినా, జగరూపన్నా విడిచిన అమ్ము మాత్రం వ్యర్థంకాలేదు.

కాకుంటే, దేవీసింగ్ కంఠానికి గురిపెట్టబడ్డ ఆ అమ్ము తగిలినది మాత్రం మరో అనుచరుని భుజానికి. అమ్ము విషపూరితం కావటంవలన క్షణంలో అతని ప్రాణాలు అనంత విశ్వంలో కలిసిపోయాయి.

విగత జీవుడై పడివున్న తన అనుచరుని భుజంలో దిగబడ్డ బాణంవంక ఆశ్చర్యంగా చూశాడు దేవీసింగ్.

ఆ బాణాన్ని పైకిలాగాడు రాందేవ్. ఆ బాణాన్ని చూస్తూనే తివారీ ముఖం నల్లగా మాడిపోయింది.

"సంతాల్ జాతి యుద్ధబాణం!" అప్రయత్నంగా అతని పెదవులు వీడి వచ్చాయా మాటలు.

అంతే!

ఎవరో ఛెళ్నాకోలతో వెన్నుమీద చరిచినట్లు ఉలిక్కి పడ్డాడు దేవీసింగ్

"సంతాల్స్ వార్ యారో!" మెల్లగా తనలో తానే గొణుక్కున్నాడతడు.

"విష లిప్తమయిన యుద్ధబాణాన్ని ప్రయోగించి మరీ ఇతడి ప్రాణాలను తీసారంటే, సంతాల్ జాతివారెవరో ఖచ్చితంగా ఇతనిమీద పగబట్టి ఉంటారు!

వారి పగ ఇతడిపైనేనా!

లేక, మనలో ఎవరికో గురి పెట్టబడిన అమ్ము, మన అశ్వాల కదలికలో గురితప్పి ఇతనికి తగిలిందా?

తమకు ద్రోహంచేస్తే తప్ప, పరాయివారి జోలికి కూడా పోని, సంతాల్ జాతివారు పగబట్టి ప్రాణాలు తీసేటంతగా....వారికి ద్రోహం చేసినవారు మనలో ఎవరున్నారు?"

తనలో తానే తర్కించుకున్నట్లుగా మెల్లగా అన్నాడు తివారీ.

అతని మాటలు చెవిని పడేసరికి రక్తం యింకిపోయినట్లు తెల్లగా పాలిపోయింది దేవీసింగ్ ముఖం.

## 3

ఏపుగా ఎదిగిన పెద్ద మోదుగు చెట్టుక్రింద కాంప్ చైర్‌లో కూర్చుని పెద్ద జగ్గుతో సీరాను సేవిస్తున్నాడు దేవీసింగ్. అతని ప్రక్కనే నిలుచుని జగ్గు ఖాళీ అయినప్పుడల్లా దానిలో సీరాను నింపుతున్నాడు రాందేవ్.

వారికి కొంతదూరంలో ....

అశ్వాల క్రిందపడి నజ్జు, నజ్జయిన దేవీసింగ్ అను

చరుడు పెద్ద కంబళిపై పడుకుని ఉన్నాడు. ఉండి, ఉండి బాధతో పెద్దగా మూల్గుతున్నాడు. అతని ప్రక్కనే కూర్చుని మరో అనుచరుడు అతనికి సపర్యలు చేస్తున్నాడు.

దేవీసింగ్ దృష్టి వీరిపైనలేదు. అతడు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అతని చూపులు అసహనంగా ఉన్నాయి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు ఠాకూర్? తివారీ అన్న మాటల గురించేనా?" ఖాళీ అయిన జగ్గును సీరాతో నింపుతూ అడిగాడు రాందేవ్.

అవునన్నట్లు మెల్లగా తలాడించాడు దేవీసింగ్. ఒక్క క్షణం తరువాత తలను పైకెత్తి, రాందేవ్ వంక చూస్తూ....

"రెండేళ్ళ క్రితం మహాలిఖారూప అరణ్యంలో లక్కను పెంచడానికి ఒక రేగుచెట్ల తోపును కౌలుకు తీసుకున్నాం. గుర్తుందా రాందేవ్?"

ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకుంటూ 'ఔనన్నట్లు' తలాడించాడతడు.

"ఆ రోజుల్లో రేగుపళ్ళను ఏరుకోవడానికి, వెదురు బుట్టా, కొంకీపట్టుకొని మన తోపులోనికి ఒక సంతాల్ యువతి వచ్చేది. బాసంతి అని! మనందరం కలిసి ఆమె శీలాన్ని దోచుకున్నాము....ఆమె చనిపోయింది....ఆ రాత్రే మనం మకాం ఎత్తేశాం —"

గుర్తుకు వచ్చిందా అన్నట్లు రాందేవ్ వంక చూశాడు దేవీసింగ్.

"ఆ బాసంతి సంబంధీకులెవరో మనమీద పగబట్టారంటారా ఠాకూర్?"

ఎంత దాచుకుందామన్నా దాగని భయమేదో రాందేవ్ గొంతులో లీలగా కదలాడింది.

"అయి ఉండొచ్చు రాందేవ్! ఏది ఏమయినా ఈ క్షణం

నుండీ మనం చాలా జాగ్రత్తగా ఉండాలి" అంటూ ఇంకేదో చెప్పబోతూన్న దేవీసింగ్, అటువైపుగా తివారీ రావటంతో టక్కున మాటను మార్చేశాడు.

పరాయివాడు. అందులోనూ అటవీ ప్రాంతం వాడయిన తివారీ ముందు బాసంతి గూర్చి మాట్లాడటం యిష్టం లేక పోయింది అతనికి.

'ఎంతయినా తివారీ....రాందేవ్ ఒకటి కాదుగా! కేవలం ఈ అడవిదున్నల వేటకోసమే అతడిని తమతో పాటుగా ఉంచుకున్నారు. ఈ వేట పూర్తయితే అతడెవరో, తామెవరో!

ఈ నాలుగురోజుల భాగ్యానికి తమ గత జీవితపు పుటలను ఇతని ముందు ఎందుకు తెరచి పెట్టాలి?' అనుకున్నాడు దేవీసింగ్.

"ఏం తివారీ ఇంతసేపూ ఎక్కడకు పోయావు?" అతనివంక సాదరంగా చూస్తూ అడిగాడు.

దేవీసింగ్ ప్రశ్నకు సమాధానంగా తన చేతులలోని అడవికోళ్ళను ఎత్తి చూపించాడతడు.

తామంతా భోజనం సంగతి మరచిపోయినా, తాను మాత్రం గుర్తుంచుకొని అడవికోళ్ళను వేటాడి తెచ్చిన తివారీవంక ప్రశంసాపూర్వకంగా చూశాడతడు.

కోళ్ళను చూస్తూనే, కడుపులో కర, కరలు బయలుదేరాయి రాందేవ్‌కు. తివారీ చేతిలోని కోళ్ళను ఆత్రంగా అందుకొని, వాటిని వ్రేల్చడానికి పరుగెత్తాడు.

## 4

చిక్కబడిన చీకటిలో బిక్కు, బిక్కుమంటూ ఉండలేకేమో, ఆకాశం చుక్కల దీపాలను వెలిగించుకుంది.

లోకమంతా నిద్రించేవేళ, అడవి మాత్రం ఆవులిస్తూ

నిద్ర లేచింది.

పగలంతా నెలవుల్లో దాక్కున్న జంతువులు చీకటి పడటంతోనే, కాళ్ళను సాగదీసుకుంటూ వేటకు బయలు దేరాయి.

అడవి మధ్యనున్న ఆ దేరావైపు పాములా ప్రాకు కుంటూ వచ్చాడు జగరూపన్నా. చుట్టూ ఒక్కసారి పరికించి చూశాడు.

అంతా నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉంది. మొలనున్న బాకును తీసి దేరా గుడ్డను నిలువుగా కోశాడు. మనిషి దూరేంతటి కంత ఏర్పడింది. అందులోనుండి లోనికి చూశాడు.

గుడారం లోపల చిన్న కోడిగుడ్డు దీపం వెల్గుతూంది. ఆ గుడ్డి వెలుగులో నేలపై కంబళ్ళు పరచుకొని నిద్ర పోతున్న ఇద్దరు వ్యక్తులు కన్పించారు అతనికి. అందులో ఒక వక్తి, ఉండి, ఉండి బాధగా మూల్గుతున్నాడు.

'అశ్వాల వలన గాయపడిన అనుచరునికి తోడుగా అమరొక అనుచరుడిని గుడారంలోనే వదలి, తివారీని తోడుగా తీసుకొని రాందేవ్, దేవీసింగ్ వేటకు వెళ్ళారని' అతనికి తెలుసు.

చిన్నగా తలను పంకించి, ఆ కంతగుండా మెల్లగా లోనికి ప్రవేశించాడతడు. ఆ చిన్న దీపపు గుడ్డి వెలుగులో కూడా, అతని చేతిలోని గండ్రగొడ్డలి అంచు వాడిగా తళతళ మని మెరుస్తూంది.

నిరాయుధుని, నిద్రిస్తున్న వాణ్ని చంపటం పాపమని కూడా ఆలోచించలేదతడు. ఒక మృగాన్ని, మరో మృగం వేటాడేటప్పుడు నీతులూ, ధర్మసూత్రాలూ గుర్తుకు రావు.

ఒకే, ఒక్క వేటుతో ఆ అనుచరుని తల తెగి

పోయింది. కంఠనాళాలు తెగిపోయి రక్తం వరదలు కట్టింది.

గాయపడి, పడుకున్న రెండవ అనుచరుడు ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా రక్తసిక్తమైన గొడ్డలితో కాలయము డిలా నిలుచున్న జగరూపన్నా వంక భయంగా చూశా డతడు.

ప్రక్కనే శిరసు తెగి రక్తంతో ఓలలాడుతున్న తన సహచరుని శవాన్ని చూసే సరికి అతడు భయంతో గజ, గజా వణికిపోయాడు.

అతడిని చూసి క్రూరంగా నవ్వాడు జగరూపన్నా. గుడారంలో ఓ మూల నున్న చమురు సీసాను, దీపాన్నీ తీసుకొని అతన్ని సమీపించాడు.

జగరూపన్నా చేయబోతున్నదేమిటో గ్రహించగానే భయంతో, ఆందోళనతో విపరీతంగా చలించిపోయా డతడు.

"వద్దు! వద్దు! దయచేసి నన్ను చంపొద్దు!" హీన స్వరంతో. మ్లాన వదనంతో, కన్నీళ్ళతో అర్థించాడతడు.

ఆ క్షణమే లేచి, అక్కడ నుండి పారిపోదామని ఉందతనికి. కాని, శరీరంలోని ఏ అవయవాన్ని కూడా కదిపే స్థితిలో లేడతడు. గుర్రపు డెక్కల క్రింద నలిగి, కమిలి, నజ్జయి పోయింది అతని దేహం.

ప్రాణభయంతో నిస్సహాయంగా రోదిస్తున్నాడతడు.

తనకేమీ పట్టనట్లుగా, నిర్వికారంగా సీసాలోని చము రును అతనిపై వంపాడు జగరూపన్నా.

'ఆరోజు నా చెల్లెలు కూడా నీలాగే తనను విడిచి పెట్ట మని కన్నీళ్ళతో మిమ్మల్ని అర్థించిందిరా రాక్షసుడా! ఒక పసి కూనను అయిదుగురు కలసి అమానుషంగా చెరిచారే

గుర్తుందిరా?

ఆ పాపానికి శిక్షగా, బ్రతికుండగానే ఈ మంటలలో మాడిపో! మాడి మసిగా మారిపో!'

పట్టలేని క్రోధంతో ఆ దీపాన్ని అతనిమీదకు విసిరాడు జగరూపన్నా!

అంతే!

చమురుతో తడిసిన అతని దేహానికి భగ్గున అంటుకున్నాయి మంటలు. భరించలేని బాధతో ఆర్తనాదాలు చేస్తున్న అతనివంక ఆనందంగా చూశాడు జగరూపన్నా.

తన చేతిలో హతమవుతున్న ఎరవంక పెద్దపులి కూడా సరిగ్గా అలాగే చూస్తుంది. అది మృగ లక్షణం! అది వేటగాని మన స్తత్వం!

# 5

రాత్రి మూడో ఝాము గడిచి ఉంటుంది.

నిశీధి నెరజాణ తెల్లని మంచు చీరను కట్టుకొని, సూర్యుని లేత కిరణాల కౌగిలిలో కరిగిపోవడానికి తహ, తహ లాడిపోతూంది.

రేయి అంతా రేరాజుతో గడిపిన తీపి అనుభవాలకు గుర్తుల్లా, నీలాల కురుల్లో వదలిన మల్లెల్లా ఉన్నాయి నింగిలో వెలాతెలాబోతున్న చుక్కలు.

"ఏం తివారీ! యింకెంత సేపు?" వస్తున్న ఆవులింతను బలవంతంగా ఆపుకుంటూ అడిగాడు దేవీసింగ్.

రాత్రంతా నిద్ర లేకపోవటం వలన వారి కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి. ఎత్తయిన ఒక చెట్టు కొమ్మపై, ఆకుల మాటున కూర్చుని ఉన్నారు వారు.

"అడవి దున్నల గుంపు రోజూ ఇటే పోతుంది బాబూ! కొంచెం ఓపిక పట్టండి" అన్నాడు తివారీ.

"నేనొకసారి క్రిందకు దిగివస్తాను. కూర్చొని, కూర్చొని, కాళ్ళు నొప్పులు పెడుతున్నాయి."

క్రొమ్మమీద నుండి క్రిందకు దిగడానికి ఆయత్తమౌతూ అన్నాడు రాందేవ్.

"భద్రం రాందేవ్!" అన్నాడు తివారీ అతని భుజాన్ని తడుతూ.

"ఇది ఉండగా నాకేం భయం తివారీ!" అన్నాడు రాందేవ్ వీపుపై వ్రేలాడుతున్న రైఫిల్ వంక గర్వంగా చూస్తూ.

చెట్టుపై నుండి క్రిందకు దిగి, బద్ధకంగా వళ్ళు విరచుకుంటూ మెల్లగా ముందుకు నడిచాడు రాందేవ్. చేతిలో నున్న స్టెన్ గన్‌ను తివారీ కిచ్చి, ఫ్లాస్క్‌లోని టీని కప్పులోనికి వంపుకుంటున్నాడు దేవీసింగ్.

అంతలో—.

ఎదురుగా నున్న పొదలు గలగల మంటూ కదిలాయి. వెడద కొమ్ములతో, నల్లని విపులకాయంతో, పొదలను చీల్చుకుంటూ బయటకు వచ్చిందొక కారు ఎనుము.

మనిషి వాసన సోకింది గాబోలు, మోరను పైకెత్తి, ఎర్రని కళ్ళను విప్పార్చుకొని చూసిందది. ఎదురుగా.... ఇరవై గజాల దూరంలో నడుచుకుంటూ వస్తున్న రాందేవ్ దాని కంటబడ్డాడు.

అదే క్షణంలో రాందేవ్ కూడా ఆ మహిషాన్ని చూశాడు. భయమూ, ఆశ్చర్యం, ఆనందం ఒక్క క్షణంలో అతని మనసును ఆక్రమించుకున్నాయి.

తోకను పైకెత్తి, రోమాలను నిక్కించి, కొమ్ములను బారుచేసి, వెనుక కాలిగిట్టలతో మట్టిని దువ్వుతూ గట్టిగా హుంకరించింది ఆ దున్న. వేయి శిరసుల నాగేదో బుస

కొట్టినట్లుంది ఆ ధ్వని.

పీపునున్న రైఫిల్‌ను చేతిలోనికి తీసుకొని ఆదున్నకు గురిపెట్టేడతడు.

అతడినీ, ఆ మహిషాన్నీ చూసి "రాందేవ్!" అంటూ కంగారుగా పిలిచాడు తివారీ

'ఏం?' అన్నట్లు ఒక్కసారి తలను పైకెత్తి అసహనంగా అతనివంక చూశాడు రాందేవ్.

అదే క్షణంలో....వింటిని విడిచిన బాణంలా ఒక్కసారిగా రివ్వున ముందుకు దూసుకు వచ్చిందా అడవిదున్న. చూపును మరల్చి, సరిగ్గా గురిచూసే వ్యవధికూడా చిక్కలేదతనికి.

అంత దగ్గరలో ప్రళయకాల పర్జన్యంలా దూసుకు వస్తూన్న ఆ కారు ఎనుమును చూసేసరికి కంగారుతో అతని చేయి చిన్నగా వణికింది.

కాలయమునిలా ముందుకు ఉరుకుతున్న ఆ కారు ఎనుము వంక ఆందోళనగా చూశాడు దేవీసింగ్. త్రాగుతున్న టీని కప్పుతో సహా క్రిందకు విసిరేసి. ఛటుక్కున తివారీ చేతిలోనున్న స్పెన్ గన్‌ను అందుకున్నాడతడు.

గన్‌ను దున్నకు గురిపెట్టాడు.

కారు ఎనుము నొసటికి గురిచూసి రైఫిల్ ట్రిగ్గర్‌ను నొక్కాడు రాందేవ్.

అప్పుడు అతనికీ మహిషానికీ మధ్య కేవలం పది గజాల దూరం మాత్రమే ఉంది. అంత దగ్గరిలో గురి తప్పటమనే సమస్యే లేదు.

అయితే అదే క్షణంలో తన మోరను క్రిందకు వంచటంతో, కొమ్ముల అంచుల మధ్యనుండి. ఆ అడవిదున్న వెన్నుపైనున్న రోమాలను రాసుకుంటూ పోయింది ఆ

రైఫిల్ గుండు.

మరోసారి రైఫిల్‌ను పేల్చే అవకాశమే చిక్కలేదు రాందేవ్‌కు.

సుడిగాలిలా వచ్చి అతనిని తాకింది. ఆ అడవిదున్న. వాడియైన దాని ఎనుముకొమ్ము బరిసెలా అతని కడుపులో గ్రుచ్చుకుంది.

ఈ మధ్యలో....

దున్నకు గురిచూస్తూ స్టెన్‌గన్ ట్రిగ్గర్‌ను నొక్క బోయేంతలో, దేవీసింగ్ అరచేతిలో నుండి దూసుకు పోయిందొక వాడిఅయిన బాణం. అతని చేతిలోని స్టెన్ గన్ తృళ్ళిపడింది.

అతని అదృష్టం! ఆ అమ్ము విషలిప్తం కాదు. రక్తం ఓడుతున్న అరచేతిని మరో చేతితో గట్టిగా పట్టుకుంటూ ఆత్రంగా క్రిందకు చూశాడతడు.

తలను విసురుగా విదలించింది ఆ దున్న. అయిదడుగుల దూరం ఎగిరిపడ్డాడు రాందేవ్. అతని కడుపు చీలి ప్రేగులు పైకి వచ్చాయి. మరోసారి కొమ్ములతో అతని గుండెను క్రుమ్మిందా దున్న.

అంతే!

గుండెలు పగిలిపోయి, రక్తం క్రక్కుకుంటూ, తుది శ్వాసను విడిచాడు రాందేవ్.

భయంతో, పాలిపోయిన ముఖంతో జరిగినదంతా కళ్ళప్పగించి చూస్తున్నాడు దేవీసింగ్. అతనికి ఎందుకో తివారీ మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఈ సంతాల్ రాజ్యంలోని కీకారణ్యంలో ఇంతవరకూ ఏ వేటగాడు కూడా అడవిదున్నను మాత్రం వేటాడలేదు.

వాటిని టాండ్‌బారో రక్షిస్తుంటాడు.

నిజమేనా?

టాండ్‌బారో నిజంగా ఆ కారు ఎనుములను రక్షిస్తుంటాడా? లేకుంటే ఆ రోజు ఆ మడుగు ఒడ్డున ఆ సర్పం వచ్చి తమ అశ్వాలను కాటేయడమేమిటి? ఈ రోజు ఇంత దగ్గరలో కూడా రాందేవ్ గురి తప్పడమేమిటి?''

రక్తసిక్తమయిన కొమ్ములతో ఠీవిగా నడుచుకుంటూ పోతున్న ఆ అడవి దున్నను చూస్తూ అనుకున్నాడతడు.

కాని గాయపడి, బాధ పెడుతూన్న అరచేయి గుర్తుకు వచ్చేసరికి అతని ఆలోచనల్లో మార్పు వచ్చింది.

"లేదు. దీనంతటికీ కారణం ఆ అజ్ఞాత సంతాల్‌జాతి వాడే!'' అనుకున్నాడతడు పండ్లు పటపటా కొరుకుతూ.

"ఎవరు? ఎవరది?''

అసహనంగా చుట్టూ కలియజూసాడతడు.

అంతలో ఎదురుగా నున్న చెట్ల గుబురుల మధ్య నుండి బయటకు వచ్చాడు జగరూపన్నా. అతని చేతుల లోని విల్లమ్ములను చూడగానే....తనపై బాణాన్ని ప్రయోగించిన సంతాల్ జాతివాడు అతడేనని గ్రహించాడు దేవీసింగ్.

'తన చేతిలో ఆయుధమేమీ లేదు. ఎలా తన ప్రత్యర్థిని ఎదుర్కోవాలి?'

ఒక్కసారి క్రిందకు చూశాడు దేవీసింగ్. మోకాటి లోతు రెల్లు గడ్డితో, ముండ్ల తుప్పలతో నిండి ఉంది ఆ ప్రదేశం.

"అక్కడే....ఆ తుప్పలలోనే పడి ఉండాలి తన స్టెన్‌గన్. అది తన చేతికి చిక్కితే చాలు: శత్రువును క్షణంలో హతమార్చగలడు."

ఆ ఆలోచన వచ్చాక, వెనుక ముందు లాలోచించలే దతడు. చెట్టుపై నుండి క్రిందనున్న తుప్పలలోనికి దూకేసాడు.

గాయపడిన అరచేతిపైగాని, వంటికి గీచుకుంటున్న ముళ్ళ చెట్లపైగాని అతని దృష్టి లేదు.

అతని ధ్యాసంతా ఇప్పుడు ఆ స్టెన్‌గన్ పైనే! ఆత్రంగా ఆ గన్ కోసం. ఆ పొదలను గాలించసాగా దతడు.

నిదానంగా అడుగులు వేసుకుంటూ ఆ పొదలను సమీపించాడు జగరూపన్నా.

"ఏమిటి వెదుకుతున్నావు బాబూ? తుపాకీయేనా? అది నా దగ్గిరుంది బాబూ!"

హతాశుడై పైకి చూశాడు దేవీసింగ్.

ఎదురుగా తివారీ. అతని చేతిలో తన స్టెన్‌గన్. నమ్మలేనట్లు అతని వంక చూశాడతడు.

'ఎప్పుడు క్రిందకు వచ్చాడు? ఎలా ఆ గన్‌ను చేజిక్కించుకున్నాడు?'

ఇది కాదు అతడు ఆలోచిస్తున్నది. గన్ చేతికి చిక్కిన వెంటనే శత్రువునయినా చంపి ఉండాలి లేదా, గన్‌ను తనకు అందివ్వాలి. కాని, ఆ రెండూ చేయకుండా ఎందుకంత నిదానంగా నిలబడి ఉన్నాడు తివారీ?

కొంపదీసి తివారీ కూడా శత్రువుల మనిషి కాదు కదా!

తన నీడను చూసి, తానే భయపడే స్థితిలో వున్నాడతడు.

అతని మనసులోని భావాలను చదివినట్లు చిన్నగా నవ్వాడు తివారీ.

"మీ గురించీ, బాసంతి గురించీ అంతా విన్నాను బాబూ!

అడవికి మీరు వచ్చింది జంతువులను వేటాడటానికనుకున్నాను. కాని అమాయకురాలైన బాసంతిని వేటాడి చంపిన కాముకులని తెలుసుకోలేకపోయాను.

మీరిచ్చే కాసులకు ఆశపడి, మీకు అడవి దున్నల జాడలను చెప్పాను. ఒక కన్నెను బలిగొన్నారని తెలిశాక. పెద్దపులులలాంటి మిమ్మల్ని వేటాడటానికి పూనుకున్న జగరూపన్నాకు మీ జాడలను చెప్పాను.

ఏం బాబూ! నేను చేసినది తప్పంటారా!"

తివారీ మాటలను వినేసరికి నల్లగా మాడిపోయింది దేవీసింగ్ ముఖం.

వింటిని సవరించుకుంటూ తన వంకే క్రూరంగా చూస్తున్న జగరూపన్నాను చూసేసరికి పైప్రాణాలు పయినే పోయాయి అతనికి.

'నిరాయుధుడయిన తాను వారిద్దరినీ ఎదురించలేనని' అతనికి తెలుసు.

'ఏం చేయాలి?

ఎలా వారినుండి తప్పించుకోవాలి?'

ఆలోచనలతో కాలాన్ని వృధా చేయలేదతడు. గిరుక్కున వెను తిరిగి, పొదలకు అడ్డం పడి వేగంగా పరుగెత్తసాగాడతడు.

విల్లును ఎక్కుపెట్టి జగరూపన్నా, రైఫిల్‌ను బారు చేసి తివారీ....వారిద్దరు కూడా అతని వెనుకే పరుగెత్తారు.

ముళ్ళు గీచుకొని వళ్లు చీరుకుపోతున్నా అయాసంతో గుండెలు ఎగిసిపడుతున్నా పరుగును ఆపటం లేదతడు.

పరుగు: పరుగు! ఒకటే పరుగు!

ప్రాణ రక్షణకోసం ఒకరు.

ప్రాణభక్షణ కోసం మరొకరు.

అలా పరుగెత్తుతూ దట్టమైన తోపును దాటి పెద్ద గడ్డి మైదానంలోనికి ప్రవేశించాడు దేవీసింగ్.

గ్రుడ్డిగా అతన్ని వెన్నాడుతూ, ఆ మైదానంలోనికి అడుగు పెడుతున్న జగరూపన్నా భుజాన్ని పట్టుకొని ఆపు చేసాడు తివారీ.

'ఏం' అన్నట్లు చూశాడు అతడు.

మాట్లాడకుండా ముందుకు వ్రేలితో చూపించాడు తివారీ

భయాశ్చర్యాలతో అతని కళ్ళు పెద్దవయ్యాయి. మరుక్షణం సన్నని దరహాసంతో అతని పెదవులు విచ్చుకున్నాయి.

ఎదురుగా నున్న తోపులో నుండి శరవేగంతో ఆ మైదానంలోనికి దూసుకు వస్తూందొక కారు ఎనుముల గుంపు.

ప్రళయకాల పర్జన్య సమూహంలా ఉప్పొంగిన నీలి సంద్రపు తరంగంలా దూసుకు వస్తూంది ఆ అడవిదున్నల గుంపు. వాటి గిట్టల చప్పుళ్ళతో అడవి హోరెత్తిపోతూంది.

గ్రుడ్డిగా ఆ మైదానంలోనికి అడుగు పెట్టిన దేవీసింగ్

ఎదురుగా రంకెలు వేస్తూ, ఉరుకులు, పరుగుల మీద వచ్చి పడుతున్న ఆ మహిషాల్ని చూసేసరికి హతాశుడై పోయాడు.

తప్పించుకొని పారిపోవడానికి కూడా అవకాశం లేక పోయిందతనికి. వెను తిరిగి రెండు అడుగులు వేసేసరికి అతన్ని సుడిగాలిలా క్రమ్ముకున్నాయి ఆ కారు ఎనుములు.

వాటి వాడికొమ్ముల తాకిడికి తృళ్ళి, వాటి గిట్టల క్రిందపడి నుజ్జు నుజయిపోతూ బాధతో ఆర్తనాదాలు చేస్తూన్న దేవీసింగ్ వంక ఆనందంగా చూశాడు జగ రూపన్న.

'అడవి దున్నలను వేటాడటానికి అడవికి వచ్చిన దేవీసింగ్, ఆ దున్నలతోనే వేటాడబడి చావటం విచిత్రం కాదూ?' అనుకున్నాడు తివారీ. □

## కౌబాయ్ స్టైల్!!



రాము బాధగా కళ్ళు మూసుకొన్నాడు. పొట్ట చేత్తో పట్టుకొని మంచం మీద ఉంగ చుట్టుకుపోయాడు.

రెండు రోజుల నుండి అతడు కడుపు నొప్పితో బాధ పడుతోన్నాడు. డాక్టరుకు చూపించుకోవటానికి సిగ్గుపడి పోయాడు. దానికి కారణం వుంది. అతడో పెద్ద ఫార్మా

స్యూటికల్ కంపెనీకి యజమాని. రెండు సంవత్సరాల క్రితం ఆతడు 'పెయిన్‌టోమా' అనే టానిక్‌ను మార్కెట్‌లోనికి తీసుకు వచ్చాడు.

పెయిన్‌టోమా కడుపునొప్పికి ప్రత్యేకంగా చెయ్యబడిన మందు.

కడుపు నొప్పి రకరకాల కారణాలవల్ల వస్తుంది. కారణం ఏదయినా పెయిన్‌టోమా నొప్పిని వెంటనే రిలీవ్ చేస్తుంది. ఆడా మగా వయసుతో సంబంధం లేకుండా దానిని వాడొచ్చు మరో విచిత్రం జాండిస్‌మీద కూడా ఆ టానిక్ మంచి ప్రభావాన్నే చూపిస్తుంది.

అది రాము అదృష్టమో లేక టానిక్ మంచిది కావటమో తెలీయదు గాని, మొదటి ఒక్క నెల మాత్రమే ఆ టానిక్‌కు అడ్వర్టయిజ్‌మెంట్ కావల్సి వచ్చింది. రెండో నెల నుండి ఏ యిబ్బందీ లేకుండానే వేలకు వేల సీసాలు అమ్ముడయిపోయాయి.

అన్నిటికన్నా మరో విచిత్రం ఏమిటంటే పెయిన్‌టోమా రిలీజయిన రెండు నెలలకు సరిగ్గా అటువంటిదే మరో టానిక్ బజారులోకి వచ్చింది. దాన్ని రాము అపోనెంట్ బంగార్రాజు రిలీజ్ చేశాడు. దాని ఖరీదు పెయిన్‌టోమాకు రెట్టింపు. దానికీ మార్కెట్‌లో మంచి ఆదరణ లభించింది. అయినాసరే పెయిన్‌టోమా సేల్సుకు ఢోకా లేకపోయింది. దానిమీద రాము లక్షలకు లక్షలు ఆర్జించాడు.

రాముకు మాత్రం పెరటి చెట్టున్నట్టు పెయిన్‌టోమా అతడి మీద ఏమాత్రం ప్రభావాన్ని చూపలేకపోయింది. మందు తాగితే దానిలో వున్న సెడెటివ్ మూలంగా ఓ రెండు గంటలపాటు హాయిగా నిద్ర పడుతుంది. మెలు

కువ వచ్చాక మళ్ళీ మామూలే.

అసలు రాముకు తన మందుమీద నమ్మకం లేదు. అతనికి తెలుసు అది మామూలు జింజర్‌లాంటిదని. రూపాయయినా ఖర్చు చెయ్యకుండా దానిమీద అయిదు రూపాయల చిల్లర సంపాదిస్తున్నాడు.

రాము మంచం మీద నుండి బాధగా లేచాడు.

అతడి భార్య పంకజం వంట ప్రయత్నంలో వుంది. వంటింట్లోంచి చప్పుళ్ళు వినబడుతోన్నాయి.

రాము రెండడుగులు వేశాడు. ఇక అతడు ముందుకు పోలేకపోయాడు. గోడను పట్టుకుని వుండిపోయాడు. రెండు నిముషాలు అలుపు తీర్చుకుని అక్కడే నేలమీద కూర్చుండిపోయాడు.

వంటింటిలోంచి బయటకు వచ్చిన పంకజం కంగారు పడిపోయింది. డాక్టర్‌ని పిలుస్తానని ఫోన్ దగ్గరకు వెళ్ళింది.

రాము ఆమెను వారించాడు.

"ఏమిటండీ మొండి పట్టుదలా మీరూనూ. మీ శరీరం వుక్కుముక్కయినంత మాత్రాన తుమ్మకుండా దగ్గకుండా బతకగలరా ఏం? అయినా డాక్టర్ దగ్గరకు వెళ్ళటం అంటే అలా బాధపడిపోతారేం?" కొంచెం మందలించినట్లుగానే అంది పంకజం.

రాము నిర్లిప్తంగా నవ్వాడు. "నీకు చెప్పినా అర్థం కాదు. గొడవెందుకుగానీ కంపెనీకి ఫోన్ చేసి కెమిస్టు శంకరాన్ని రమ్మను. బండిమీద వచ్చెయ్యమను. అయిదు నిముషాలలో అతడు యిక్కడ వుండాలి" అన్నాడు.

పంకజం రిసీవరు తీసి నంబరు డయల్ చేసింది.

కెమిస్టు శంకరాన్ని వెంటనే యింటికి రమ్మని చెప్పింది.

మరో పది నిముషాలలో శంకరం రాము ముందు వున్నాడు.

యజమాని పడే బాధను చూసి అతడు చలించి పోయాడు.

"సార్! ఏమయింది?" అడిగాడు ఆప్యాయంగా.

మొదటిసారిగా తన బాధను మరో వ్యక్తికి చెప్పుకునే అవకాశం కలిగింది రాముకు. అతనికి శంకరం అంటే నమ్మకం. నిజం చెప్పాలంటే కంపెనీలో రాము తర్వాత స్థానం శంకరానిదే అని చెప్పొచ్చు. కానీ ఆ విషయం బయటకు తెలనీయకుండా చాలా హార్ష్‌గా ప్రవర్తిస్తాం టాడు రాము. "కూర్చో!" అన్నాడు శంకరాన్ని.

శంకరం తడబడిపోయాడు. కంపెనీలో చేరిన ఎని మిది సంవత్సరాల తర్వాత తనని యజమాని మొట్ట మొదటిసారిగా కూర్చోమన్నాడు. అది తన జీవితంలో జరుగుతుందని ఆశించలేదు శంకరం. ఆ మాటకొస్తే శంకరమే కాదు ఆ ఆఫీసులో ఎవరూ కూడా యిప్పటి వరకు యజమాని ముందు కూర్చుని ఎరుగరు. అలా కూర్చునేది ఒకే ఒక్కసారి - అదే కంపెనీని వదలి బయ టకు వెళ్ళిపోయేటప్పుడు. తనను యజమాని యిప్పుడు కూర్చోమన్నాడు. కొంపతీసి తన వుద్యోగానికి ఎసరు పెట్టటం లేదుకదా? అంత తప్పు తనేం చేశాడు. శంకరం గుండెలు దడదడలాడాయి. కూర్చోటానికి తటపట లాడాడు. కర్చీఫ్‌తో నుదురు అద్దుకున్నాడు.

రాము అతడి పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. అంత బాధలో కూడా అతనికి నవ్వొచ్చింది. "పరవాలేదు కూర్చో!" అన్నాడు.

శంకరం సోఫాలో ఒకమూల వొదిగి బిక్కు బిక్కు మంటూ కూర్చొన్నాడు ఇక ఏడవటం ఒక్కటే తరువాయి.

"నీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి."

శంకరం పై ప్రాణాలు పయినే పోయాయి. ఎవరి కయినా వుద్వాసన చెప్పే ముందు యజమాని సరిగ్గా యిదే డయిలాగ్ వేస్తాడు. తనపని అయిపోయింది.

బెదురు గొడ్డులా వున్న శంకరాన్ని చూస్తే రాముకు జాలేసింది. "ఏం భయపడకు. నా పర్సనల్ మేటర్‌లో నీ సలహా అడుగుదామని పిలిచాను" అన్నాడు.

ఏనుగెక్కినట్లనిపించింది శంకరానికి. తను యజ మానికి సలహా యిచ్చేంత గొప్పవాడా?

అంతలో పంకజం కాఫీ కప్పు తీసుకుని అక్కడకు వచ్చింది. శంకరానికి కప్పందించింది. శంకరం తడబడి పోయాడు. ఏమిటిది? కలా? లేకపోతే వైష్ణవ మాయా? అన్నట్లుగా మొహం పెట్టాడు. అతనికి మతిపోతోంది. ఒద్దికగా కప్పందుకున్నాడు.

"ఇంతకాలం నేను ఏ విషయంలోనూ ఎవర్నీ సలహా అడగలేదు. కానీ యింతకాలానికి ఒకర్ని సలహా అడగా లనే నిశ్చయానికి వచ్చాను. నాకు ఈ ప్రపంచంలో స్నేహితులు అసలులేరు. శ్రేయోభిలాషులున్నారో, లేదో తెలియదు. ఎందుకో నువ్వు నాకు అప్తుడిలా అనిపించావు. అందుకే నిన్నుపిలిచాను."

క్రింద పడబోయి తమాయించుకున్నాడు శంకరం.

"మన పెయిన్‌టోమా మీద నీ అభిప్రాయం ఏమిటి?"

"మన ప్రోడక్టు లన్నింటిలోనూ బాగా మూవయ్యేది అదే."

"అది నాకూ తెలుసు. దాని పనితనం మీద నీ అభి ప్రాయం ఏమిటి?"

"బాగా పనిచెయ్యకపోతే అది ఎలా మూవ్ అవుతుంది సార్."

"మూవ్‌మెంటెను బట్టికాదు. నీ పర్సనల్ అభిప్రాయం కావాలి."

"నాకు దాని పనితనం విషయం తెలియదు సార్. అమ్మకాలనుబట్టి మాత్రమే నిర్ణయించాను."

"దాని కాంపొజిషన్ నీకు తెలుసుగా, దాన్నిబట్టి చెప్పు."

శంకరం మొహంలో రంగులు మారాయి. ఏదో చెప్ప బోయి ఆపేశాడు.

"పర్వాలేదు చెప్పు." ప్రోత్సహించాడు రాము.

"మీరు మరోలా భావించకూడదు" శంకరంలో అప్పటి వరకు యజమాని అంటే వున్న బెదురూ భయం పోయాయి. వాటిస్థానే తెగువా, భక్తీ చోటు చేసుకొన్నాయి.

"చెప్పు."

"దానిమీదున్న కాంబినేషన్‌కూ దాంట్లోవున్న సరుకుకూ ఎక్కడా పొంతనలేదు." అన్నాడు తాపీగా.

రాము ఉలిక్కిపడ్డాడు. శంకరాన్ని తను తక్కువగా అంచనావేశాడు. మామూలు కెమిస్టు ఎవరూ దీనిని కను క్కోలేరు. శంకరం దీన్ని కనుక్కొన్నాడంటే? రాము ఉలికిపాటును కప్పిపుచ్చుకున్నాడు. "నువ్వనేదేమిటి?" అన్నాడు.

"మీకు నా నోటినిండి చెప్పించాలని వుంది కాబోలు. పెయిన్‌టోమా అనేది ఒక కాంపొజిషన్ ప్రకారం చేసింది మాత్రం కాదు. నిక్కచ్చిగా చెప్పగలను. నిజంగా

పెయినే గనక రిలీవయితే అందులో ఏదో వుందని మాత్రం చెప్పగలను.” తాపీగా అన్నా చాలా నిబ్బరంగా చెప్పాడు శంకరం.

రాము కిమ్మనలేదు. శంకరం చెప్పింది నూటికి నూరు పాళ్ళూ నిజం. పెయిన్‌టోమా ఒక పసరు. ఒక కోయదొర రాముకు దానిగురించి చెప్పాడు. కోయదొర చెప్పిన ప్రకారం కొన్ని పసర్లనూ, కొన్ని మూలికల కషాయాన్నీ కలిపి పెయిన్‌టోమాను తయారు చేశాడు రాము. పాపం రాముకు ఆ పసర్లనుగురించి చెప్పినందుకు ఆ కోయదొర తనువు చాలించాడు. అదంతా వ్యాపారధర్మం అనుకున్నాడు రాము. పెయిన్‌టోమా గురించి తెలిసిన ఏకైక వ్యక్తి యిప్పుడు తను మాత్రమే. అలాంటిది ఈ శంకరం....

“అది నేను నిక్కచ్చిగా చెప్పలేను. దాంట్లో కలిపేదేమిటో నేను చెప్పలేను. అందుకు దాని ప్రభావం గురించి నాకేమీ తెలియదు.”

రాము తలాడించాడు. “నాకు రెండురోజుల నుండీ కడుపులో చాలా తీవ్రంగా నొప్పి పుడుతోంది. బాధను భరించలేక పోతోన్నాను. పేగులకు ముళ్ళువేసి లాగుతోన్నట్లు వుంది. మన పెయిన్‌టోమాను వాడి చూశాను. ఫలితం లేదు. డాక్టర్ దగ్గరకు వెళ్ళాలంటే సిగ్గుగా వుంది. అందుకు సలహాకోసం నిన్ను పిలిచాను” అన్నాడు రాము.

యజమానిని బాధగా చూశాడు శంకరం. “ఏమిటి సార్? మీరు యిలా ప్రవర్తిస్తారని అనుకోలేదు. అయినా కడుపునొప్పి అనేక కారణాలవలన వస్తుంది. మీరు నిర్లక్ష్యం చేస్తే ప్రమాదానికి దారితీస్తుంది. అది ఏ అవండి

సైటిస్సా అనుకోండి. ఆలస్యం చేస్తే అపండిస్ పగిలి పోయే అవకాశం వుంది డాక్టర్లు మిమ్మల్ని ఎందుకు చుల కన చేస్తారు. మన మందుమీద కూడా కాషన్ వుందికదా? అనుభవజ్ఞుడయిన డాక్టర్ సలహామీద మాత్రమే అమ్మా లని. అందుకు మీరేమీ వర్రీకాకుండా ముందు డాక్టర్‌ను సంప్రదించండి.'' అన్నాడు.

"అదేబాబూ నేనూ తల మొత్తుకుంటున్నాను. వింటేగా'' అంటూ డాక్టర్‌కు ఫోన్ చేసింది పంకజం.

## 2

కిన్నెర థియేటర్ అంతా దేదీప్యమానంగా వుంది.

స్టేజిమీద పెద్ద పెద్ద హంసతూలికా తల్పాలలాంటి కుర్చీలు అమర్చారు.

స్టేజి ముందున్న కుర్చీలన్నీ దాదాపుగా నిండిపోయాయి.

నగరంలో వున్న వర్తకులూ, కంపెనీల యజ మానులూ కలిసి ఛాంబర్ ఆఫ్ కామర్సు ఆధ్వర్యంలో బంగార్రాజుకు సన్మానం చేస్తోన్నారు.

దాదాపుగా నగరంలోవున్న ధనిక, మేధావి వర్గం అంతా అక్కడకు తరలివచ్చేసినట్లే లెక్క.

సాయంత్రం ఆరుగంటలు దాటింది.

థియేటర్ ముందు కార్పరేషన్ కారువచ్చి ఆగింది. అందులోంచి నగరమేయర్ సుబ్బారావు హుందాగా దిగాడు. ఆయనకు సకల మర్యాదలతోటి స్వాగతం లభిం చింది. ఆ రోజు సభకు ఆయనే అధ్యక్షులు. ఆయన చేతి మీదుగానే బంగార్రాజుకు సన్మానం జరుగుతోంది.

మేయర్ అధ్యక్షస్థానాన్ని అలంకరించాడు. ప్రాంగణం అంతా తప్పట్లతో మారుమోగిపోయింది.

మరో నిముషం పోయాక బంగారు ఫ్రేమ్ కళ్ళద్దాలు,

అదేరంగు లాల్చీ. తెల్లటి మల్లుపంచె కట్టుకుని నల్లటి వజ్రంలా మెరిసిపోతోన్న బంగార్రాజు స్టేజీ మీదకు వచ్చాడు.

పదినిముషాల వరకు తప్పట్లు. వినాదాల ఘోష ఆగ లేదు.

బంగార్రాజుకు యిది వూహించని పరిణామం. అతని తనువంతా పులకరించిపోయింది. ఏంచెయ్యాలో పాలు పోని సితిలో ముకుళిత హస్తాలతో అలా నిలబడిపోయాడు. కదలలేని పరిస్థితిలో వుండిపోయాడు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మాన్, వచ్చి భుజాలు పట్టుకుని తీసుకు వెళ్ళి కుర్చీలో కూర్చోపెడితే కాని కూర్చోవాలన్న ఆలోచనే లేకపోయింది బంగార్రాజుకు.

సభ మొదలయ్యింది.

వివిధ వర్తక సంఘాలు తమ తమ సన్మాన పత్రాల్ని చదివి వినిపించాయి. బంగార్రాజును వేనోళ్ళ పొగడాయి. ఒక పెద్ద కంపెనీలో పావలా కూలిగా చేరిన బంగార్రాజు ఈ రోజు ఛాంబర్ ఆఫ్ కామర్సు వైస్ చైర్మాన్ అయ్యా డంటే దాని వెనుక అతని కృషి ఎటువంటిదో ఊహించ టానికే అగమ్యగోచరంగా వుంటుంది.

మేయరుగారు తన అధ్యక్షోపన్యాసంలో కూడా బంగా ర్రాజును పొగిడారు. తనకు బంగార్రాజుతో అనేక సంవత్స రాలుగా పరిచయం వుందని, అతనికీ తనకూ అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో సంబంధం వుందనీ, అనేక సంస్థలతో సత్సంబంధాలు వున్నాయనీ, ఒక్క వ్యాపార రంగంలోనే కాక అనేక రంగాలలో బంగార్రాజు కృషి చేశాడనీ, తన మిత్రుడికి తన చేతులమీదే సన్మానం చెయ్యటం తనకో పెద్ద లా రెల్ లాటిదనీ, వివరించాడు.

చివరకు బంగార్రాజుకు సన్మానం జరిగింది.

బంగార్రాజు అందర్నీ పేరు పేరునా అభినందించాడు. "చివరిగా ఒక్క మాట. నేను ఈ రోజు ఈ స్థితిలో ఉండటానికి కారకుడు ఒక పెద్దమనిషి. సభాముఖంగా ఆయనకు నేను నా కృతజ్ఞతను తెలుపుకోవాలి. ముందుగా నా గురించి నేను రెండు ముక్కలు చెప్పుకుంటాను. తర్వాత ఆ వ్యక్తిని మీకు పరిచయం చేస్తాను." అన్నాడు.

సూదిపడితే వినపడేంత నిశ్శబ్దం ఆ ప్రాంతాన్ని అలుముకుంది. అందరూ అతడు ఏం చెపుతాడా? అన్న ఉత్కంఠతో ఎదురు చూస్తోన్నారు.

"నేను మొదట ఒక పెద్ద కంపెనీలో రోజు కూలికి చేరాను. నా సమర్ధతనూ, నేను చేసే పనినీ, నా పంక్చువాలిటీనీ మెచ్చుకుని మా యజమాని నన్ను అంచెలంచలుగా పైకి తీసుకుపోయాడు.

ఆ సమయంలో నేను ఒక చిన్న పొరబాటు చేశాను. రెండురోజులు కంపెనీకి సెలవు పెట్టకుండా యింటిపద్దే వుండిపోయాను. అవి నా పెళ్ళయిన క్రొత్తరోజులు. మా యజమాని ఛండశాసనుడు. ఎంత బ్రతిమాలినా వినలేదు. కాళ్ళా వేళ్ళా పడ్డాను. ఫలితం శూన్యం. మూడు నెలల జీతం యిచ్చి యింటికి పొమ్మన్నాడు.

ఇంటికి వచ్చి కన్నీరు మున్నీరుగా ఏడ్చాను. భావి జీవితాన్ని తలచుకుని భయపడిపోయాను. మందుల తయారీలో బాగా అనుభవం గడించిన నేను పదిమంది డిస్ట్రిబ్యూటర్ల దగ్గరకి తిరిగాను. కొందరు మాట సహాయం చేశారు మరికొందరు ధన సహాయం చేశారు. ఒకే ఒక్క ప్రోడక్టును తయారు చెయ్యటానికి పూనుకున్నాను. నేనూ నా భార్యా నిద్రాహారాలు మాని కష్టపడ్డాం.

ఇది జరిగి పాతిక సంవత్సరాలయింది.

ఉద్యోగం పోయినందుకు ఆ రోజు బాధపడ్డాను. కానీ ఈ రోజు అది నా అదృష్టం అని భావిస్తోన్నాను. ఆ రోజు వుద్యోగమే పోకపోతే నా పరిస్థితి మరోలా వుండి వుండేది. మా యజమానిలో వున్న ప్రిన్సిపల్సును ఆధారంచేసుకుని నా జీవితాన్ని ఆరంభించాను. ఎప్పటి కయినా ఆయనకు పోటీగా నిలవాలనుకున్నాను. దాన్నో ఛాలంజిగా తీసుకున్నాను. ఈనాడు అది సాధించగలిగాను. ఇప్పుడు ఈ సన్మానం కూడా ఆ సాధనలోని భాగమే.

ఆయన కడుపునొప్పికి ఒక టానిక్‌ను మార్కెట్‌లోనికి రిలీజ్ చేశాడు. వెంటనే నేను దానికి కాంపిటెటివ్ డ్రగ్‌ను రిలీజ్ చేశాను. మొదట్లో నా డ్రగ్ దానికి సబ్‌స్టిట్యూట్‌గా వుండేది. కారణం నేను ఆయన అమ్మినంత చవకగా నా మందును అమ్మలేకపోయాను. దానికి రెండింతలు ఖరీదున్న నా మందు వీగిపోతుందనుకున్నాను. కానీ ఆ మందు ఈ రోజు భారతదేశంలో మరే మందూ అమ్ముడుపోనంత అధికంగా అమ్ముడు పోతుంది. మనీ టర్నోవరు కూడా నా డ్రగ్‌కు వచ్చినట్లు మన దేశంలో ఏ డ్రగ్‌కు రాలేదు.

అందుకే ప్రభుత్వం నన్ను ప్రశంసించింది. పుర ప్రముఖులు సన్మానించారు.

ఆ రోజు దిక్కులేని నాకు ఉద్యోగం యిచ్చి ఆదుకొన్నారు. తర్వాత ఉద్యోగం తీసేసి నాలోని మగాణ్ణి లేపి నన్నో ప్రముఖుడిని చేశారు. ఈ రోజు తానో మందును ప్రవేశ పెట్టి తద్వారా నాకు ప్రేరణ యిచ్చి, నన్ను ఒక అత్యుత్తమ వ్యాపారస్తుడిగా తీర్చి దిద్దారు. అటువంటి అప్పటికీ, యిప్పటికీ, ఎప్పటికీనా యజమాని అయిన రాము

గారిని స్టేజ్ మీదకు రావలసిందిగా వేడుకొంటున్నాను."

రాము హుందాగా స్టేజ్ మీదకు వచ్చాడు. హాలంతా చప్పట్లతో మారుమోగిపోయింది.

బంగార్రాజతనికి పాదాభివందనం చేశారు. తనకు వేసిన దండల్ని తీసి అతనికి వేశాడు. తనకు కప్పిన శాలువాను అతడికి కప్పాడు. రెండు చేతులు పట్టుకుని కళ్ళ కద్దుకున్నాడు.

"ఏం విశ్వాసం" అన్నారందరూ.

రాముకు మాత్రం ఎందుకో తల తీసేసినట్లనిపించింది.

## 3

వెయిటర్ మరో సీసాతెచ్చి బల్లమీద వుంచాడు.

"చిప్స తీసుకురా!" రాము మాట ముద్దగావుంది.

"సార్! మీరు ఓవరయిపోయారు." అంటున్నాడు శంకరం.

రాము అతని మాటను వినిపించుకునే స్థితిలోలేడు.

యజమాని అంత వేలగా ప్రవర్తించటం శంకరం ఏ రోజూ చూడలేదు. నిన్న బంగార్రాజుకు సన్మానం జరిగిన దగ్గరనుండీ యింటికే వెళ్ళలేదు రాము. అతడు జీవితంలో అంత ఎక్కువగా ఎప్పుడూ త్రాగలేదు.

"ఏమిటి సార్? ఎందుకు ఇలా బిహేవ్ చేస్తున్నారు?" అన్నాడు శంకరం.

ఎర్రగావున్న కళ్ళను ఒక్కసారి గట్టిగా మూసుకుని తెరిచాడు రాము. ఎర్రటి ద్రవం అతని గొంతులోకి దిగి నిషా ఎక్కిస్తోంది.

"మనసులోని బాధను ఎవరికయినా చెబితే మంచిది. కొంత వుపశమనం కలుగుతుంది. అలా లోపల లోపలే దాచుకుంటే గుండె పగిలిపోతుంది. మీ మనసులోని

బాధను నాకు చెప్పండి. నేను వీలున్నంతలో సహాయం చేస్తాను." అన్నాడు శంకరం.

రాము ఒక్క క్షణం తాగటం ఆపాడు. ఏదో చెప్ప బోయాడు. అతడి మస్తిష్కంలో అనేక ఆలోచనలు ఝుమ్మన్నాయి. మాట పెగలలేదు.

"మీరు ముందు విశ్రాంతి తీసుకోండి. తర్వాత మాట్లాడుదురుగాని." అన్నాడు శంకరం.

రాము ఒప్పుకోలేదు. మాటలు తడబడుతోన్నా చెప్పడం మొదలు పెట్టాడు.

"ఆ బంగార్రాజుగాడి సేల్సు గురించి విన్నావా?"

"యస్ సార్! మన పెయిన్టోమాయే ఎక్కువ పోయింది. కానీ వాళ్ళ డ్రగ్ ఖరీదు మన డ్రగ్ ఖరీదు కన్నా ఎక్కువ. అందుకు టర్నోవర్ చూడటానికి వాళ్ళదే ఎక్కువలా కనిపిస్తోంది."

"వాడికి అంత పేరు ఎలా వచ్చింది? దేన్నిచూసి వాడికి టైటిల్స్ యిచ్చారు. క్వాంటిటీనా? డబ్బా?"

"రెండూ చూశారు."

"మరి క్వాంటిటీలో మనమే ఎక్కువ కదా? మరి ఆ సన్మానాలు నాకే జరగాలి కదా? మరి వాడికి ఎలాజరిగింది?"

"అదే సార్ నాకూ అర్థం కావటంలేదు. మనం లెక్కలు సరిగా చూపలేదేమో సార్."

"కావచ్చు. వ్యాపారంలో అది తప్పదు. అయినా సరే మన సేల్సు వాడి సేల్సుకన్నా ఎక్కువే. ఈ విషయం బజాయించి మరీ చెప్పగలను."

"పాపులారిటీని బట్టి కూడా...." నసిగాడు శంకరం.

రాము యింతెత్తున లేచాడు, "ఏమిటయ్యా నువ్వు మాట్లాడేది? మన డ్రగ్‌కు పాప్యులారిటీ లేదంటావా? మరి

మార్కెట్లో ఎలా మూవ్ అవుతోంది?" అన్నాడు.

"మీరు అక్కడే పొరబడ్డారు సార్. మన కంపెనీ ఎంతమంది రిప్రజింటేటివ్స్‌ను పెయిన్‌టోమా గురించి ఉపయోగిస్తోంది సార్?" అన్నాడు.

"మనకు రిప్రజెంటేటివ్ ఎందుకయ్యా దండగ. మొదటి నెల పదిమందిని అపాయింట్ చేశాను. మరుసటి నెల నుండి వాళ్ళ అవుసరం నాకు లేకపోయింది."

"మరి బంగార్రాజుగారు ఎంతమంది రిప్రజెంటేటివ్స్‌ను అపాయింట్ చేశారో తెలుసా?"

"వాడి మొహం, వాడికి అసలు వ్యాపారం గురించి ఏం తెలుసు గనుక. రిప్రజెంటేటివ్స్ లేకపోతే వాడొక్క సీసా కూడా అమ్మలేడు. నాకా అవసరంలేదు."

"మీరు అక్కడే పొరబడ్డారు సార్. మీరు వట్టి సేల్సు గురించి మాత్రమే ఆలోచించారు గానీ దాని మార్కెట్ పొజిషన్ చూడలేదు. పెద్ద పెద్ద కంపెనీలన్నీ వుబుసుపోకకూ, సేల్సులేకా. డబ్బెక్కువవుండీ రిప్రజెంటేటివ్‌లను పెట్టుకోరు. డ్రగ్‌ను అమ్మకాలే ముఖ్యం కాదు. ప్రజల నాడి కూడా తెలుసుకోవాలి."

జీవితంలో మొట్టమొదటి సారిగా రాము ప్రేక్షకుడయ్యాడు. శంకరం చెప్పింది ఓపికగా వినసాగాడు. "ఇంతకూ నీ వుద్దేశ్యం ఏమిటి?" అన్నాడు.

"మొన్న సరదాగా మన డ్రగ్ పాపులారిటీ చూద్దామని షాపులన్నీ తిరిగాను. ఎక్కడ అడిగినా స్టాకులేదనే సమాధానం వచ్చింది. కంపెనీకి వచ్చి రికార్డు వెరిఫై చేశాను. అంతకు ముందురోజే డెలివరీ యిచ్చాం. మళ్ళీ మనకు ఆర్డరు ప్లేస్ కాలేదు."

"నిజంగా స్టాకు అయిపోయిందేమో?"

"నాకూ అదే అనిపించింది. కానీ అది జరగనిపని. వూళ్ళోవున్న షాపు లన్నిటిలోనూ స్టాకు ఒకేసారి అయి పోవటం జరగనిపని. పోనీ స్టాకు అయిపోతే మనకు ఆర్డరు వెంటనే ప్లేస్ అవ్వాలి. అలా జరగలేదు. అదీ కాకుండా మన మందయిపోయిందని చెబుతో అందరూ బంగార్రాజుగారి మందును సబ్‌స్టిట్యూట్‌గా చెప్పారు." అన్నాడు శంకరం.

రాము మొట్టమొదటిసారిగా క్రొత్త విషయాన్ని వింటు న్నాడు. భారంగా కణతలు రుద్దుకొన్నాడు. అవును తను చేసింది పొరబాటే. సేల్సు బావున్నాయని సంతోష పడ్డాడే గాని వాటిని యింకా పెంచాలని తాపత్రయపడలేదు.

"ఇంకో విషయం సార్! నేను చాలామంది డాక్టర్లనీ కొందరు పేషంట్లనీ కూడా కలిసాను సార్. ఎవరికీ పెయిన్‌టోమా గురించి పెద్దగా తెలియదు. అసలు కొందరి కయితే ఆ పేరుతో ఒక మందు వున్నదని కూడా తెలి యదు." అన్నాడు శంకరం.

ఈసారి రాము నోరావులించాడు. "ఆశ్చర్యంగా ఉందే. ఎవరికీ తెలియకుండా మరి మనకు అన్ని సేల్సు ఎలా వున్నాయి?" అన్నాడు.

"అదే నాకూ అర్థం కావటంలేదు సార్. దీంట్లో ఏదో కిటుకు మాత్రం వుందని కచ్చితంగా చెప్పగలను. కాని అదేమిటో నా బుర్రకు అందటంలేదు." అన్నాడు.

రాము అతడిని అభినందన పూర్వకంగా చూశాడు. భుజంతట్టి శంకరాన్ని పంపించేశాడు. "ముందు ఆ బంగార్రాజుగాడి సంగతి చూడాలి." అన్న నిశ్చయానికి వచ్చి ఫోను ముందరకు లాక్కున్నాడు.

# 4

"పెయిన్‌టోమా వుందా?"

"లేదు బాబూ స్టాకయిపోయింది."

ఆ వ్యక్తి ప్రసూరుమంటూ వెనక్కి తిరిగాడు.

"ఏం బాబూ అదే కావాలా? అటువంటిదే మరోటి యివ్వనా?" అడిగాడు షాపతను.

"ఏదయినా ఫర్వాలేదు."

షాపతను తల వూపి ఒక బాటిల్ను షోకేస్ మీద వుంచాడు.

"ఎంత?"

"పది రూపాయలు."

అతడు జేబులోంచి పెద్ద నోట్లకట్టను తీసి కౌంటర్ మీదికి విసిరాడు. "మీ దగ్గర ఎన్ని బాటిల్స్ వుంటే అన్నీ యిచ్చెయ్యి" అన్నాడు.

"ఎందుకు బాబూ?"

"ఏమో ఎప్పుడు స్టాకయిపోతుందో ఎవరికి తెలుసు? అందుకే వున్నవన్నీ పట్టుకుపోతోన్నాను. కావాలంటే ఒక పది ఎక్కువ తీసుకో" అన్నాడతడు.

షాపతను చిన్నగా నవ్వాడు. అతనికి యిటువంటివి మామూలే. "అయితే దీనికి నూకలు చెల్లిపోయినట్లే" అనుకుంటూ బాటిల్లన్నీ పాక్ చేసి అతడికి అందించాడు.

అతడు ఆ ప్యాకెట్ పట్టుకుని బయటకు వెళ్ళిపోయాడు.

అతడు అలా బయటకు వెళ్ళగానే షాపతను మిగిలిన షాపులకు ఫోన్ చేశాడు. అన్ని షాపులనుండీ తనకు జరిగినట్లే జరిగిందని సమాధానాలు వచ్చాయి.

ఆ మాటకు వస్తే ఒక్క ఆ పట్టణంలోనే కాదు దాదాపుగా దేశం మొత్తం మీద బంగార్రాజు తయారు

చేసిన పెయిన్‌టోమా సబ్‌స్టిట్యూట్‌ను కొనేశారు....

"అబ్బా! ఈ రెండు రోజులలో మన సేల్స్ పెరిగి నట్లున్నాయే?" హుషారుగా అడిగాడు బంగార్రాజు.

"అవును సార్! ఈ మధ్యన మీకు మంచి పాపులారిటీ వచ్చింది. అందుకే మన సేల్సు కూడా విపరీతంగా పెరిగిపోయాయి" అన్నాడు అతడి పి.ఏ. వైకుంఠరావు.

బంగార్రాజు అక్కడ వుండగానే డిస్ట్రిబ్యూటర్ల నుండి ఆర్డర్ ప్లేస్‌మెంట్లు వచ్చాయి. దాంతో బంగార్రాజు పుబ్బిపోయాడు.

"స్టాక్ పొజిషన్ ఎలా వుంది?" అడిగాడు.

పి. ఏ. రిజిష్టర్ ఓపెన్ చేసి లెక్కలు గట్టించాడు. "డిమేండ్ యిలా వుంటే స్టాకు మరో నాలుగు రోజుల వరకు రావటం కష్టం" అన్నాడు.

"మరి యిప్పటివరకు ఏం చేశావ్! స్టాకు ముందే తెప్పించుకు చావచ్చుగా?" మండిపడ్డాడు బంగార్రాజు.

"సరుకు ఎక్కడా దొరకలేదు సార్!" నీళ్ళు నమిలాడు పి. ఏ.

"కొంచెం డబ్బు ఎక్కువ పడెయ్యకపోయావా?"

"ట్రయ్ చేశాను సార్! కుదరలేదు."

"ఎందుకు యిలా అయింది?"

"నాకు చిన్న యిన్‌ఫర్మేషన్ అందింది సార్."

"ఏమిటది?"

"రాముగారు కంపెనీ ఎత్తేశారట. ఇక మీదట పెయిన్‌టోమా తయారవ్వదు."

"మైగాడ్" బంగార్రాజు తల పట్టుకు కూర్చుండి పోయాడు. రెండు నిముషాలు పోయాక పి.ఏ.ను చూశాడు. "అది నిజమయిన వార్తేనా?" అన్నాడు.

ఇంకా అతనిలో ఏమూలో చిన్నగా ఆశవుంది.

"తొంభయి తొమ్మిది శాతం నమ్మకమయిందే సార్!"

"మరి పెయిన్‌టోమా ఫార్ములా?"

"ఏమో తెలియదు సార్!"

"పెయిన్‌టోమా లేకపోతే మనం అటువంటి ఉత్పత్తి చెయ్యలేమా?"

"కష్టం సార్. దాని గురించి అసలు అంతు దొరక లేదు. అదే కుదిరితే యింతకాలం మనం పెయిన్‌టోమానే మన లేబిల్ మీద ఎందుకు రిలీజ్ చేస్తాం సార్?"

బంగార్రాజు బట్టలన్నీ చెమటతో తడిసిపోతోన్నాయి. "ఎలా? ఏం చెయ్యాలి?" అతడు వెంటనే ఒక నిశ్చయా నికి వచ్చేశాడు. ఫోను ముందుకు లాక్కొన్నాడు. రిసీ వరు తీసి నంబర్ డయల్ జేశాడు.

అటువయిపు నుండి 'హలో' అని వినిపించింది.

ఆ గొంతు వినగానే అతనిలో కంగారు ఆరంభ మయింది. ఒకానొకప్పుడు ఆ గొంతు వింటే చాలు అతని వళ్ళంతా చెమటతో తడిసిపోయేది. ఇప్పుడు మళ్ళీ ఆ పరిస్థితి ఏర్పడింది. ఇలా అవుతుందని బంగార్రాజు కలలో కూడా వూహించలేదు.

"నమస్కారం సార్!"

"ఎవరు?"

"నేను సార్ బంగార్రాజుని."

అటువయిపు వున్న రాము కళ్ళు వింతగా మెరిశాయి. పక్కనే కూర్చున్న శంకరాన్ని ఆశ్చర్యంగా చూశాడు. మౌత్‌పీస్‌కు చెయ్యి అడ్డం పెట్టి ఏదో చెప్పబోయాడు. అతడు చెప్పబోయేదాన్ని గ్రహించాడు శంకరం. "ప్రొసీడ్ సార్!" అన్నాడు.

"ఏమయ్యా రాజూ? ఎమిటి విశేషం? మళ్ళీ చాలా కాలం తరువాత మనం మాట్లాడుకొంటున్నాం" అన్నాడు రాము.

"సార్! నాకో చిన్న సహాయం కావాలి సార్!"

"అయ్యో! దానికి సందేహం దేనికయ్యా అడుగు."

"నాకు తెలుసు సార్ మీరు కాదనరని. నన్ను ఈ స్థితికి తీసుకు వచ్చిన మీ ఋణం జన్మజన్మలకు మర్చిపోను సార్."

"ఇంతకీ పనేమిటో చెప్పావు కాదు."

"అదే సార్! మీరు కంపెనీ క్లోజ్ చేస్తోన్నారట కదా?"

"నీ కెవరు చెప్పారు?"

"తెలిసింది సార్!"

"నీకు చెయ్యాల్సిన సహాయం ఏమిటి? తొందరగా కంపెనీని మూసెయ్యాలా?"

"ఛ! ఛ! అది కాదు సార్."

"మరేమిటి?"

"చెప్తా! నే నడిగిందానికి మీరు సమాధానం చెప్ప లేదు."

"ఇంకా ఏ సంగతీ నిర్ణయించలేదు."

"మీరు కంపెనీని మూయ్యకండి సార్. అది నాకు ఎంతమాత్రమూ యిష్టంలేదు. మీకు కంపెనీని మూసె య్యాల్సినంత యిబ్బందులు వున్నాయని నేను అనుకో వటం లేదు. మీ వుప్పు తిన్న వ్యక్తిగా మీ శ్రేయోభి లాషిగా మీరు కంపెనీని మూసెయ్యటం నేను భరించ లేను సార్. కంపెనీ మూసేసినా మీరు ప్రాణంకన్నా

మిన్నగా ప్రేమించే వండర్‌డ్రగ్ పెయిన్‌టోమా ప్రొడ క్షన్ ఆగటానికి మాత్రం వీలు లేదు సార్!"

రాము చిన్నగా నవ్వాడు. అతనిలో టెన్షన్ పెరిగి పోతోంది. ఉత్సాహంగా శంకరం భుజం నొక్కాడు. శంకరం తొందరపడొద్దన్నట్లు సంజ్ఞ చేశాడు. "ఇంతకీ నువ్వు చెప్పదలచుకున్నది ఏమిటి? నేను నీకు చెయ్యా ల్సిన సహాయం ఏమిటి?" అడిగాడు రాము.

"నేను చెప్పదలచుకున్నదంతా చెప్పేశాను. ఇంక మీరు నాకు చెయ్యాల్సిన సహాయం కంపెనీని వైండప్ చెయ్యకుండా వుండటమే."

"అదే నీకు నేను చెయ్యాల్సిన సహాయం అయితే నన్ను క్షమించవయ్యా రాజూ! నేను యిప్పటికే ఒక నిశ్చయానికి వచ్చేశాను. వైండప్ చెయ్యటం ఖాయం. కానీ ఎప్పుడు చేస్తానన్నది చెప్పలేను."

"అయితే మరో సహాయం చెయ్యండి సార్."

"ఏమిటది?"

"పెయిన్‌టోమాను ప్రొడ్యూస్ చేసే అవకాశాన్ని నాకు కలుగజేయండి."

"మరి నీ డ్రగ్?"

"మీ డ్రగ్ గురించి నా ప్రొడక్షన్ ఆపేస్తాను సార్. మీకు ఈ మాత్రం సహాయమైనా చెయ్యకపోతే నేను పురుగులుపట్టి పోతాను సార్!"

రాము రెండు నిముషాలు మౌనంగా వుండిపోయాడు. "నాకు నువ్వు చెప్పేది యింకా పూర్తిగా అర్థం కావటం లేదు" అన్నాడు.

"దీంట్లో అర్థమయ్యేందుకు ఏముంది సార్? మీ

పెయిన్‌టోమా ఫార్ములాను నాకు యివ్వండి. అందుకు ప్రతిఫలంగా మీకు ఎంత కావాలో డిమేండ్ చెయ్యండి'' అన్నాడు బంగార్రాజు.

''నాకు కొంచెం టయిమ్ కావాలి.''

''ఎంత కాలం?''

''నెల కావచ్చు రెండు నెలలు కావచ్చు.''

''ఆ తర్వాత ఫార్ములా నాకు యిస్తారా?''

''తప్పకుండా.''

''అయితే సార్! మీమీద నాకున్న విశ్వాసాన్ని చూపెట్టుకుంటాను. నేటి నుండి నేను కూడా నా డ్రగ్ ఆపేస్తున్నాను. మళ్ళీ ముందు పెయిన్‌టోమా మార్కెట్లో రిలీజ్ కావాలి. తర్వాతే నా డ్రగ్'' ఆవేశంగా చెప్పాడు బంగార్రాజు.

రాము నవ్వుకుంటూ రిసీవర్ పెట్టేశాడు.

## 5

కేప్టెన్ సుధీర్ వాళ్ళ ముగ్గుర్నీ ముచ్చటగా చూశాడు.

మిలటరీలోంచి వచ్చేశాక సుధీర్ ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూషన్ తీసుకున్నాడు. కొన్ని డ్రగ్‌లను లోకల్‌గా, మరికొన్నిటిని రీజనల్‌గా, మరికొన్నిటిని సరాసరి నేషనల్‌గా డీల్ చేస్తోన్నాడతను.

ఆ ముగ్గురూ మాట్లాడకుండా అతన్నే చూస్తోన్నారు.

''వివరంగా చెప్పండి'' అన్నాడు సుధీర్.

ఆ ముగ్గురలో ఒకడు బేగ్‌లోంచి నాలుగు బాటిల్లుతీసి టేబిల్ మీద వుంచాడు. చిన్న కేటలాగును సుధీర్‌కు అందించాడు. ''మేం కొత్తగా సంకీర్ణా ఫార్మాస్యూటికల్ కంపెనీ పెట్టాం సార్. ఇదివరకు పెయిన్‌టోమా అనే

డ్రగ్ వుండేది తెలుసు కదా! దానికి సబ్‌స్టిట్యూట్‌గా మరో డ్రగ్ కూడా వచ్చింది. ఆ రెండూ కడుపు నొప్పికి చాలా బాగా పని చేసేవి. కాని ఆ రెండింటిలో కొన్ని లోపాలు వున్నాయి. వాటిని తొలగిస్తూ మేము మెడీజ్యూస్ అనే ఈ క్రొత్త టానిక్‌ను యింట్రడ్యూస్ చేస్తున్నాం. ఖరీదు కూడా చాలా మాడరేట్" అన్నాడు.

"కంగ్రాట్సు."

"మా డ్రగ్‌లో మరో ప్రత్యేకత కూడా వుంది సార్. ఇది రొమాంటిక్ పెయిన్స్ మీద కూడా బాగా పని చేస్తుంది."

"గుడ్ ...."

"అంగీకరిస్తే మీకు సోల్ డిస్ట్రిబ్యూషన్ యిస్తాం. రిప్రజంటేటివ్స్ మావాళ్ళే వుంటారు. వాళ్ళు మీ ఆధ్వర్యంలో పని చేస్తారు. కావాలంటే మీరు కూడా కొందర్ని అపాయింట్ చేసుకోండి. ఖర్చు మాదే. కావాలంటే మీ డిస్ట్రిబ్యూషన్ కూడా మేమే చేస్తాం. స్టాకిస్టులను కూడా మేమే చూస్తాం."

సుధీర్‌కు మతి పోయింది. "అయితే యింక నేను చెయ్యాల్సిన పని ఏముంది?" అన్నాడు.

"చెప్పాంగా సోల్ డిస్ట్రిబ్యూషన్."

సుధీర్ సంతోషంగా ఒప్పుకున్నాడు.

మరో నెల రోజులలో మెడీజ్యూస్ చాలా పాపులరయి పోయింది. ఎక్కడ చూసినా అదే. ఎవరి నోటంట విన్నా దాని మాటే. అటు పెయిన్‌టోమా గాని, యిటు బంగార్రాజు సబ్‌స్టిట్యూట్‌గాని అసలు మచ్చుకు కూడా మార్కెట్‌లో లేదు.

మరో నెల పోయాక బంగార్రాజుకు అసలు విషయం తెలిసింది. బెంబేలు పడిపోయాడు. ఏంచెయ్యాలో పాలు పోలేదు. కాళ్లూ చేతులూ ఆడలేదు. చేతులు కాలాయి. ఇక ఆకుల కోసం వెదకి లాభం లేదు. గుండెలు బాదు కుంటూ కూర్చున్నాడు.

సరిగ్గా అదే సమయంలో కాలింగ్ బెల్ మ్రోగింది.

బంగార్రాజు తలుపు తీశాడు.

ఎదురుగా రాము దంపతులు నిలబడి వున్నారు.

"రండి రండి!" అయిష్టంగానే వారిని లోపలకు ఆహ్వానించాడు బంగార్రాజు.

"ఏమీ లేదయ్యా రాజు! ఈ నగరంలో నువ్వు తప్ప నాకు ఆప్తులు ఎవరున్నారు చెప్పు. అందుకే శుభవార్తను ముందు నీ చెవిన వేసి మీ దంపతులను ఆహ్వానిద్దామని వచ్చాను" అన్నాడు రాము.

"ఏమిటో చెప్పండి?" అన్నాడు బంగార్రాజు ముభావంగా.

"ఏముంది! ఈ నెల యిరవయ్యో తారీఖున మా అమ్మాయి పెళ్ళి. నువ్వు సకుటుంబంగా రావాలి" అంటూ కార్డందించాడు రాము.

బంగార్రాజు శుభలేఖ అందుకున్నాడు.

ప్రముఖ వ్యాపారవేత్త రాముగారి ఒక్కగా నొక్క కుమార్తె సంకీర్తను, సంకీర్తా ఫార్మాస్యూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శంకరానికిచ్చి ఈ నెల ఇరవయ్యో తారీకున.........

ఇక అక్షరాలు కనిపించలేదు బంగార్రాజుకి.

అతడు పూర్తిగా కొలాప్సయ్యేలోపునే రాము దంపతులు బయటకు నడిచారు. □

# దొంగలవేట

పి. చంద్రశేఖర్ ఆజాద్

"బ్యాంక్‌లో లక్షరూపాయల గల్లంతు!" అరిచాడు జ్యోతి.

జ్యోతి అంటే అమ్మాయికాదు. వాడిపేరు జ్యోతి కుమార్. మేమంతా వాడ్ని జ్యోతి అని పిలుస్తుంటాం.

"ఎవర్నన్నా చంపారా?"

"లేదు. చాలా ప్రశాంతంగా జరిగిపోయింది."

"అవునుమరి పిస్టల్ చూసి కిక్కురుమనకుండా తీసుకెళ్ళు బాబూ అనుంటారు."

"ఏ ఊర్లో జరిగిందిరా. ఏ పేపర్లో వేశారు"

"ముందా పేకాట కొంచెంసేపు ఆపితే పూర్తి వివరాలు వినొచ్చు. బ్యాంక్‌దోపిడి జరిగింది కేవలం ఈ ఊర్లోనే.

అర్థమవుతుందా. అదింకా పేపర్లోకి రాకపోవటానికి కారణం ఏమిటంటే అది జరిగి కేవలం గంట మాత్రమే అవుతుంది కాబట్టి. మరొక్క విషయం కూడా విన్నాక డిస్కార్డ్ చెయ్యండిరా. ఇప్పుడు స్టేషన్లో పోస్ట్‌మాస్టర్ మాధవరావుగార్ని ప్రశ్నిస్తున్నారు. మిగతా వివరాలు వచ్చే వారం''

''ఒరేయ్....ఒరేయ్'' అరుస్తున్నారు.

జ్యోతి అక్కడలేడు. మా ఊర్లో ఏం జరిగినా ఆ వార్త ముందుగా జ్యోతి కందుతుంది. ఒక్కోసారి ఏం జరగబోతుందో కూడా వాడు చెప్పగలుగు తుంటాడు.

''అసలు ఆ ప్లాన్ వీడే ఇచ్చుంటాడు'' అన్నారెవరో.

''అయినా ఏ బ్యాంక్‌లో జరిగిం దిది''

మా ఊర్లో నాలుగు బ్యాంక్‌లున్నాయి. అందులో రెండు సహకార రంగంలోవి.

''ఏ బాంకయితే ఏమిటిరా. లక్షరూపాయలు జీవితంలో ఎన్నిరోజులు అయిదు రూపాయల పూలాడితే వస్తుంది.'' అన్నాడు వరహాలరావ్ కళ్ళముందు నోట్లు కదలాడు తుండగా.

''అవునూ పోస్ట్‌మాస్టర్ని ప్రశ్నించటం ఎందుకు? కొంప తీసి ఆయనేమన్నా చేశాడా? అసలే జ్యోతిగాడిదంతా సస్పెన్స్. వెధవ....హిచ్‌కాక్‌లా వెధవ.''

''హాచ్చ్.''

''తుమ్మాడెదవ. ముక్కెయ్యరా.''

''మీకు మతుందా? బాంక్‌లో లక్షరూపాయలు దోచుకుంటే హీరో చక్రవర్తుల్లా పేకాడుకొంటారా?'' అన్నాడు గుప్తా.

''అరే గుప్తా వెంటనే వెళ్ళి పరిశోధించి ఆ దొంగ

లను పట్టుకొమ్మ్కు" ఆటలోనుండి కామెంట్ చేశాడు రమణ.

అందరూ ఆటలో మునిగిపోయేరు.

నాకూ అక్కడ ఉండాలనిపించలేదు. రక్తం చిందకుండా, ప్రశాంతంగా లక్షరూపాయల్ని చేజిక్కించుకున్న ఆ వ్యక్తులెవరోగాని వాళ్ళ మేధస్సు గొప్పదే.

మా మిత్రులందరం ఆ గదిలో కలుస్తుంటాం. పేకాట దగ్గర్నుండి, ప్రపంచ సమస్యలన్నీ ఆ గది గోడల నడుమే చర్చించబడుతుంటాయి. ఒక్కోసారి ఆ గదిలోపల మల్లెల మధుర సువాసనలొస్తే, మరోసారి కాక్‌టైల్ వాసన గుప్పుమంటుంది.

'ఛికెన్ మకన్‌వాలా' నుండి మిరపకాయ బజ్జీలదాకా అక్కడ ఖర్చవుతాయి.

స్టేషన్ మాకు దగ్గర్లోనే ఉంది. అనేకరకాల కథల్ని వింటుంటాం. అవసరమయినప్పుడు ఆ ప్రాంతాల్లో తిరుగాడే కోర్టు పక్షాలనుండి రకరకాల సమాచారాన్ని సేకరించటంలో జ్యోతి మహానేర్పరి.

మేం వెళ్ళేటప్పటికి మాధవరావుగారు మాడిపోయిన మొఖంతో బయటకు వస్తున్నారు. ఆయన్ను చూస్తుంటే జాలి కలిగింది.

నవ్వుతూ వెనకాలే జ్యోతి వచ్చాడు.

వాడు చెప్పిన కథనం ఇలా ఉంది—

ఆ రోజు ఉదయం పదిగంటలకు మామూలుగానే బ్యాంక్ తెరిచారు. క్యాషియర్ రంగారావు మేనేజర్‌తో కలిసివెళ్ళి లక్షరూపాయలు తెచ్చుకొన్నాడు. అన్నీ వందల రూపాయలు. మొత్తం పదికట్టలు. అవన్నీ తన ముందు పెట్టుకొని కూర్చున్నాడు. వాటిని ఇంకా టేబుల్ సొరు

గులో వేసుకోలేదు. అవి ఓ రెగ్యులర్ కస్టమర్‌కి చెల్లిం చాల్సి ఉంది.

"వందరూపాయల చిల్లరివ్వండి" అడిగారెవరో.

"కొంచెం సేపాగండి. ఇంకా కౌంటర్ తెరవలేదు" అన్నాడు రంగారావు.

"రంగారావు" పిల్చారెవరో.

డబ్బు నలానే వదిలి ఆ వైపు వెళ్ళాడు.

ఎంత సేపున్నాడో ....వచ్చి సీట్లో కూర్చున్నాడు.

లక్ష రూపాయలు మాత్రం లేవు!

బిగ్గరగా అరిచాడు రంగారావు.

క్షణాల్లో తలుపులు మూశారు.

కానీ ఉపయోగం లేదు. చిల్లరడిగిన మనిషి కనిపించ టంలేదు. అతని ప్రక్కన చూసిన మరో ఇద్దరు కూడా!

వెంటనే పోలీసులకు వార్త వెళ్ళింది.

సి. ఐ. గారు రంగంలోకి దిగారు. క్షణాల్లో బ్యాంక్ బయట గుంపులు గుంపులుగా జనం.

లోపల సి.ఐ. రంగారావ్ ప్రశ్నించటం మొదలు పెట్టారు. అతని స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకోవటం జరుగుతూంది. ఉద్యోగుల వదనాలు పాలిపోయివున్నాయి. వారంతా ఆందోళనగా చూస్తున్నారు. కౌంటర్‌ను టేప్‌తో కొలిచారు, చేతికి డబ్బు అందుతుందా లేదా అనే విషయం నిర్ధారణ చేసుకొన్నారు. 'క్యాష్' లక్ష రూపా యలు తీసుకున్నట్లుగా వుంది. ఇంకా ఒక్క ఎంట్రీ కూడా పడలేదు.

ఇదిలా ఉంటే పోస్ట్‌మాస్టర్ మాధవరావుగార్కి బ్యాంక్ సమీపంలో రోడ్డుమీద ఓ కొత్త జిప్ బ్యాగ్ కనిపించింది. ఆయనతోపాటు మరో వ్యక్తి కూడా వున్నాడు. వంగి

దాన్ని అందుకున్నాడు మాధవరావు.

"దేనికయ్యా బాబూ దాన్ని తీస్తావ్?" అన్నాడాయన.

"అదేంటోయ్ పిచ్చోడా!" అన్నట్టు చూశాడు మాధవరావు.

"ఎవరో పారేసుకున్నారు, అందులోఏమయినా ఇంపార్టెంటు కాయితాలుంటే అందచెయ్యాలి కదా" అన్నాడు. అంటూనే జిప్ లాగాడు.

లోపల ఏవేవో చిత్తుకాగితాలు!

"పారెయ్యవయ్యా ఆ దరిద్రాన్ని" సలహా ఇచ్చాడు ప్రక్కనాయన.

"ఏమిటయ్యా నీ గొడవ?" విసుక్కున్నాడు మాధవరావు.

"కొత్తబ్యాగ్‌లో ఎవరయినా చెత్త కాయితాలుంచుతారా?" అన్నాడాయన.

మాధవరావు ఇదేం పట్టించుకోలేదు. ఆయనకా బ్యాగ్ నచ్చింది. అది తనతోపాటు తీసుకెళ్ళాడు. ఇంట్లోకి వెళ్ళగానే గుప్పుమందొక వార్త.

"బ్యాంకులో లక్ష రూపాయలు పోయాయంట."

అప్పుడు మాధవరావుగార్కి ముచ్చెమటలు పోశాయి. హంతకుడు వుపయోగించిన కత్తిలా కనిపిస్తుందా బ్యాగ్! వెంటనే చావు తెలివితేటలు పుట్టి ఓ టవల్‌తో వేలిముద్రలు శుభ్రంగా తుడిచి రోడ్డు మీదకు విసరేడాయన. అయినా ఆయన ఇంటి ముందుంది కాబట్టి ఇంటరాగేట్ చేశారు.

మాధవరావుగారు టౌన్‌లో ఓ పోస్టాఫీసును నిర్వహిస్తున్నా ఆయనకో బలహీనత ఉంది. అది విపరీతంగా త్రాగటం; అందులోనూ డ్యూటీలో ఉండి కూడా. ఆఫీస్

డబ్బు కూడా వాడేస్తుంటాడు. అందుకే ఎంత సిన్సియారిటీ ఉన్నా ఆయనకు ప్రమోషన్ రాలేదు.

ఆయన రూపం చూసిన డి. యస్.పి. గారు

"నువ్వెందుకా బ్యాగ్ పట్టుకున్నావ్? నీకూ వాటా వుంది" అన్నాడు.

"నో సర్. నేను సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగిని" అంటూ చెప్పబోయాడు.

"అయితే ఆ బ్యాగ్‌నెందుకు కొంపలోకి తీసుకెళ్ళావోయ్. దాంట్లో డబ్బుంటుందనేగా! ఎక్కడ దాచావో చెప్పు."

మాధవరావు నోరు తెరిచాడు.

డి. యస్. పి. గారు నానా ఛండాలంగా తిట్టేశారు.

మాధవరావుగారి మత్తూ, ప్రిస్టేజ్ రెండూ దిగిపోయాయి.

"ఈ దాడి నామీద జరిగిందికాదు. సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ మీద జరిగింది. ఈ విషయంలో అసెంబ్లీదాకా వెళ్తాను" అంటూ మొఖం మాడ్చుకొని బయటపడ్డాడు మాధవరావు.

ప్రత్యేకంగా పోలీసు కుక్కల్ని రప్పిస్తున్నారు. అవి వాసన చూసి పట్టేస్తాయి. ఈ విషయాన్ని డి.యస్.పి. గారు ప్రతిష్ఠగా తీసుకొన్నారు.

కొద్ది గంటల్లో దొంగలు దొరుకుతారు!

## 2

మొత్తంమీద మాకు ఈ విషయం గొప్ప థ్రిల్లింగా ఉంది. మహానగరాల్లోనూ, పట్టణాల్లోనూ జరిగే ఈ బ్యాంక్ దోపిడి మా ఊర్లోనూ జరగటం, ఆ విధంగా మా ఊరిపేరు దేశానికి తెలియటంపట్ల మాకు ఆనందంగా

ఉంది. మొత్తం మా ఊర్లో జనాభా లక్షలో సగం ఉండరు. అయినా లక్షరూపాయలు పోవటం థ్రిల్లింగ్ కాదా!

"ఈ కథ ఇంతటిదో ఆగదు" అన్నాడు జ్యోతి.

"అవును. అది మాత్రం నిజమే. మా ఊరికే ఇది చాలా కాలం కాలక్షేపం." అందరూ ఈ విషయం మీదే చర్చించుకోవటం ప్రారంభించారు. మా గదిలో జరిగిన సంభాషణ ఇలా ఉంది.

"అసలు ఇన్ని విచారణలు అనవసరం. బ్యాంక్ ఉద్యోగుల సహకారం లేనిదే ఇది జరిగేది కాదు. అసలు లక్ష రూపాయలు సొరుగులో దాయకుండా ఎందుకు ఊరుకున్నాడు. కనీసం బయటకు వెళ్ళేటప్పుడయినా దాచుకోవచ్చు కదా. అసలు ఆ పది కట్టలు తీసుకొని బ్యాగ్‌లో పెట్టుకుంటుంటే ఎవరూ చూడలేదా?

లక్ష రూపాయల్ని వందల్లోనే ఎందుకు తీసుకోవాలి? మిగతా నోట్లు అవసరం లేదా? ఇదంతా ఓ ప్లాన్ ప్రకారం జరిగింది. అంత సమయందాకా ఆ క్లర్కు ఏం చేస్తున్నట్లు? అంటే అతను వాళ్ళు ఆ కట్టలు తీసుకుపోవటానికి తగ్గ రంగం సృష్టించాడు.

మరో విషయం చూసినా అర్థమవుతుంది. క్యాషియర్‌కు అటూ ఇటూ కౌంటర్స్ వున్నాయి. దొంగలు మెల్లగా డబ్బు తీస్తున్నా వాళ్ళు గమనించలేదంటే ఏం తెలుస్తుంది?

"ఆ సమయంలో వాళ్ళు అక్కడ లేరు."

"అదే ఎందుకని?"

"ఆఫీస్ మొదలయింది ఇప్పుడే కదా. ఇంకా సీట్లలోకి వచ్చుండరు."

"అదే ముందుగా అనుకొంది. అంటే ఈ కేసులో

కనీసం ముగ్గురు ఉద్యోగు లున్నారు. చాలా తెలివిగా వారికి లక్ష రూపాయలు అందజేశారు. జాతీయం చెయ్య బడ్డ బాంక్. అందుకే డ్యూటీపట్ల అంత నిర్లక్ష్యం."

"ఈ విషయం నిజమే. కానీ వారి సహకారం విషయం ఆలోచించాలి. నెగ్లిజన్స్‌మూలంగా, సరైన భద్రత లేని కారణంగానే డబ్బు పోయింది."

"నువ్వు లక్ష చెప్పు. ఈ డబ్బు పథకం ప్రకారం తీసుకున్నారు."

"అయినా విచారణ జరుగుతుందిగా."

"విచారణ దేముంది? యూనియన్ ద్వారా ప్రొసీడ్ అవుతారు."

"యూనియన్లు దొంగతనం చెయ్యమంటాయా?"

"అది కాదులే...."

"ఏం కాదు. ఇందులో ఎవరి పాత్ర ఉందో తెలియ కుండా ఎంతోకాలం ఉండదు. వాళ్ళంతా బయటకు వస్తారు."

"డి.యస్.పి. గారి కిదో ఛాలెంజ్."

# 3

మా ఊరు అటు పల్లెటూరు కాదు అలాగని పట్టణమూ కాదు. ఇక్కడ ఏ సంఘటన జరిగినా ప్రజలమీద అది విపరీతంగా తన ప్రభావాన్ని చూపిస్తుంటుంది.

బ్యాంకులో లక్ష రూపాయలు పోయాయని తెలియ గానే కొందరు డబ్బు దాచుకోవటానికే భయపడ్డారు. మరి కొందరు ఈ విషయాన్ని కొండంత విషయంగా చేశారు. ఇది జరిగిన పదిహేను రోజులకో విచిత్రం జరిగింది.

మా వూళ్ళోకి ఎక్కడి నుండో ఓ విచిత్రమైన వ్యక్తి వచ్చాడు. అతను ఊరంతా తిరుగుతుంటాడు.

ఎవర్నీ మాట్లాడించడు. ఎవరయినా దయతలచి ఏమైనా పెడితే తింటాడు. మల మూత్రాలన్నీ బట్టల్లోనే. అతను చూడటానికే అసహ్యకరంగా ఉంటాడు.

జ్యోతి ఓ రోజు అన్నాడు.

"ఆ పిచ్చా డెవరో తెలుసా?"

"పిచ్చోడు. తెలిసే దేమిటి. పిచ్చోడు" అన్నాను.

"అక్కడే పొరబడ్డావ్. ఆడెవరో తెలిస్తే నీకు మతి పోతుంది. పోలీస్ డిపార్టుమెంటుని అంత తేలిగ్గా అంచనా వెయ్యకు. లక్ష రూపాయలు ఈ పట్టణం దాటి వెళ్ళా యనుకున్నావా! లేదు. ఈ ఊర్లోనే వున్నాయి. ఎప్పు డయితే లక్ష గల్లంతయ్యాయని తెలిసాయో క్షణాలమీద వైర్‌లెస్‌లో ఇన్‌ఫామ్ చేశారు. రైళ్ళు, బస్సులు, ఒక టేమిటి ఏ వెహికల్ మీదా తప్పించుకోవటం వారికి సాధ్యం కాదు. పైగా రంగారావ్ వారి పోలికలు చెప్పాడు. అందుకే చెబుతున్నాను. డబ్బు ఇక్కడే ఉంది."

"అయితే ఆ పిచ్చోడికీ దీనికీ సంబంధం ఏముం టుంది?"

"అందుకేరా తలకాయ ఉపయోగించమని చెప్పింది. అతను ఇన్వెష్టిగేషన్ డిపార్టుమెంట్‌కు చెందిన వ్యక్తి."

"ఛా ....ఊర్కో....ఆ మనిషి శరీరం మీద బట్టలు సరిగ్గా ఉండవు. పైగా శరీరమంతా మూత్రం గబ్బు."

"నీకు తెలియదురా కన్నా. సి.ఐ.డి. లంటే ఏమను కొన్నావ్? వాళ్ళు అనేక రకాల వేషాలు వేస్తారు. నిజంగా అతను ఎంత బాగా నటిస్తున్నాడో చూడు. నా కయితే గోల్డ్‌మెడల్ ప్రెజెంట్ చేయాలనిపించింది. ఆస్కార్ అవార్డివ్వాలి.

"నువ్వు జాగ్రత్తగా గమనిస్తే అతను ఎక్కువగా

బ్యాంక్ పరిసరాల ప్రాంతాల్లో, మాధవరావు దగ్గర, వ్యాపారకూడలిలో సంచరిస్తూంటాడు నిశితంగా పరిశీలిస్తుంటాడు. అంటే పోలీస్ డిపార్టుమెంట్ బ్రహ్మాండమయిన వలపన్నింది. సినిమాల్లో ఫ్లష్‌లైట్ల వెలుగులో నటించటం గొప్ప కాదు. ఎండ తగలకుండా గొడుగు నీడల్లో చేరి సి.ఐ.డి.లుగా నటిస్తుంటారు. కానీ నిజ జీవితంలో ఇలా పిచ్చివాళ్ళుగా నటించటం సామాన్యం కాదు. అది వాళ్ళ ట్రైనింగ్: అందులోనే వ్యక్తుల ప్రతిభ ఇమిడి ఉంటుంది."

నాకు నిజంగానే మతిపోయేటట్లుంది. జ్యోతికి క్రైమ్ వరల్డ్‌తో ఎంతగానయినా పరిచయం ఉండొచ్చు. కానీ ఓ పిచ్చివాడు స్పష్టంగా కనిపిస్తుంటే వాడ్ని సి.ఐ.డి అనటం దానికోసం ఓ సుదీర్ఘ వివరణ ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

అంతమాత్రాన వాడి తర్కాన్ని తిరస్కరించలేం. అతను సంచరిస్తున్న ప్రదేశాలు వాడు చెబుతున్నవే. అవి యాక్సిడెంటల్ కావచ్చు. అయినా వాడు ఎగ్జాజరేట్ చేస్తున్నాడేమోననిపిస్తుంది. జ్యోతి ఈ కలర్ పూశాక ఆ పిచ్చివాడ్ని జాగ్రత్తగా గమనించటం ప్రారంభించాను.

అతను నటిస్తున్న పిచ్చివాడు అనటం ఏ మాత్రం న్యాయం కాదు. అతని డొక్క లెండిపోయాయి. చాలా నీరసంగా ఉన్నాడు. జుట్టు తైలసంస్కారం లేక ఉండలు చుట్టుకుపోయింది. చిన్న పిల్లలు రాళ్ళు విసురుతుంటే నిర్వికారంగా చూస్తుండేవాడు. అతను చిరిగిపోయిన బట్టల్లో దాదాపు నగ్నంగా కనిపిస్తున్నాడు.

అలాంటి వ్యక్తిని సి.ఐ.డి.గా భావించటం వెర్రి

తనం. బహుశా ఈ విషయంలో జ్యోతి అతిగా ఆలో చిస్తున్నాడు. ఒక్కోసారి అంతే. తమ కిష్టమైన రంగంలో కొందరి ఆలోచనలు విపరీతంగా ఉంటాయి.

ఆ రోజు నేను వస్తుంటే అంతా గుంపుగా ఉన్నారు. ఏం జరిగిందో వెళ్ళాను. అక్కడ కొంతమంది బక్కెట్లతో నీళ్ళు పోస్తున్నారు ఓ వ్యక్తి తలమీద. అతను బిగ్గరగా అరుస్తున్నాడు. జనమంతా తలోమాట అనుకుంటున్నారు.

అతనికేసి పరిశీలనగా చూశాను.

అతను పిచ్చివాడు

ఉరఫ్ సి.ఐ డి.!!

"ఒరేయ్ జ్యోతీ నువ్వు లక్షచెప్పు. ఈ విషయం నేను నమ్మను. అతనికి ఆఖరకు మూర్ఛరోగం సైతం ఉంది. బకెట్లకొద్దీ నీళ్ళు పోస్తుంటే స్పృహరాక అతను అరవటం నటనకాదు....కాదు. అతను కేవలం పిచ్చివాడు. బహుశా బాగా చదువుకొని ఉంటాడు. ఏ కారణంతోనో పిచ్చి వచ్చి ఉంటుంది. అంతకుమించి ఈ విషయంలో ఎలాంటి కథ చెప్పనవసరం లేదు" అన్నాను.

జ్యోతి చిద్విలాసంగా నవ్వాడు.

"చూడ్రా. నిన్ను నమ్మించటం కోసం వాడు నటించటంలేదు. అతని డ్యూటీ చేస్తున్నాడు. మూర్ఛరోగిగా గాని మరోరకంగా గాని అతను నటించగలడు. రేపు ఆ లక్షరూపాయలు దొరికాకయినా తెలుస్తుందికదా" అన్నాడు.

"ఇంతకూ ఆ బ్యాంకు ఉద్యోగుల సంగతి ఏమయింది?"

"అందులో కొంతమందిని సస్పెండ్ చేశారు. ఎంక్వైరీ జరుగుతూంది."

"ఇంకా విచారణ ఏమిటి?"

"ఈ విషయంమీద బ్యాంక్‌వారో కమిటీవేశారు. ఈ లక్షరూపాయలు పోయినా ఓ ప్రయోజనకరమైన నిర్ణయం తీసుకున్నారు."

"ఏమిటది?"

"కస్టమర్‌కి ఎంత ప్రయత్నం చేసినా సులభంగా డబ్బు తీసుకోవటం కుదరదు. కౌంటర్‌కు రెండువైపులా కలిపి చేతి పొడవు అద్దాన్ని ఏర్పాటుచేశారు. దానిక్రింద క్యాషియర్ టేబుల్ ఉంటుంది. అతను కౌంటర్‌మీద నోట్లుంచుతాడు."

"అంటే బ్యాంక్ దోపిడు లాగినట్లేనా?"

"ప్రస్తుతానికి డైరెక్ట్‌గా చేత్తో తీసుకు వెళ్ళటం ఆగిపోయినట్లే. అయితే తుపాకులూ, కత్తులూ పెట్టుకొని నీ అదృష్టం పరీక్షించుకోవచ్చు."

"ఏడ్చావ్‌గానీ. విశాలమైన కౌంటర్లు ఏర్పాటు చేసుకోవటానికి బ్యాంక్‌వారి ఖర్చు లక్షరూపాయలన్నమాట."

జ్యోతి నవ్వాడు.

"నేరం దాగదురా. బ్రహ్మయినా పట్టుబడవలసిందే"

"ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టలేడు"

"కానీ ఈశ్వరుడ్నయినా పట్టేవారున్నారు. వాళ్ళే ఐ.డి. పార్టీ"

నేను జ్యోతికేసి నవ్వుతూ చూశాను.

"ఆ లక్ష ఇంకా ఖర్చు కాలేదనుకుంటున్నావా? అవన్నీ అలానే ఉంచటానికి మార్చలేని వస్తువులు కాదుగదా. అందులోని వందలు ఇదే బ్యాంక్‌కొచ్చినా ఆశ్చర్యం లేదు."

"పిచ్చివాడా. ఆ నోట్ల నంబర్లన్నీ బ్యాంక్‌వారి దగ్గ

రున్నాయి. ఒక్క కొయితం బయటికొచ్చినా క్లూ దొరుకుతుంది.''

జ్యోతిగాడి సి.ఐ.డి. భంగిమలు చూస్తుంటే నాకు చిర్రెత్తుకొచ్చింది. వాడు చెప్పేది అసలు నమ్మశక్యం కాకుండా ఉంది.

"సరే చూద్దాం ఈ పిచ్చివాడ్ని నమ్ముకుని కూర్చో. వాడి వాలకం గమనించావో లేదో. వాడిలానే ఉంటే మరో వారం రోజుల తర్వాత ఆకల్తో చచ్చిపోతాడు. అప్పుడు ఏమంటావో నేనూ చూస్తా''

విసురుగా నడిచొచ్చాను.

నా వెనకాల జ్యోతి బిగ్గరగా నవ్వుతున్నాడు!

## 4

వారంరోజులు గడిచింది.

ఈ నడుమ నేను జ్యోతిని కలుసుకోలేదు.

అకస్మాత్తుగా వాడు మా ఇంటికొచ్చాడు.

"ఏమిటిరా'' అన్నాను.

వాడి మొఖం విషాదకరంగా ఉంది.

"సి.ఐ.డి. చచ్చిపోయాడురా'' అన్నాడు.

"ఎవరు ఆ పిచ్చివాడా''

"అవును''

"నిజంగానా''

తలూపాడు

నాకు కొంచెం బాధ కలిగింది.

"అవును. నేను ముందే చెప్పాను. అతను ఎక్కువ కాలం బ్రతకడని''

"కానీ వాడు తిండిలేక చావలేదురా''

"మరి''

"కారు యాక్సిడెంట్‌లో పోయాడు"

"ఎప్పుడు?"

"సరిగ్గా అరగంట క్రితం"

"ఎక్కడ"

"బ్యాంక్‌కు పదిగజాల దూరంలో"

నాకు వీడేదో కొత్తవిషయం చెబుతున్నట్లుంది.

"అయ్యో! వెంటనే చచ్చిపోయాడా?"

"స్పాట్ డెడ్"

"ఆ కారు ఎవరిది?"

"దర్యాప్తు జరుగుతూంది"

"అంటే"

"వాడ్ని గుద్దాక కారు వెళ్ళిపోయింది"

"వీడికి ఆ సమయంలో మూర్ఛలు వచ్చుంటాయి"

"వాడికి కాదురా మూర్ఛలు. నేరస్థులకి నిజంగా మూర్ఛలు తెప్పించాడు. ఏదో బలమైన ఆధారం వాడికి లభించింది. అందుకే వాడి ప్రాణాలు తీశారు"

జ్యోతి కళ్ళు ఆవేశంతో మండుతున్నాయి. వాడికంత ఉద్రేకం ఎందుకో నా కర్థంకాలేదు.

"కానీ నేరం దాగదురా....వాళ్ళు తప్పకుండా పట్టుబడతారు"

"ఇంకేం పట్టుబడతారో సి.ఐ.డి. నే చంపేశాక"

జ్యోతి కొంచెంసేపు ఆలోచించాడు.

"ఐ.డి. పార్టీవాళ్ళు తెలివైనవారు. వాళ్ళు రంగంలోకి భిన్నరూపాల్లో వస్తారు. ముందుగా ఒకడ్ని పిచ్చివాడి రూపంలో పంపారు. అందరి దృష్టి వాడి మీదుంటుంది. మరో పార్టీ తన పరిశోధన పూర్తి చేసుకుంటుంది. ఒకరు

మరణిస్తే పరిశోధన ఆగిపోదురా. ఆ దోపిడిగాళ్ళు ఇప్పుడు హంతకులయ్యారు. వారంతా ఉరికంబం ఎక్కుతారు" అన్నాడు కఠినంగా.

నాకు నోటివెంట మాట రాలేదు.

వాడి లాజిక్ మాత్రం అద్భుతం.

"మరో పిచ్చివాడెవడన్నా వస్తాడా?"

"హాస్యంకాదు. మరో రూపంలో వస్తారు."

"రక్తపు మడుగులోవున్న ఆ మహావ్యక్తిని చివరి సారిగా చూడాలంటే నాతోరా" అన్నాడు.

"పద" అంటూ అనుసరించాను.

ముగింపు :

రెండు సంవత్సరాలు గడిచాయి.

ఈలోపు మరే దొంగతనం మా ఊరి బ్యాంకుల్లో జరగలేదు.

నేను శెలవుమీద మా ఊరొచ్చాను. అన్నట్లు రెండు సంవత్సరాల క్రితం నాకు ఉద్యోగం వచ్చింది. స్టేషన్ దగ్గర జ్యోతి కలిశాడు.

"ఏరా, ఆ కేసు ఏమయింది?" అన్నాను.

"పెటిలయింది"

"నిజంగానా? ఎవరు? దొంగలెవరు?" ఆత్రంగా అడిగాను.

"అది మన కనవసరం"

"అదేమిటి?"

"అదంతే రాజీ జరిగిపోయింది. ఎవడి వాటాలు వాడు అనుభవిస్తున్నాడు. పోలీసులంటే ఎగతాళి కాదు" అన్నాడు! □

# ఉత్తరంలో ఉపాయం

జొన్నలగడ్డ రామలక్ష్మి

నిర్మల రిసీవరెత్తి "హలో!" అంది.

"మాట్లాడేది నిర్మలేనా?" అందవతలి గొంతు.

ఆ గొంతు పురుషుడిదేనని తెలుస్తోంది కానీ ఎవరో తెలియడంలేదు. కావాలని గొంతుమార్చి బొంగురుగా మాట్లాడుతున్నాడతడు.

"అవును. నువ్వెవరు?" అంది నిర్మల.

"నీ గుండెల్లో రాయిని—" అందా గొంతు.

"అంతే?"

"నీకు పెళ్ళయింది. నీ భర్త గోపీచంద్ లక్షాధికారి. సమాజంలో అతడికి పేరు ప్రతిష్ఠలున్నాయి. అతడి కారణంగా నీకూ గౌరవముంది—"

"అయితే?"

"నేను తలచుకుంటే క్షణంలో నీ బ్రతుకు నడిబజారు పాలు చేయగలను—" అందా గొంతు.

"ఎవరునువ్వు?" అంది నిర్మల.

"నీకూ, ప్రసాద్‌కీ ఉన్న సంబంధం—అనగా పెళ్ళికి ముందున్న సంబంధం—నాకు తెలుసు—"

అప్పుడు నిర్మల గుండెల్లో నిజంగానే రాయిపడింది.

"మీరిద్దరూ కలిసి తీయించుకున్న ఫొటోలు—ఒకరి కొకరు రాసుకొన్న ఉత్తరాలు నా దగ్గరున్నాయి...."

"ఏం కావాలి నీకు?" అంది నిర్మల.

"లక్షరూపాయలు...." అన్నాడతడు.

"అంత డబ్బు నేనెక్కణ్ణించి తేగలను?"

"నీ యింట్లోంచి!"

"ఒక్కసారి లక్షరూపాయలు తెచ్చే శక్తి నా దగ్గర లేదు...."

"అయితే నీ రహస్యం నీ భర్తకు తెలుస్తుంది...."

"వద్దు—" అంది నిర్మల.

"అయితే లక్షరూపాయలు తెచ్చి నా కివ్వు"— అన్నాడతడు.

"ప్లీజ్—ఇంకేదైనా ఉపాయం చెప్పు—" అందామె.

"ఒకే ఒక్క ఉపాయం చెప్పగలను. ఆ తర్వాతింకో ఉపాయం చెప్పమని అడక్కూడదు—"

"ముందు నీ ఉపాయం చెప్పు...."

"చెబుతాను. కానీ ఈ ఉపాయం నీకు నచ్చకపోతే—

వెంటనే నాకు లక్షరూపాయలు తెచ్చివ్వాలి...."

"ముందు నీ ఉపాయం చెప్పు...."

"అదంత సులభంగా చెప్పను. దానికో తంతుంది...."

"ఊఁ"

"సాయంత్రం నాలుగింటికి నీ యింటికో కుర్రాడొస్తాడు. వాడి చేతిలో ఓ పోలితీన్ బాగుంటుంది తీసుకో. వాణ్ణించి నీ కింకే వివరాలూ లభించవు. ఆ సంచీలో ఓ ఎర్రచీరుంటుంది. ఆ చీరకు మ్యాచింగ్ జాకెట్ నీ దగ్గిరుందని నాకు తెలుసు. రెండూ వేసుకో. తిన్నగా ప్రసాదింటికిరా...."

"అక్కడికెందుకు?"

"ప్రసాదంటే నీకు నమ్మకమని నాకు తెలుసు. నేనక్కడ నీ కుపాయం చెబుతాను...."

"ఎలా?"

"మనిషిని కనపడను. గదిలో టీపాయ్‌మీద నీ కోసం ఓ కవరు పెడతాను. ఆ కవర్లో ఉత్తరం ఉత్తరంలో ఉపాయం...."

"ఏమిటా ఉపాయం?"

"అదప్పుడే ఎలా తెలుస్తుంది? నేను చెప్పినట్లు చేయి...."

"చేయకపోతే?"

"నీ బ్రతుకు నడిబజారు పాలు...."

"నువ్వక్కడ నా మీద అఘాయిత్యం చేస్తే?"

ఫోన్‌లో ఆమెకు నవ్వు వినిపించింది.

"నిర్మలా! ఈ ప్రపంచంలో ఏదైనా డబ్బు తర్వాతనే! ఆఖరి కాడదికూడా! ఈ రహస్యం తెలిసిన నా కాడదంటే ఆకర్షణలేదు. డబ్బును నమ్ముకున్న వాడెవ్వడు స్త్రీ

వ్యామోహానికి గురికాడు. నీకు నమ్మకంగా ఉంటుందనేగా ప్రసాద్ ఇంట్లో మన సమావేశం ఏర్పాటు చేశాను....”

“ఇంతకీ నువ్వెవరు?”

“అది తెలుసుకొందుకు ప్రయత్నించకు. నీలాంటి ప్రేమికులు నాకొక వరం. నీ వంటివారి తొందరపాటు నా ధనం—”

అవతల క్లిక్‌మంది.

నిర్మల రిసీవర్ క్రేడిల్ చేసింది. ఆమె ముఖం నిండా చెమటలు. వళ్ళంతా వణుకు.

ఏం జరుగుతుందిప్పుడు?

ఆమె సామాన్య మధ్యతరగతి యువతి. ప్రసాద్‌ను ప్రేమించింది. వారి ప్రేమ చాలా దూరం వెళ్ళింది. ఒకే ఊళ్ళో ఉంటూ కూడా ఒకరికొకరు ఉత్తరాలు రాసుకునే వారు. తరచు సినిమాలకు వెళ్ళేవారు. పార్కుల్లో కలుసుకునేవారు.

చివరకు పెళ్ళికి ముందువరకూ ఉండాల్సిన దూరం కూడా ఉంచలేదు.

తల్లిదండ్రులీ విషయం గ్రహించి కంగారుపడి— ప్రసాద్‌తో పెళ్ళి మాటలు కదిపారు.

ప్రసాద్ తలిదండ్రులు బాగా కట్నమడిగారు.

నిర్మల ప్రసాద్‌ని నానామాటలూ అంది.

“నేను స్వతంత్రుణ్ణి. నా తలిదండ్రులను కాదని నిన్ను పెళ్ళిచేసుకొందుకు సిద్ధంగా ఉన్నాను. అయితే నా తండ్రికి నెలరోజుల క్రితమే హార్ట్ ఎటాక్ వచ్చింది ఆయన్ను దాన్నించి తేరుకోనీ— ” అన్నాడతడు.

కట్నమడగడాని కడ్డురాని హార్టెటాక్—కట్నంలేని పెళ్ళికడ్డు పడ్తోంది.

నిర్మల చేసేదిలేక ఊరుకుంది.

ఆ సమయంలో గోపీచంద్ నుంచి కబురు వచ్చింది.

అతడామె నేదో పెళ్ళిలో చూశాడు. ఆమె అతడికి నచ్చింది. వివరాలు సేకరించాడు. తమకులం పిల్లేనని తెలిసింది.

కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటానన్నాడు.

సంబంధం ఎంత మంచిదంటే నిర్మలకు కాళ్లూ చేతులూ కట్టయినా సరే ఈ సంబంధం చేయాలని తలి దండ్రులనుకున్నారు.

నిర్మలకు ప్రసాదంటే కసిగా ఉండటంవల్ల - అలాం టవసరం లేకుండానే ఈ పెళ్ళి చేసుకుంది.

నిర్మల పెళ్ళి అయిపోయింది.

ఆ తర్వాత ఆర్నెల్లకు ప్రసాద్ పెళ్ళి అయి పోయింది.

నిర్మల ప్రసాద్‌ను మర్చిపోయేందుకు ప్రయత్నిస్తోంది. చాలావరకూ అందులో కృతకృత్యురాలయింది కూడా.

గోపీచంద్ మంచివాడు. భార్యంటే అతడి కిష్టం. అయితే అతడావేశపరుడు. చాలా తొందరగా అతడి క్కోపం వచ్చేస్తుంది. ఆవేశంలో అతడెంతపనయినా చేసి ఆ తర్వాత పశ్చాత్తాపపడతాడు.

ఒకసారతడు పనివాళ్ళ ముందు భార్యమీద చేయి చేసుకున్నాడు.

నిర్మల రోజంతా ఏడ్చింది.

జరిగిన పొరపాటుకు - ఆవేశం తగ్గేక గోపీచంద్ కూడా బాధపడి - "కావాలంటే పనివాళ్ళ ముందే నిన్ను క్షమార్పణ కోరుకుంటాను" అని అన్నంత పనీ చేశాడు.

నిర్మల నొచ్చుకుని - "అడుసు తొక్కనేల - కాలు

కడుగనేల'' అంది బాధగా.

"అది నా అసహాయత. అందుకే నువ్వింట్లో ఆడుసుం చకు'' అన్నాడతడు.

"అంటే?'' అంది నిర్మల.

"నలుగురి ముందూ నన్ను రెచ్చగొట్టకు. నేనేమన్నా భరించు. అదే మనిద్దరి పరువూ నిలబెడుతుంది'' అన్నాడతడు.

"మీ పరువు నిలబెట్టడం కొసం నా పరువు గురించి కూడా చూసుకోను'' అంటూ హామీ యిచ్చింది నిర్మల అతడికి.

"పరువు మాటల్లో లేదు. డబ్బులో ఉంది. నీ పరువును పెంచడానికి నేను డబ్బిస్తాను'' అన్నాడతడు.

•భార్య పేరున అకౌంట్స్ ఓపెన్ చేసి-వాటిలో అయిదు లక్షలు వేశాడు. తన యావదాస్తికీ ఆమె ఏకైక వారసురాలని విల్లు రాశాడు.

ఈ కారణాలవల్ల నిర్మల భర్తను ప్రేమించడం మొదలెట్టింది. అతడి నర్థం చేసుకుందుకు ప్రయత్నించసాగింది.

నలుగురిలో చిన్నబుచ్చే అతడి ఆవేశం కాస్త యిబ్బందికరంగానే వున్నా క్రమంగా మనస్ఫూర్తిగా భరించడం నేర్చుకుంది.

ఇప్పుడీ టెలిఫోన్ కాల్....

లక్ష రూపాయలు బ్లాక్ మెయిలర్ కివ్వాలి.

అకౌంట్ ఆమె పేరునే ఉన్నప్పటికీ తన డబ్బుమీద వచ్చే వడ్డీని మాత్రమే చిల్లర ఖర్చులకు పాకెట్ మనీగా వాడుకోమని అతడామెకు సలహా యిచ్చాడు.

"అర్థాంతరంగా నాకేదయినా అయితే వెంటనే నీకే

యిబ్బందీ కలక్కూడదని ఈ డబ్బు నీ పేరున అకౌంట్లో వేశాను. ఇది నువ్వు వాడుకుందుకు కాదు. నీ కనీసావసరాలన్నీ నేనే భరిస్తాను. బయట షాపింగులో నీకయ్యే ఖర్చులన్నీ బిల్లుల రూపంలో నాకే వస్తుంటాయి. అయినప్పటికీ నాకు తెలీకుండా ఇంకా నీకు చిల్లర ఖర్చులుంటే ఈ అయిదు లక్షల మీదా వచ్చే వడ్డీ డబ్బును వాడుకో."

ఇది భర్త సలహా కాదు ఆజ్ఞ!

నిజానికి తనకు డబ్బవసరం లేదు. అన్ని అవసరాలూ భర్తద్వారా తీరుతూనే వున్నాయి.

ఇప్పుడు భర్తకు తనకూ, ప్రసాద్ కూ ఉన్న సంబంధం గురించి తెలిస్తే కొంప మునిగిపోతుంది.

ఈ వైభవ ముండదు. ఈ సుఖముండదు.

అన్నింటికీ మించి ప్రసాద్ కు కూడా వివాహమైంది.

తన జీవితం బజారుపాలయితే ఆదరించే నాధుడు కూడా ఉంటడు.

ప్రసాద్ మీద నిర్మలకు నమ్మకముంది. ఆ యింట్లో తన మీద ఏవిధమైన అఘాయిత్యమూ జరగదని ఆమె నమ్మకం. అందుకే ఆమె అతడింటికి వెళ్ళాలనే అనుకుంది.

అయితే ఈ బ్లాక్ మెయిలర్ కి తన గురించిన వివరాలన్నీ ఎలా తెలిశాయి? అతడు తనని ప్రసాదింటికి రమ్మని ఎందుకన్నాడు?

ఇందులో ప్రసాద్ పాత్రగానీ లేదుకదా?

"ఉన్నప్పటికీ అతడికి భయపడనవసరం లేదు. అతణ్ణి నేను చీవాట్లేయగలను" అనుకుంది నిర్మల.

బ్లాక్ మెయిలర్ చెప్పిన ప్రకారం సరిగ్గా సాయంత్రం నాలుగింటికో కుర్రాడొచ్చి ఆమెకో ప్యాకెట్టిచ్చి వెళ్ళి

పోయాడు. వాడి నడిగితే ఆమెకే వివరాలూ లభించలేదు.

ప్యాకెట్‌లో చీరతోబాటు ప్రసాద్ ఆమె భుజంమీద చేతులువేసి కళ్ళలో కళ్ళుపెట్టి చూస్తూన్న ఫోటో కాపీ, నిర్మలతడికి రాసిన ఉత్తరానికి క్జిరాక్స్ కాపీ ఉన్నాయి. చిన్న కాగితం మీద - "నీ నమ్మకానికి శాంపిల్‌గా" అని వ్రాసి ఉంది.

వాటి విషయ మెలాగున్నా - "చీర మాత్రం చాలా బాగుంది" అని ఆమె ఆడమనసు మెచ్చుకోకుండా ఉండ లేకపోయింది.

## 2

"హలో!" అన్నాడు గోపీచంద్.

"గోపీచంద్‌గారేనా? నమస్కారం" అందవతలి గొంతు.

"నమస్కారం-ఎవరు మీరు?"

"మీ శ్రేయోభిలాషిని."

"అంటే?"

"మీ భార్యకు తలదన్నే అందగత్తెను పరిచయం చేస్తాను. మీరు మీ భార్యను విడిచి ఆమెను పెళ్ళి చేసుకుంటే సంతోషిస్తాను."

"ఎవర్నువ్వు?" కోపంగా అన్నాడు గోపీచంద్.

"చెప్పానుగా - మీ శ్రేయోభిలాషినని!" అందవతలి గొంతు.

"ఇంతకీ నువ్వు చెప్పదలచుకున్న దేమిటి?"

"మీ భార్య కులట...."

"షటప్" అన్నాడు గోపీచంద్.

"నా మాట మీద మీకు నమ్మకం లేకపోతే - ఒక్క అరగంటాగి బయలుదేరండి. నేను చెప్పిన చిరునామాకు

వెళ్ళండి. కొ_స్త దూరంగా నిలబడితే నేను చెప్పినిల్లు దొడ్డిగుమ్మం మీకు కనబడుతుంది. కాసేపటిలో ఆ దొడ్డి గుమ్మంద్వారా మీ భార్య ఆ యింట్లో ప్రవేశిస్తుంది. వెంటనే వెళ్ళిపోకుండా కాసేపాగి ఆ దొడ్డిగుమ్మానే మీరూ లోపలకు వెళ్ళండి. మీ భార్య అసలు స్వరూపం కంటబడుతుంది'' ఆందవతలి గొంతు.

''ఏయ్ మిస్టర్ - ఎవర్నువ్వు?''

''నేను మీ శ్రేయోభిలాషిని. అవసరం వచ్చేక నేనే మీ కంటపడతాను. ప్రస్తుతానికి నేను చెప్పిన అడ్రసు రాసుకోండి. టైమ్ నోట్ చేసుకోండి ...'' అంద వతలి గొంతు.

''నువ్వు నా శ్రేయోభిలాషివి కాదు'' అంటూనే గోపీ చంద్ అతడు చెప్పిన అడ్రస్ నోట్ చేసుకున్నాడు.

''మీరంటే నాకెంతో గౌరవం. అందుకే మీరు నన్ను నువ్వన్నా నేను మిమ్మల్ని మీరనే అంటున్నాను....'' అందవతలి గొంతు.

ఆ తర్వాత క్లిక్ మన్న చప్పుడు విని ఫోన్ క్రింద పెట్టేశాడు గోపీచంద్.

అప్పడతడి బుర్ర చక చకా పనిచేయసాగింది.

ఎవరో తన భార్యమీద అభియోగం చేస్తున్నారు. ఎందుకు?

అతడు నిజంగా శ్రేయోభిలాషా లేక తన సంసారంలో నిప్పులు పోయాలని చూస్తున్నాడా?

గోపీచంద్ వెంటనే యింటికి ఫోన్ చేశాడు.

పనివాడొకడు అవతల ఫోనందుకున్నాడు.

''అమ్మగారు బయటకు వెళ్ళారు'' అని సమాధానం వచ్చింది.

గోపీచంద్ టైము చూసుకున్నాడు.

ఇక తనూ బయలుదేరాల్సిన టైమైంది.

అతడు తన ముందున్న డ్రాయర్ సొరుగు తీసి రివాల్వరందుకుని కోటు జేబులో వేసుకున్నాడు.

"ఆ పాతకురాలు గనుక-నిజంగానే నన్ను వంచిస్తే-దాన్ని బ్రతకనివ్వను" అనుకున్నాడతడావేశంగా.

## 3

నిర్మల ఇంట్లోంచి బయలుదేరాక కాలి నడకనే సందులు గొందులు తిరిగి ప్రసాద్ ఇల్లు చేరుకుంది. దొడ్డి గుమ్మాన ఇంట్లో ప్రవేశించింది.

ఇంట్లో ఎక్కడా అలికిడి లేదు.

ఒక గదిలొ బల్లమీద ఆమెకు కవరు కనబడింది.

నిర్మల కవరు విప్పింది.

అందులో ఒక ఫోటో—ఆ ఫోటోలో....

ఒక యువతి, యువకుడు.

యువకు డామెకు తెలుసు. గోపీచంద్.... తన భర్త!

యువతి ఎవరో ఆమెకు తెలియదు....కానీ ఆమె భార్య అయిన తనకంటె మిన్నగా అతడిని హత్తుకు పోయింది.

వారిద్దరికీ సంబంధమున్నదని వేరే చెప్పక్కరలేదు.

ఫోటోతోపాటు కవరులో ఓ ఉత్తరం....

"ఈ ఫోటోతో నీ భర్తను బ్లాక్ మెయిల్ చెయ్యి. అలా డబ్బు సంపాదించి అది నాకియ్యి, ఇదే నేను నీకు చెప్పదల్చుకున్న వుపాయం."

సంతకం లేదు.

నిర్మలకు వళ్ళంతా వణికింది.

ఆమెకు భర్త గురించి బాగా తెలుసు.

అతడు తన తప్పును ధైర్యంగా ఒప్పుకుంటాడు.

తనకు పరస్త్రీ పరిచయ మున్నదనీ - అది తన వ్యాపార దృష్ట్యా అవసరమనీ అతడు నిర్మలకు చెప్పి ఉన్నాడు.

"నే నెవరితో మసలినా అతిగా తిరగను. ఎవరితో తిరిగినా వారికి భార్య అర్హత లేదు. నీవు నా భార్యవు. నీ ద్వారా నా వంశం వృద్ధి కావాలి. నీ సంతానానికే నా ఆస్తి వారసత్వంగా సంక్రమిస్తుంది" అని అతడొకసారి ఆమెతో అన్నాడు.

"మరి మీరు నీతిగా ఉండనవసరం లేదా?" అంది నిర్మల.

"నాకు నీతులు చెప్పకు. నువ్వు నీతిని తప్పకు" అన్నాడతడు.

తానతణ్ణి ఫోటో చూపించి బ్లాక్ మెయిల్ చేయ గలదా?

నిర్మలింకా ఏమో ఆలోచిస్తూండగా అక్కడ అడు గుల చప్పుడయింది.

ఆమె భయపడింది.

ఎవరది వస్తూంట?

బ్లాక్ మెయిలరా - లేక ప్రసాదా!

లేక ప్రసాదే బ్లాక్ మెయిలరా?

ఇద్దరూ కాకపోతే?

మూడోవ్యక్తి కంట పడటం ఆమె కిష్టంలేదు.

ఆమె వెంటనే దగ్గరలో వున్న బీరువా చాటున దాక్కుంది.

తొంగి చూస్తూంటే ఆమెకు గదంతా స్పష్టంగా కన బడుతోంది కానీ - బయటివాళ్ళ కామె కనపడదు.

క్రమంగా అడుగుల చప్పుడు దగ్గరయింది.

గదిలోకి ఓ వ్యక్తి ప్రవేశించి ఆగాడు.

అతడి నామె చూసింది.

ఒక్కసారి గుండె ఆగిపోయిందా అనిపించిందామెకు.

ఆ వచ్చినది గోపీచంద్! తన భర్త....

ఇదెలా సాధ్యం?

తన భర్తకు ప్రసాద్‌తో పరిచయం లేదు. తను చెప్ప లేదు. వ్యాపారపరంగా సంబంధం లేదు.

పోనీ ప్రసాద్ గొప్పవాడు కాబట్టి పరిచయమయ్యా డనుకుందుకూ లేదు. అతడు సామాన్యుడు.

అతడి మొత్తం యిల్లంతా కలిసి నిర్మల బెడ్రూమంత లేదు.

మరి తన గురించి భర్తకెలా తెలిసింది?

అనుకోకుండా తన నతడు చూసి వెంటపడి వచ్చాడా? లేక బ్లాక్‌మెయిలరే అతడి నిక్కడకు రప్పించాడా?

అయితే బ్లాక్‌మెయిలరలా ఎందుకు చేస్తాడు? అతడికి తననించి డబ్బు కావాలి. భర్త యిక్కడకు వస్తే తనని చూస్తే - అసలుకే మోసం వస్తుంది.

నిర్మల భర్తనే చూస్తోంది.

ఆమె చూస్తూండగా అతడా గది దాటి వెళ్ళాడు.

నిర్మల క్షణం కూడా ఆలస్యం చేయకుండా బీరువా వెనుక నుంచు బైటపడి దొడ్డి గుమ్మందారిన వెనక్కు వెళ్ళిపోయింది.

## 4

గుమ్మానికి దగ్గరలో పడివుందొక ఎర్ర చీర.

ఆ చీరను గుర్తుపట్టాడు గోపీచంద్.

ఆ చీరనే ధరించి నిర్మల ఆ యింట్లో ప్రవేశించింది.

ఆమె వంటిమీదుండాల్సిన చీర - నేలమీద పడుంది.

గోపీచంద్ శరీరంలో ఆవేశం ప్రవేశించసాగింది.

చీరకు కాస్త దూరంగా - లే దుస్తులు....

గోపీచంద్ ఆవేశం పెరిగింది.

అంటే - శ్రేయోభిలాషినంటూ అతడెవరో చెప్పిన దాంట్లో యిసుమంత కూడా అబద్ధం లేదు.

నిర్మల బరి తెగించింది.

తను నిర్మల కేమన్యాయం చేశాడు?

ఆస్తి. హోదా అన్నీ యిచ్చాడు. సమాజంలో ఆమెకు ప్రత్యేకమైన గౌరవస్థానం కల్పించాడు.

ప్రతిఫలంగా ఆమె భర్తకే అన్యాయం చేస్తూంది.

బహుశా తానితర స్త్రీలతో తిరుగుతున్నందుకు ప్రతీకారంగా ఆమె ఈ పని చేస్తూందేమో? అలాంటప్పుడు తనకా విషయం చెప్పొచ్చుగా?

ఏమో - తన ఆవేశానికి భయపడిందేమో!

"నిర్మలా! నా అసలయిన ఆవేశాన్నిప్పుడు చూస్తావు. నీ యీ తప్పును నేను క్షమించను" అనుకుంటూ గోపీచంద్ ఓ అడుగు ముందుకు వేశాడు.

అప్పుడతడికి గది లోపలి భాగం స్పష్టంగా కనబడుతోంది.

మరీ అంత చిన్న గది కాదు.

గోడ వారకూ కిటికీకి దగ్గరగా వుందొక మంచం.

నాలుగున్నరడుగుల వెడల్పు, ఆరడుగుల పొడవు వుంటుందా మంచం.

కిటికీ తలుపులు వేసున్నాయి. కాని పయిన అద్దాలుండటంవల్ల గదిలోకి వెలుతురు వస్తూంది.

ఆ అద్దాల వెలుతురులో మంచం మీద పడుకున్న

యువతి స్పష్టంగా కనబడుతోంది.

ఆమె వంటి మీద దుస్తులు లేవు.

అటుగా తిరిగి పడుకుని ఉంది.

నల్లని కురులామె వీపును కప్పేశాయి.

అంతకు మించి ఆమెను కప్పడాని కింకేమీ లేదు.

గోపీచంద్ ఆమెనే చూస్తున్నాడు.

తన భార్య - నిర్మల - పరాయింట్లో యిలా—

ఛీ....ఛీ....

అతడి ఆవేశం ఉధృతమైంది.

ఆమె వీపుకు బాగా దిగువన నల్లని పుట్టుమచ్చ....

గోపీచంద్ ఆ పుట్టుమచ్చను గుర్తించాడు.

ఆవేశం పెల్లుబికిం దతడిలో—

జేబులోంచి రివాల్వర్ తీసి గురిచూసి ఆమెను కాల్చా డతడు.

గుండామె వీపును తాకింది. రక్తం ఒక్కసారిగా చిమ్మింది.

గోపీచంద్ మరోసారి రివాల్వర్ పేల్చి వెనక్కి తిరిగాడు.

అతడి ఆవేశం కాస్త తగ్గింది.

తనేం చేశాడో అతడికి తెలుసు.

చేసిందాని కతడిలో విచారం లేదు. తప్పు తన నంట కుండా తప్పించుకోవాలని అతడి తపన. అందుకతడి ఆవేశం నిదానంగా మారింది.

అతడు రివాల్వర్‌ను జేబులో వేసుకున్నాడు.

ఆ గదిలోంచి బయటపడి బీరువా వున్న గదిలోకి వచ్చాడు.

రుమాలు తీసి ముఖానికి పట్టిన చెమటను తుడుచు

కున్నాడు.

అప్పుడతడికి అడుగుల చప్పుడు వినబడింది.

ఇంట్లో నిర్మల ప్రియు డెక్కడో ఉండే ఉంటాడు. రివాల్వర్ చప్పుడు విని అతడు వస్తాడు. తన్ను చూస్తాడు.

ఇప్పుడు గోపీచంద్‌కి ఆవేశం స్థానంలో భయం ప్రవేశించింది.

అతడు చటుక్కున బీరువా చాటుకు వెళ్ళాడు.

వీలు చూసుకుని ఇంటిలోంచి పారిపోవాలి.

అవసరమైతే నిర్మల ప్రియుణ్ని కూడా చంపేయాలి.

గోపీచంద్ ఆలోచిస్తున్నాడు.

నిర్మల అతణ్ని ఏకాంతంలో కలుసుకుందుకు వచ్చింది. అంటే ఇంట్లో అతడు తప్ప ఇంకెవ్వరూ ఉండరు.

తాను అతణ్ని కూడా హతమార్చితే - నిర్భయంగా పారిపోవచ్చు.

గోపీచంద్‌కి అడుగుల చప్పుడు దగ్గరయింది.

అతడు బీరువా చాటునుంచి బయటకు వచ్చి -

"హేండ్సప్" అన్నాడు. అప్పుడు గోపీచంద్ చేతిలో రివాల్వరుంది.

కానీ గోపీచంద్ ఎదుట నిలబడి ఉన్నది సామాన్యుడు కాడు.

పోలీసు యూనిఫాంలో ఉన్నాడొక వ్యక్తి.

"మిస్టర్! రివాల్వర్ దించు. నువ్వు నన్నేమీ చేయలేవు. ఇంటి చుట్టూ పోలీసులున్నారు...." అన్నాడతడు.

"ఇంటి చుట్టూ పోలీసులా - ఎందుకు?"

"ఈ యింట్లో స్మగ్లింగ్ జరుగుతోందని మాకిప్పుడే కబురొచ్చింది."

గోపీచంద్ బుర్ర చకచకా పని చేసింది.

ఎదురుగా పోలీసాఫీసరు....

ఇంటి చుట్టూ పోలీసులు....

ఇప్పటికే ఈ ఇంట్లో తానొక హత్య చేశాడు.

ఈ పోలీసాఫీసర్ని చంపినా తాను పోలీసుల బారి నుండి తప్పించుకోలేడు. ఆ తర్వాత చేతులకు సంకెళ్ళు.... కటకటాల వెనుక జీవితం....

పేపర్లో తన గురించిన వార్తలు....

ఒక రోజున తనకు ఉరిశిక్ష....

"నో!" అంటూ అరిచాడు గోపీచంద్.

"మిస్టర్ - మర్యాదగా లొంగిపో" అన్నాడా వ్యక్తి.

"ఇన్‌స్పెక్టర్ - లొంగిపోయే ముందు నాదో చిన్న మనవి. నేను నేరస్థుణ్ని కాదు - హంతకుణ్ణి కాదు. ప్రాణంతో సమానంగా ప్రేమించిన నా భార్య నన్ను మోసం చేసి పరాయి మగాడితో విచ్చలవిడిగా తిరుగుతుంటే ఆవేశం చంపుకోలేక ఆమెను హత్య చేశాను. అదామెకు తగిన శిక్ష అని నా అభిప్రాయం. అయితే చట్టం నన్నిందుకు క్షమించదు. ఇంత కాలం ఎంతో పరువుగా, పేరు ప్రతిష్ఠలతో బ్రతికాను. ఇప్పుడు నేరస్థుడిగా కటకటాల వెనుక నా జీవితాన్నంతం చేసుకోలేను. అందుకే ఇప్పుడే ఈక్షణమే నన్ను నేనంతం చేసుకుంటాను. నా కథ పదిమంది మనసులూ కరిగించాలి. నా భార్యను ప్రపంచమంతా వేలెత్తి చూపి నిందించాలి. ఇంతే నేను మిమ్మల్ని కోరేది!"

గోపీచంద్ ఇక మాట్లాడలేదు. అతడు రివాల్వర్ నుదుటికి గురి పెట్టుకుని తన్ను తాను కాల్చుకున్నాడు.

# 5

"ఊఁ చెప్పు - తర్వాతేం జరిగింది?" అంది నిర్మల.

"ఏం జరుగుతుంది? నా యింట్లో నీ ఫోటో, ప్రేమ లేఖలు చూశాక నా భార్య నన్ను సాధించడానికి బదులు - నిన్ను సాధించమని వేధించసాగింది. జరిగిందేదో జరిగి పోయింది - అందుకు మిమ్మల్ని క్షమిస్తున్నాను - కానీ ఈ ఉత్తరాలతో మనకు బంగారుగ్రుడ్లు పెట్టే బాతు దొరికింది - ఉపయోగించుకుని మన అంతస్తు పెంచుకుందా మంటుందామె. నేనెంత చెప్పినా వినలేదు సరికదా - నాకు తెలియకుండా మనకు సంబంధించిన ఫోటోలు, ఉత్తరాలు కొన్ని తను రహస్యంగా దాచిపెట్టి - నేను పూనుకోక పోతే తనకు తెలిసినవారిద్వారా నిన్ను సాధిస్తానంది. మన వ్యవహారం మరో వ్యక్తి చేతుల్లో పడటం నా కిష్టంలేదు. అందుకే బాగా ఆలోచించి మాస్టర్‌ప్లాన్ వేశాను...." అన్నాడు ప్రసాద్.

"ఊఁ"

"మీ వారు ప్రముఖ వ్యాపారవేత్త కాబట్టి ఆయన గురించి చాలామందికి తెలుసు. ఆయన మనస్తత్వాన్ని బాగా స్టడీ చేయగలిగానా విధంగా. తర్వాత బ్లాక్‌మెయిల ర్నయి నీకూ ఆయనకూ ఫోన్ చేశాను. ఒకేలాంటి రెండు చీరలు కొని - ఒకటి నీకు పంపాను. రెండో చీరను నీ భర్త ఆవేశం రెచ్చగొట్టడాని కుపయోగించాను. ఆ సమయంలో నిద్రమాత్రలతో నిద్రపోతోంది నా భార్య ఆమెకు లేనిపుట్టుమచ్చ నేర్పరచి అతడి కళ్ళు బడేలా చేశాను...."

"ఊఁ"

"అతడామెను హత్యచేసి బీరువా వెనుక నక్కితే - పోలీసాఫీసరు వేషంలో భయపెట్టాను. నిజానికి నేను పెద్ద రిస్కే తీసుకున్నాను. ఇంటి చుట్టూ పోలీసులున్నా రని అబద్ధం చెప్పాను. అయినా ఆయన నన్ను చంపి మళ్ళీ పారిపోవచ్చు. కానీ అదృష్టవశాత్తు అంతా నేననుకున్నట్లే జరిగింది. అతడు తన్ను తాను కాల్చుకోగానే నేను పోలీసు దుస్తులు మార్చి - మామూలు వేషంలో హడావుడిగా పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి - ఎవరో వ్యక్తి నా భార్యను కాల్చి తన్ను తాను కాల్చుకున్నాడంటూ కథ చెప్పాను."

"అంటే నిజానికి నీవు రెండు హత్యలు చేసినట్లు...." అంది నిర్మల సాలోచనగా.

"కావచ్చు. అయితే తాను తప్పుదారిన నడుస్తూ తన భార్య పొరపాటుచేస్తే కాల్చి చంపాలనుకునే ఆవేశపరుడి చేతిలో—సుఖంగా కాపురం చేసుకుంటున్న ఓ యిల్లాలి జీవితంలో నిప్పులు పోయాలనుకునే మరో ఆడది చచ్చేలా చేశాను. నీ భర్తవల్ల నీకేరోజైనా ప్రమాదముంది. నా భార్యవల్ల - ఏనాడైనా ఎవరికైనా ప్రమాదముండొచ్చు. నేను చేసింది మంచో, చెడో నాకు తెలియదు. కానీ నీకోసం. నిన్ను నాకోసం దక్కించుకోవాలన్న స్వార్థం కోసం చేశాను. నువ్వు నన్నర్థం చేసుకుని క్షమించ గలిగితే సరే; లేదా - నువ్వు నన్ను క్షమించే రోజుకోసం ఎదురుచూస్తూంటాను. నిన్ను కాదని మరో యువతిని పెళ్ళాడి ఓ తప్పు చేశాను. రెండోసారి అలాంటి తప్పు చేయను...."

నిర్మల ఆలోచిస్తూంది—

గోపీచంద్, ప్రసాద్ భార్యల చావుకి కారణమేమిటి?
వారి మనస్తత్వమా - ప్రసాద్ పథకమా?

చనిపోయేముందు గోపీచంద్ ప్రసాద్‌తో - తన భార్యను కులటగా ప్రచారం చేయమని కోరాడు. ఆ సమయంలో తన లోపం గురించి అతడాలోచించినట్లే లేదు. అలాంటి వాడిచేతిలో ఈ రోజు కాకపోతే మరో రోజైనా తాను చావాల్సిందే!

అరునెలల తర్వాత వారిద్దరికీ మళ్ళీ వివాహం జరిగింది.

గుండె జబ్బుతో బాధపడుతున్న ప్రసాద్ తండ్రి వధూవరులనెంతో ఆప్యాయంగా - కలకాలం సుఖంగా జీవించమని దీవించడానికి - ఆ పెళ్ళికి వచ్చాడు. □

## రోగి?



# నేను హంతకుడినా?

ఎస్.డి.వి. అజీజ్

తలుపు చప్పుడయ్యింది,

అ.ప.న కోసమని తెల్లని కాగితంపై నల్లటి అక్షరాల్ని పేరుస్తూ వాటికి అర్థాలు కల్పిస్తూ రేసుగుర్రంలా పరుగులు తీస్తున్న నా కలం ఆ చప్పుడికి ఆగిపోయింది.

ఫలితం!

నా మస్తిష్కంలో గూడు కట్టుకొంటున్న ఆలోచనలు

అ_స్తవ్య_స్తమయ్యాయి, నాలోని కథకుడు తప్పించుకు పారి పోయాడు. తలుపు తట్టిన వ్య_క్తిపై చిరాకు, చిరుకోపం! ఆ చిరుకోపంతోనే ఆలోచనలో పడ్డాను.

"ఈ వేళప్పుడు ఎవరయి వుంటారు?"

శాలినా?

ఊహూఁ అయివుండదు. శాలిని వుంటున్నది హాస్టల్లో కదా? ఈ వేళప్పుడు రావడానికి ఎలా వీలుంటుంది?

ఇంకెవరయి వుంటారు?

ఎంతగా ఆలోచించినా ఆ వ్య_క్తి ఎవరో తెలిసిరాలేదు.

మరోమారు తలుపు చప్పుడయ్యింది.

నా ఆలోచనలు ఆగిపోయాయి.

ఓ మారు గోడగడియారం వంక చూశాను.

అర్ధరాత్రి దాటింది.

పట్టు సడలిన లుంగీని సర్దుకుంటూ వెళ్ళి తలుపు తీశాను.

అంతే!—

నా గుండె గుభిల్లుమన్నది.

గుమ్మం ఆవల వున్నది మామూలు వ్య_క్తులు కాదు! పోలీసులు!!

వారు నా వంక అదోలా సూటిగా చూ_స్తున్నారు. లోలోపల ఏదో తెలియని సన్నని అలజడి. పైకి మాత్రం గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ అడిగాను "ఏమిటి ఇన్స్పెక్టర్, ఇలా వచ్చారు?" వ్య_క్తిగతంగా అత నెవరో తెలియక పోయినా కావాలని అలా అడిగాను.

అతని సమాధానం....!

"మీరేనా రచయిత రాజారావు గారంటే?" నొసలు చిట్లించి అడిగాడు.

నాలో సన్నని భయాందోళన మొదలయ్యింది, అతని వాడి చూపులకు

"అవును నేనే!" నెమ్మదిగా తలాడించాను.

"యూ ఆర్ అండర్ అరెస్ట్!" తెల్లగా మిల మిల మెరుస్తున్న బేడీలను బయటికి తీశాడు.

"దేనికి?" నిర్ఘాంతపోయి అడిగాను.

"మీరో అమ్మాయిని దారుణంగా హత్యచేసినందుకు."

ఒక్కమారుగా అదిరిపడ్డాను.

"నేనా! హత్య చేశానా?" హుతాశుడినై అడిగాను.

"అవును మీరే!" అతడి కంఠంలో కరుకుదనం.

"నే నెందుకు హత్య చేస్తాను ఇన్స్పెక్టర్?" విస్తుపోయి అడిగాను.

"చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకొనేందుకు?" అతడి మాటల్లో వ్యంగ్యం.

"నేనేం నేరం చేశాను?" అదురుతున్న గుండెతో అడిగాను.

"ముందు స్టేషన్‌కు పదండి! మీరేం నేరం చేశారో అక్కడ తెలుస్తుంది!"

"వారంట్ వుందా?" చివరి ప్రయత్నంగా అడిగాను.

"అక్కరలేదు. మీరే నేరస్థులనడానికి చాలా ఆధారాలు దొరికాయి."

నా గుండె లయ తప్పింది అతను చెప్పింది విని.

ఆపాదమస్తకం వొణుకు పుట్టింది.

కళ్ళు బైర్లు కమ్మాయి.

## 2

తెల్లవారింది.

బయట గందరగోళంగా వుంది.

లాకప్‌లో వేస్తున్న దుర్గంధంవల్ల తెల్లవార్లు కంటికి కునుకులేని నేను మండుతున్న కళ్ళను నులుముకుని లాకప్ కిటికీ చువ్వలగుండా బయటికి చూశాను. బయట చాలామంది జనం పోగయి వున్నారు. అందులో కొంత మంది అమ్మాయిలు నా వంక ఈసడింపుగా చూడ్డం గమ నించిన నేను వారిపయినుండి దృష్టి మరల్చాను.

బయట నినాదాలు ఎక్కువయ్యాయి. అమ్మాయిలు హోరెత్తిపోతున్నారు.

"నయవంచకుడు రాజారావు నశించాలి!"

"రచయిత రాజారావు ముర్దాబాద్."

"శాలినిని దారుణంగా హత్య చేసిన రాజారావుకు వురి శిక్ష విధించాలి!

"రచయిత రాజారావు!"

"డౌన్!....డౌన్!!"

నేను శాలినిని హత్య చెయ్యడ మేమిటి? నో.... నెవ్వర్.... ఇదంతా ఎవరో పన్నిన పన్నాగంలా తోచింది నాకు. నామీద అంత ద్వేషం ఎవరి కుంది? అసలు శాలినిని నే చంపాల్సిన అవసరమేముంది? రాత్రి ఇన్‌స్పెక్టర్ తన్ను తెచ్చి లాకప్‌లో పడేశాడేగాని ఇంతవరకు అసలు విషయం చెప్పలేదు. వీరి నినాదాలుబట్టి ఇప్పుడు తెలుస్తుంది తనకు. అంతా అయోమయంలా తోచింది నాకు.

లాకప్ తలుపులు తెరుచుకొన్నాయి.

ఇన్‌స్పెక్టర్ ప్రత్యక్షమయ్యాడు.

ఇన్‌స్పెక్టర్ వంక సూటిగా విసుగ్గా చూస్తూ అడిగాను.

"వాటీజ్ దిస్?"

"ఏమీ తెలియనివాడిలా నటిస్తే వొదిలిపెడతానను కొన్నారా రచయితగారూ?" ఇన్‌స్పెక్టర్ కంఠం

వ్యంగ్యంగా పలికంది.

"నిజంగా ఇన్స్పెక్టర్‌గారూ! నాకేం తెలియదు. నేను హత్య చెయ్యలేదు. నేను శాలినిని హత్య చెయ్యడమేమిటి? ఆ అమ్మాయికి నాకూ మధ్య ఎలాంటి కక్షలు లేవు. ఆ అమ్మాయి నాకు ఆత్మీయురాలు లాంటిది. అలాంటి అమ్మాయిని నేనెందుకు హత్య చేస్తాను ఇన్స్పెక్టర్?" నిజం చెప్పడానికి ప్రయత్నించాను.

ఇన్స్పెక్టర్ వినిపించుకోలేదు.

"కక్షలు లేవుగాని నీకు ఆ అమ్మాయికి మధ్య శారీరక సంబంధం వుంది కదూ?" సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

"నో!" అరిచినంత పని చేశాను.

"ఏం లేదా?" మళ్ళీ అతని మాటల్లో వెటకారం!

"ఆ అమ్మాయికి నాకు ఎలాంటి అక్రమ సంబంధం లేదు. ఆ అమ్మాయి నాకు చెల్లెల్లాంటిది."

అంతే!

"యూ షటప్ రాస్కెల్" అంటూ ఇన్స్పెక్టర్ బలంగా నా రెండు చెంపలు వాయించాడు. నా ముఖం వివర్ణమయ్యింది.

రౌద్రం పొడసూపింది.

"ఇన్స్పెక్టర్ మైండ్ యువర్ బిజినెస్" గట్టిగా అరిచాను ఆవేశంతో వూగిపోతూ.

అకారణంగానే లాఠీ నా వొంటిపై కరాళనృత్యం చేసింది.

ఓ పావుగంటలోపే నా వొళ్ళు లాఠీ దెబ్బలకు హూనమయిపోయింది.

కుప్పగా నేలకూలాను.

బెయిల్‌కోసం నే చేసిన ప్రయత్నం నీరుగారిపోయింది.

కమేళా (పశువుల మాంసాన్ని విక్రయించే చోటు)లో పశువుల్ని నరకడానికి బర బర ఈడ్చుకుపోయినట్లు, నన్నూ ఈడ్చుకుపోయి లాకప్‌లో వేశారు.

# 3

ఇరవై ఎనిమిది గంటల తర్వాత కోర్టులో—

పబ్లిక్ ప్రాసిక్యూటర్ నన్ను ఇంటరాగేట్ చెయ్యడం ప్రారంభించాడు.

"మీ పేరు?"

"రాజారావు"

"ఏం చేస్తుంటారు?"

"రచనలు చేస్తుంటాను."

"ఎలాంటి రచనలు?"

"అన్ని రకాల రచనలూ."

"అంటే?"

"పాఠకులకు ఎలాంటి రచనలంటే ఇష్టమో అలాంటి రచనలు చేస్తాను"

"పాఠకులకు బూతు సాహిత్యం అవసరం అనుకోండి అలాంటి సాహిత్యంకూడా వ్రాస్తారా?"

"వ్రాయను"

"ఏం?"

"ఆ సాహిత్యమంటే నాకిష్టంలేదు"

"కారణం?"

"అందులో అశ్లీలం వుంటుంది. కాబట్టి."

"ఇప్పుడు మీరు చేసే రచనల్లో అశ్లీలం వుండడం లేదా?"

"లేదు"

"రచనలు చెయ్యడం మీకు హాబియా?"

"కాదు వృత్తి"

"ప్రవృత్తి కూడానా?"

"అవును"

"రచయితగా మీరు మీ రచనల ద్వారా ఈ సమాజంలో ఎలాంటి స్థానాన్ని సంపాదించుకున్నారు?"

"అది పాఠకులే చెప్పాలి"

"మీకు అభిమానులు వున్నారా?"

"వున్నారు"

"మీ అభిమామానుల్లో ఆడవాళ్ళుకూడ వున్నారు కదూ?"

"అవును"

"శాలిని మీకు ఎన్నాళ్ళనుంచి పరిచయం?"

"దాదాపు ఆర్నెల్లనుంచి"

"ఎలా పరిచయం?"

"ఓ సాహితీసభ దగ్గర పరిచయం అయ్యింది."

"శాలినికి మీకు శారీరక సంబంధం వుంది కదూ?"

"లేదు"

"నిజంగా లేదా!"

"లేదు"

"అయితే ఈ ఉత్తరం చదవండి:"

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఓ ఉత్తరాన్ని నా చేతికి అందించాడు. ఆ ఉత్తరాన్ని ఆత్రంగా అందుకొని విప్పాను. ఆ ఉత్తరంలో....

"భారతీ!

రాజారావు. అతని రచనలకు మల్లే ఆదర్శవంతుడని భ్రమించి అతన్ని అభిమానించి మనసిచ్చాను. ప్రేమిం

చాను. అతనుకూడ నన్ను గాఢంగా ప్రేమిస్తున్నట్టు నటించి. ఎన్నెన్నో తియ్యటి కబుర్లు చెప్పి ప్రేమ పేరుతో నన్ను వంచించి చివరికి నా శీలం దోచుకొన్నాడు. గర్భవతి నయ్యాను.

ఈ విషయం అతనికి తెలియపరచి 'పదిమందికి తెలియకమునుపే పెళ్ళి చేసుకుందాం!' అని ప్రాధేయపడ్డాను. ఆ కసాయివాడి మనసు కరుగలేదు సరికదా ఓ అయిదొందలు నా ముఖాన విసిరికొట్టి 'వెళ్ళి అబార్షన్ చేయించుకో!' అంటూ సలహా ఇచ్చాడు. ఆ సలహా విన్న నాకు వాడ్ని అక్కడి కక్కడే పొడిచేద్దామనిపించింది. వాడి చొక్కా పట్టుకుని నిలదీసి అడిగాను.

"అయితే నన్ను పెళ్ళి చేసుకోనంటావు?"

"చేసుకోను" నిర్లక్ష్యంగా సమాధాన మిచ్చాడు.

"అయితే నన్నెందుకు ప్రేమించినట్టు నటించావు?"

"ఏ తుమ్మెదా ఆఘ్రాణించని నీ తొలి పరువాన్ని నే తొలిసారిగా ఆఘ్రాణిద్దామని."

వాడి సమాధానం విన్న నేను, ఆవేశం ఆపుకోలేక లేక వాడి రెండు చెంపలు కందిపోయేలా వాయించాను. వాడూ నన్ను ఎడాపెడా వాయిస్తూ "నీ కడుపు పండడానికి నేనే కారణమని ఎక్కడన్నా చెప్పావో, నీ నూరేళ్ళ జీవితం ఆరోజుతో సమాప్తమయిపోతుంది. జాగ్రత్త!" అంటూ భయపెట్టి పంపించాడు.

"ఛీ! ఇలాంటి నయవంచకుడినా నేను ప్రేమించింది?" అని కుమిలిపోయాను.

భారతీ!

రచయితల్లో కూడ ఇలాంటి గోముఖవ్యాఘ్రాలుంటాయని ఆలస్యంగా తెల్సుకున్నాను. కాని అప్పటికే అంతా

అయిపోయింది. ఓ నయవంచకుడి చేతిలో మైలపడ్డ ఈ జీవితాన్ని ఇలాగే కొనసాగించాలా? లేక పరిసమాప్తి చేసుకోవాలా? అన్న సందిగ్ధావస్థలో వున్నాను. నా ఈ సందిగ్ధావస్థను తీర్చుకోవడానికి నీకు ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. ఈ ఉత్తరం చదివిన వెంటనే నీ అభిప్రాయం వ్రాయి. లేదా నీవే వచ్చెయ్! వుంటాను

ఇట్లు
సీ
శాలిని"

ఉత్తరం చదివిన నాకు నా పాదాల క్రింద భూమి ఒక్కమారుగా చీలిపోయి నేనందులో కూరుకుపోతున్నట్లనిపించింది.

ఏమిటిదందా?

ఎందుకిలా జరిగింది?

నా మస్తిష్కం స్తంభించిపోయింది.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడిగే ఏ ప్రశ్నకుకూడ జవాబు ఇవ్వలేక అచేతనంగా వుండిపోయాను.

## 4

"రాజారావుగారూ!"

దీర్ఘాలోచనలో మునిగివున్న నేను, నా ఆలోచనల్ని విరమించుకొని మోకాళ్ళ మధ్య వుంచుకొన్న తలను పైకెత్తి చూశాను. కటకటాలకు అవలివైపు ఓ అపరిచిత యువతి నిలబడి వుంది. ఆమె వేషాధరణ బట్టి లాయరని ఇట్టే తెలిసిపోతూ వుంది. లేచి కటకటాల దగ్గరికి వెళ్ళాను.

ఆమె సన్నటి చిర్నవ్వు చిందిస్తూ అంది.

"నాపేరు జయశ్రీ. మీ అభిమానిని. సెషన్స్ కోర్టు

ద్వారా మీకు బెయిల్ లభించే ఏర్పాట్లు చేశాను. సాయంకాలంలోపు మీరు బయటికి రావచ్చు."

నిర్వికారమైన నా ఎదలో చిరు ఆశ మొదలయ్యింది. ఆమె వంక కృతజ్ఞతాపూర్వకంగా చూశాను.

"మీరేమనుకోనంటే నాదో చిన్నమాట!" సంశయిస్తూ అడిగింది లాయర్ జయశ్రీ.

"చెప్పండి!" అన్నాను, ఆమె సంశయాన్ని పోగొడుతూ.

"దయచేసి జరిగిందేమిటో విపులంగా చెప్పగలరా?" అభ్యర్థన పూర్వకంగా అడిగింది నే చెప్పే విషయాన్ని నోట్ చేసుకోవడానికి పెన్ను పేపర్‌తో సిద్ధమయి.

"అలాగే!" అంటూ చెప్పడం ప్రారంభించాను —

"ఇప్పటికి ఆర్నెల్ల క్రితం ఇక్కడి 'నవసాహితి సమాఖ్య' వారు ఓ సాహితీ సమావేశానికి నన్ను పిలిచి సన్మానించారు. ఆ సందర్భంగా పరిచయం అయ్యింది శాలిని.

శాలిని తనకు తానుగా నా దగ్గరికి వచ్చి "నేను మీ అభిమానిని" అంటూ పరిచయం చేసుకుంది! కాస్త సంభాషణ పెరిగాక తన పేరు 'శాలిని' అని తన సొంత వూరు నంద్యాల అని, ఇక్కడి గవర్నమెంట్ డిగ్రీ కాలేజిలో బి.ఎ. ఫైనలియర్ చదువుతున్నానని, కాలేజి హాస్టల్‌లనే వుంటున్నానని, తనకు సాహిత్యమంటే ప్రాణమని చెప్పింది.

శాలిని మంచి కలుపుగోలు మనిషి. పరిచయమయిన పది నిముషాల్లోపే నాకు స్నేహితురాలయి పోయింది.

కొందరు వసపిట్టలా వాగితే విసుగొస్తుంది. కాని శాలిని వసపిట్టలా వాగినా విసుగనిపించక చూడ ముచ్చటేసేది. చాలవరకు ఏకాంతాన్ని కోరుకొంటూ ఒంటరి జీవితానికి అలవాటు పడ్డ నేను శాలిని పరిచయం అయ్యాక ఒంటరి తనానికి కాస్త దూరం అయ్యాను.

శాలిని తనకు వీలున్నప్పుడల్లా నా గదికి వచ్చి ఎన్నో విషయాల్ని చెప్పేది. చెప్పించుకొనేది. కబుర్లు చెబుతూనే సాహితీ విషయాలగురించి అడిగి తెలుసుకొనేది. అయితే తన వ్యక్తిగత విషయాలు మాత్రం చెప్పేది కాదు. నేను కూడా అడిగేవాడ్ని కాదు. నేనే అప్పుడప్పుడు నాగురించి చెప్పుకొంటూ వుండేవాడ్ని!

"నేను 'నా' అన్నవారు లేని అనాధనని అప్పుడప్పుడు గుర్తు తెచ్చుకుని కుమిలిపోతున్నప్పుడు, శాలిని నన్ను ఆత్మీయురాలిలా ఓదార్చేది. అలా మామధ్య ఏదో తెలియని అనుబంధం ఏర్పడింది. ఆ బంధం అన్నాచెల్లెలి మధ్య వుండే బంధం. నేనెప్పుడూ శాలినిని నా తోబుట్టువు దృష్టి తోనే చూసేవాడ్ని!

ఈ మధ్య ఓ వారం రోజుల నుంచి శాలిని ఎందుకో ముభావంగా వుంటూ వచ్చింది. కారణ మడిగితే జవాబివ్వ లేదు. నిన్నటిరోజు సాయంకాలం నా గదికొచ్చి "బీచ్‌కి వెళదాం పదండి" అంటూ తీసుకెళ్ళింది. అక్కడ ఏదో చెప్పడానికి ప్రయత్నించినా, చెప్పలేకపోయింది. నే నెంతగా తరచి తరచి అడిగినా సమాధానం రాలేదు. మూగగా కన్నీరు కారుస్తూ కొద్దిసేపటి తర్వాత "నాకు చచ్చిపోవాలని వుంది" అంది.

శాలిని నోట ఆ మాట విన్న నేను నిర్ఘాంతపోయి స్థాణువు నయ్యాను. కాసేపటికి తేరుకొని గుచ్చి గుచ్చి

అడిగాను "ఏమయ్యింది శాలినీ....?" అంటూ. అయినా జవాబు రాలేదు. ఓ అరగంటసేపు మౌనంగా కూర్చుని "నే వెళుతున్నాను" అంటూ వెళ్ళిపోయింది.

శాలిని వింత ప్రవర్తనకు విస్తుపోయిన నేను "ఏం జరిగి వుంటుంది?" అని ఆలోచిస్తూ అక్కడే చాలాసేపు కూర్చుండిపోయాను. రాత్రి బాగా పొద్దుపోయిం తర్వాత ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చేశాను. ఇంతే జరిగింది జయశ్రీగారూ!" అంటూ గద్గద స్వరంతో గతం గురించి చెప్పాను.

# 5

లాయర్ జయశ్రీగారి ప్రమేయంవల్ల బెయిల్ ఆధారంగా బయటపడ్డ నన్ను కొంతమంది పత్రికా విలేఖరులు అభిమానులు తదితరులు చుట్టుముట్టి ఏవేవో ప్రశ్న లడిగారు. వాటన్నింటికి నా సమాధానం.

మౌనం:

రెండ్రోజుల్లో తిరిగి కోర్టుకు హాజరయ్యేలోపు నా నిర్దోషిత్వాన్ని రుజువుపరుచుకోవాలి.

ఎలా?

చాలాసేపు ఆలోచించిన తర్వాత ఓ ఆలోచన తట్టింది. ఆ ఆలోచనా ప్రకారంగా వెంటనే జయశ్రీగారిని తోడు తీసుకొని శాలిని హాస్టల్ కెళ్ళాను. హాస్టల్ వార్డన్ పర్మిషన్‌తో శాలిని క్లోజ్ ఫ్రెండ్ భార్గవిని బయటకు తీసుకొని వచ్చి ప్రశ్నించాను.

"భార్గవీ! నేను శాలినిని హత్య చేశానంటే నువ్వు కూడ నమ్ముతున్నావా?" భార్గవి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ప్రశ్నించాను. సమాధానంగా భార్గవి నా వంక కోపంగా చూస్తూ "శాలినిని మీరే హత్య చేశారు.

ముమ్మాటికీ మీరే హత్య చేశారు. మాయచేసి దాని శీలాన్ని దోచుకోవడమేగాక నిర్దాక్షిణ్యంగా కసాయివాడిలా హత్య చేశారు" ఆవేశంతో వూగిపోతూ అంది.

భార్గవి నుంచి ఇలాంటి సమాధానం వస్తుందని వూహించని నేను విస్తుపోయి ఆ అమ్మాయి వంక చూస్తూ అన్నాను. "నేను శాలిని ఎలా మసిలేవాళ్ళమో నీకు బాగా తెలుసు. అలాంటి నువ్వే నన్ను అనుమానిస్తున్నావా?"

"తెలుసు కాబట్టే అనుమానిస్తున్నాను" ద్వంద్వార్థంతో పలికింది భార్గవి. అన్నీ తెలిసిన భార్గవి కూడా అలా పలకడం నే సహించలేకపోయాను. ఆవేశానికి లోనయి చప్పున చేయెత్తాను. సమయానికి జయశ్రీ నా చెయ్యిని గట్టిగా ఒడిసిపట్టుకోబట్టి సరిపోయిందిగాని లేకపోతే భార్గవి చెంప చెళ్ళుమనేది.

నన్ను నేను నిగ్రహించుకోవడానికి ఓ అయిదు నిముషాలు పట్టింది.

జయశ్రీ నన్ను శాంతపరచి భార్గవి ఉద్వేగాన్ని తగ్గించి ప్రశ్నించడం మొదలు పెట్టింది.

"శాలినికి ఎవరయినా 'భారతి' అన్న స్నేహితురాలు వుందా!"

"వుంది."

"ఎక్కడ?"

"హైద్రాబాద్‌లో."

"ఆమె అడ్రసుందా?"

"తెలియదు."

"శాలిని భారతి గురించి నీతో ఏమని చెబుతుండేది?"

"స్కూల్‌ఫైనల్ వరకు ఇద్దరం కలిసి చదువు

కొన్నాం. ఇద్దరం మంచి స్నేహితులం అని చెబుతుండేది. ఆమె అడ్రస్ మాత్రం చెప్పలేదు."

"శాలినికి డైరీ వ్రాసే అలవాటుందా?"

"లేదు."

"తనకు రాజారావుకు శారీరక సంబంధం వున్నట్టు శాలిని నీతో చెప్పిందా?"

"చెప్పింది."

"ఏమని?"

"తన గర్భానికి కారణం రాజారావని. పెళ్ళి చేసుకో మంటే చంపుతానంటూ బెదిరిస్తున్నాడని చెప్పింది."

"మరి నిన్న సాయంకాలం బెదిరించిన మనిషి దగ్గరికి ఎందుకెళ్ళింది?"

"ఏమో?"

"వెళ్ళే ముందు నీతో ఏమైనా చెప్పిందా?"

"చెప్పింది."

"ఏమని?"

"రాజారావు మనసు మార్చుకుని పెళ్ళికి అంగీకరిస్తూ కబురు పంపినట్టు చెప్పింది."

"శాలినిని కలుసుకోవడానికి రాజారావు కాక ఇంకెవ రయినా వచ్చేవారా?"

"ఆమె తల్లిదండ్రులు తప్ప, ఇంకెవ్వరూ వచ్చేవారు కాదు!"

"చూడమ్మాయి! కొన్నిసార్లు అబద్ధాన్ని నిజంగా, నిజాన్ని అబద్ధంగా భావించి భ్రమపడటం జరుగుతూ వుంటుంది. అలాంటిదే రాజారావుగారి విషయంలో జరి గింది. ఎవరో శాలినిని వంచించి ఆమె శీలాన్ని దోచు కోవడమేకాక, దారుణంగా చంపి, ఆ నేరం తెలివిగా

వీరిమీద మోపారు. ఆ విషయం అతి త్వరలో వెల్లడవు తుంది. హంతకుడు ఎవరో తెలుసుకోవడానికి ఓ ముఖ్య మైన ఆధారం దొరికింది. ఆ ఆధారంతో అతన్ని సుల భంగా పట్టుకోవచ్చు: రేపీపాటికి అతను తప్పకుండా పట్టు బడితీరుతాడు చట్టానికి.''

భార్గవి చూపులు నిశ్చలమయ్యాయి. ఆమె అంతగా ఎందుకు అబద్ధమాడుతుందో నాకు తెలియలేదు.

## 6

ఇద్దరం కాలేజి ముందున్న హోటల్లో కూర్చుని నిఘా వేశాం.

కాలేజి బెల్ మ్రోగింది.

లోపలకి వెళుతున్న అమ్మాయిల నడక ఉధృతమైంది. ఆత్రంగా పరుగెత్తుకొంటూ వెళుతున్నారు.

కాసేపటి తర్వాత లాయర్ జయశ్రీ చెప్పిన ప్రకారంగానే భార్గవి కాలేజి ఆవరణలో నుంచి బయటికి వచ్చింది. అటు ఇటు దిక్కులు చూస్తూ రోడ్డు ప్రక్కన నిల్చున్న ఆటోను కేకేసింది.

ఆటో భార్గవి ముందు నిలిచింది.

భార్గవి ఆటోవాడికి ఏదో చెప్పి కూర్చుంది. ఆటో ముందుకు వురికింది.

లాయర్ జయశ్రీ నావంక చూసి కనుసయిగ చేసింది. ఆమె కనుసయిగను అర్థం చేసుకున్న నేను మరో ఆటో పిలిచాను.

ఇద్దరం ఎక్కి కూర్చున్నాం "ముందు వెళుతున్న ఆటోను ఫాలో చెయ్యి'' అంటూ.

మేం కూర్చున్న ఆటో స్పీడ్ పెరిగింది.

భార్గవి ఎక్కిన ఆటో ఓ రెండు కిలోమీటర్లు ప్రయా

ణించి అయిదారు మలుపులు తిరిగి అశోక్‌నగర్‌లోని ఖరీదయిన ఓ భవనం ముందు ఆగింది.

భార్గవి ఆటోదిగి ఛార్జి చెల్లించి విసురుగా ఐరన్‌గేటు తోసుకుని వడి వడిగా అడుగులు వేస్తూ లోపలికి వెళ్ళింది.

మేమూ ఆటో ఛార్జీ పే చేసి ఓ అయిదు నిముషాలు అటు యిటు తచ్చాడి లోపలికి వెళ్ళాం! కాలింగ్‌బెల్ నొక్కబోయి ఆగిపోయాం. లోపల్నుంచి మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. తలుపుకు కాస్తదూరంలో వున్న విండోలోనుంచి లోపలకి తొంగిచూశాము. భార్గవి అందంగా, హుందాగా పాతికేళ్ళ వయస్సున్న ఓ యువకునితో చెబుతూ వుంది.

"మధూ! లాయర్ జయశ్రీగారు రాజారావును నిర్దోషిగా నిరూపించడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగా ఆమెకు హంతకుడ్ని పట్టుకునేందుకు ముఖ్యమైన ఆధారం దొరికిందట! అదే నిన్ను పట్టుకోవడానికి "

"అంతా పకడ్బందీగా చేశానే! అంత ముఖ్యమైన ఆధారం ఏం దొరికి వుంటుంది?" ఆలోచనలో పడుతూ అన్నాడు యువకుడు.

"ఏమో! ఎందుకయినా మంచిది నువ్వు వెంటనే ఈ వూరు విడిచి ఎక్కడికయినా పారిపో! లేకుంటే ఆమె ప్రయత్నంవల్ల నీవు పట్టుబడటం ఖాయం."

"నువ్వు చెప్పింది సెంట్‌పర్సెంట్ కరెక్టు డార్లింగ్! ఈ రాత్రికే వుడాయిస్తాను" భార్గవిని అక్కున చేర్చుకొంటూ అన్నాడు ఆ యువకుడు.

నాలో ఆవేశం కమ్ముకొచ్చింది. అయినా బలవంతంగా ఆపుకొన్నాను. భార్గవి అతని పెదాలను సుతారంగా

ముద్దాడుతూ పలికింది

"మరి అదెప్పుడు యిస్తావు డార్లింగ్! అది లేకుంటే నా ప్రాణం నిలవడం లేదు."

"ఇస్తాను డార్లింగ్! ఇప్పుడే ఇస్తాను" అంటూ అతను లోపలి గదిలో కెళ్ళి సిరంజితో బయటికి వచ్చాడు. దాన్నిండా తెల్లటి ద్రవం! మాకు సులభంగానే గ్రాహ్యమై పోయింది. అది మనిషిని నైతికపతనానికి దిగజార్చి అతనిచేత ఎలాంటి ఘాతుకమైనా చేయించే మత్తుమందు మర్ఫియా అని.

భార్గవి తన్మయత్వంగా కళ్లు మూసుకుని వుంది. బ్లౌజ్ తొలగించి తన కుడిజబ్బను నగ్నం చేసింది. అతను సిరంజి ద్వారా మర్ఫియా ఆమెలో కి ఎక్కించాడు.

ఒక నిముషం గడిచింది.

మర్ఫియా పనిచెయ్యడం ప్రారంభించింది.

భార్గవి తూలిపోతూ "మధూ! ఇది అదోలా వుందేం! మునుపటి ఆనందాన్ని, స్వర్గాన్ని చూపడం లేదేం?"

సమాధానం....

అతని వికటాట్టహాసం!

"పిచ్చిదానా! నువ్వు బ్రతికి వున్నంతవరకు నాకు ఏనాడయినా ప్రమాదమే! అందుకే మర్ఫియాలో పాయిజన్ కలిపి ఇచ్చాను. ఇంకొద్దిసేపట్లో నీ చరిత్ర సమాప్తం కాబోతుంది."

"ఛీ! దుర్మార్గుడా! నన్నే ఇంత మోసం చేస్తావా? నీవు అలవాటు చేసిన ఈ మత్తుమందుకు బానిసనయి శాలినితోసహా ఎంతోమంది అమ్మాయిల్ని నీ కామానికి బలి చేశాను. నీ రహస్యాలన్నీ ఎన్నో నాలో దాచు కున్నాను. అందుకు ప్రతిఫలం ఇదా? ఐ విల్ కిల్ యూ"

అంటూ బాధతో మెలికలు తిరిగిపోతున్న సివంగిలా అతని మీదికి లంఘించబోయింది. కాని అప్పటికే ఆలశ్య మయి పోయింది. మర్ఫియాతో కూడిన విషం తల కెక్కింది కాబోలు దబ్బున నేల కొరిగింది.

అంతవరకు మేము లోపలకి వెళ్ళడానికి చేసిన ప్రయ త్నాలన్నీ వృధా అయ్యాయి లోపల తలుపులకు గడియవేసి వుండటంవల్ల. కిటికీ అద్దాలు పగులగొట్టి లోపలకి ప్రవేశించాం. మా హఠాత్ ప్రవేశానికి అతను నిర్ఘాంతపోయాడు. కాని అంతలోనే తేరుకొని తప్పిం చుకుపోయేలోపు నేనతన్ని వొడిసి పట్టుకుని ఇష్టమొచ్చి నట్లు చావబాది అడిగాను.

"శాలిని నెందుకు హత్య చేశావు?"

"శాలిని మా మధ్య వున్న సంబంధాన్ని బహిర్గతం చేస్తే ఓ కోటీశ్వరుని కూతురితో కుదిరిన నా పెళ్ళి ఆగి పోతుంది. అందుకే ఆమె మీ దగ్గర నుండి వస్తున్నపుడు చాటు నుండి వెళ్ళి ఆమెకు క్లోరోఫాం ఇచ్చి స్పృహ తప్పించి, పక్కనే వున్న పొదల్లోకి లాక్కెళ్ళి గొంతు నులిమి చంపి. నా వేలిముద్రలు పడకుండా జాగ్రత్తపడి ఆ నేరం మీపైకి పోయేలా మీ సిగిర్ లైట్‌ను శాలిని చేతి వ్రాతను ఫోర్జరీ చేయించి భార్గవితో వ్రాయించిన ఉత్తరాన్ని బ్యాగ్‌లో వుంచి తప్పుకుని వెళ్ళి పోలీసులకు ఫోన్ చేశాను" ఎదురుగా వస్తున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ వంక భయకంపితుడై చూస్తూ అన్నాడు మధు.

అతను చెప్పిందంతా లాయర్ జయశ్రీ హ్యాండ్ బ్యాగ్‌లో వున్న మినీటేప్‌రికార్డర్‌లో రికార్డు అయ్యింది. స్పృహ తప్పి వున్న భార్గవిని పోలీసుల సహాయంతో పక్కనే వున్న ప్రయివేట్ క్లినిక్ నడుపుకుంటున్న

డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళింది.

నేను ఉదయం లాయర్ జయశ్రీ పలికిన మాటలను మరోమారు గుర్తు తెచ్చుకున్నాను.

“శాలిని బ్యాగ్‌లో దొరికిన ఉత్తరం ఫోర్జరీది. భార్గవి సమాధానమిచ్చే తీరు చూసి ఎందుకో ఆమెమీద అనుమానం కలిగింది. వెంటనే ఆమె చేతివ్రాత - శాలిని చేతివ్రాత పోల్చి చూశాను. విషయం అర్థమయ్యింది. శాలిని చేతివ్రాతలో ‘క’ మూడవ అంకె వ్రాసి దానిపై తలకట్టు ఇచ్చినట్టు వుంటుంది. కాని వుత్తరంలో అలా లేదు. మామూలుగా చాలమంది సర్వసాధారణంగా వ్రాసే ‘క’లా వుంది. భార్గవి వ్రాసే ‘క’ తీరు, ఉత్తరంలో వున్న ‘క’ తీరు ఒకేలా వున్నాయి. దీన్నిబట్టి చూస్తే హంతకుడు భార్గవితో శాలిని చేతివ్రాతను ఫోర్జరీ చేయించినట్టుగా ధృవపడుతూ వుంది.” □

## నిదానం-?




అతన్ని చూడగానే నరేంద్ర కళ్ళు ఆవేశంతో ఎరుపెక్కాయి. రక్తం కుతకుతా ఉడికిపోనారంభించింది. ముక్కుపుటాలు ఆవిర్లను విరజిమ్మసాగాయి.

"వాడే! వాడే!! సందేహం లేదు!!" హృదయం కోటి గొంతుకలతో ఘోషించసాగింది.

ఛటుక్కున అవతలకి తిరిగాడు, ప్లేటులో చెయ్యి కడుక్కుంటూ.

"మాఫ్‌కీజీయే...." అన్నాడతను—నరేంద్ర దగ్గరగా వచ్చి.

అప్రయత్నంగా—పెరిగిన గెడ్డాన్ని తడుముకున్నాడు నరేంద్ర. దాదాపు సంవత్సరం నుండీ కావాలని పెంచు కున్న అతని గెడ్డం తలపై చేసుకున్న మరికొన్ని మార్పుల్ని కలుపుకుని అతన్ని సిక్కు యువకునిగా చాటు తోంది. కళ్ళకి ఫోటో—గ్రే గాగుల్సు అతని మొహానికి కొత్త మార్పుని తెచ్చాయి.

"చెప్పండి...." అన్నాడు హిందీలోనే—గొంతు మార్చి.

"నేను అత్యవసరంగా 'జామ్‌నగర్' వెళ్ళాలి. ఇవాళ బస్ డ్రయివర్లు స్ట్రయిక్ కదా! బస్సులేవీ నడవటంలేదు. వాళ్ళకి మద్దతుగా ప్రయివేట్ బస్సుల డ్రయివర్లుకూడ యివాళ ఒక్కరోజు స్ట్రయిక్ ప్రకటించారు. అక్కడికి ఫ్రెండు నడిగి స్కూటర్ యిప్పించుకున్నాను. మధ్యలో చెడిపోయింది. యింత రాత్రివేళ రెండు కిలోమీటర్లు తీసు కొచ్చాను. యెదురు లారీలు ఒక్కటికూడ ఆపటంలేదు. ప్లీజ్...." అతడు చెప్పుకుపోతున్నాడు.

అప్పటికే నరేంద్ర మస్తిష్కం ఓ పథకాన్ని రూపొం దించుకుంది.

కలిసొచ్చిన అదృష్టమంటే యిదే కాబోలు. కసితీర్చు కోడానికి యింతకంటే మంచి తరుణం రాదు!!

"క్యాబిన్‌లో చోటులేదు. మా క్లీనర్ పడుకుంటాడు. మీరు పైన కూచోదల్చుకుంటే నా కభ్యంతరం లేదు" ముక్తసరిగా అన్నాడు.

జామ్‌నగర్‌కి దగ్గర్లో బాగా వర్షం కురిసింది కాబోలు. ఈదురు గాలి బాగా వీస్తూంది. గాలిలో తేమ ఖచ్చితంగా ఎనభై అరుశాతం వుండాలి.

"ఫర్వాలేదు. కేబిన్ పై భాగంలో సర్దుకోగలను" అన్నాడతను లారీలో పేర్చిన వెదురు బొంగులకేసి చూస్తూ.

## 2

డ్రయివ్ చేస్తూ పళ్ళు బిగబట్టి ఆలోచిస్తున్నాడు నరేంద్ర. అతని మస్తిష్కం గతాన్ని త్రవ్వుకోసాగింది.

దాదాపు రెండేళ్ళక్రితం నరేంద్ర దంపతులు ఆ ఇంట్లో కొత్తగా దిగారు. చిలకా గోరింకల్లా కాపురం చేసుకునే వారు.

నరేంద్ర లారీ డ్రయివరు. సోమవారం వుదయమే డ్యూటీకి వెళ్ళేవాడు. శనివారం రాత్రికల్లా తప్పనిసరిగా వచ్చేవాడు. ఎప్పుడో ఓసారి బండి ట్రబులివ్వటం మూలన్నో మరే కారణంచేతనో ఆలస్యంగా వస్తే నిమిషానికి పదిసార్లు క్షమాపణ చెప్పుకునేవాడు, భార్యకి.

జ్యోతికి భర్తంటే అమితమైన ప్రేమ. నరేంద్ర డ్యూటీకి వెడితే చాలు, తిరిగి అతడు వచ్చేవరకూ కళ్ళలో వత్తులు పెట్టుకొని ఎదురు చూసేది.

జ్యోతి తండ్రి రాజకీయ నాయకుడు గాకపోయినా రాజకీయాలంటే అతని కెంతో అభిమానం. మన దేశానికి స్వాతంత్ర్యం రావడానికి దోహదం చేసి చరిత్ర అట్టడుగు పొరల్లో నిలిచిపోయిన ఎందరో వ్యక్తుల్లో ఆయనా ఒకడు.

ఆయన బ్రతికున్న రోజుల్లో ప్రతిరోజూ దినపత్రిక తెప్పించేవాడు. అలా దినపత్రికలు చదవటం జ్యోతికి పదేళ్ళ వయసప్పటికే అలవాటైంది. ఆయన గతించినా

ఆయన గురుతుగా ఆ అలవాటుని అలాగే కొనసాగించింది జ్యోతి.

అదిప్పుడు బాగా పనికొచ్చింది.

నరేంద్ర లేనప్పుడు ఆమెకవే కాలక్షేప సాధనాలు.

జ్యోతి వాళ్ళింటి పై పోర్షన్‌లోని సింగిల్ రూమ్‌లో కపిల్ అనే ఓ యువకుడు అద్దెకుండేవాడు. అతడు మిమిక్రీ ఆర్టిస్టు. ఏదో టెక్నికల్ కోర్సు తాలూకు ట్రెయినీగా అతనక్కడ అద్దెకున్నాడు.

నరేంద్రది ఎవ్వరితోనూ సులభంగా కలిసిపోయే స్వభావం కాదు. డ్యూటీ అవగానే రెక్కలు కట్టుకొని వాలిపోయేవాడు, జ్యోతి సముఖంలో.

కపిల్ అప్పుడప్పుడూ నరేంద్రని పలకరించేవాడు. నరేంద్ర క్లుప్తంగా మాట్లాడి తప్పుకుపోయేవాడు.

ఒకనాడు....

* * *

తలుపు తట్టిన చప్పుడు విని వులిక్కిపడింది జ్యోతి.

టైమ్ చూసింది. పదకొండు.

యింత రాత్రివేళ ఎవరై వుంటారు? భర్తనా? అతడు రావడాని కవకాశం లేదే! నరేంద్ర ఉదయమే వెళ్ళాడు!

ఆమె ఆలోచనల్ని చెదరగొడుతూ 'జ్యోతీ' అన్న పిలుపు విన్పించింది.

'అది భర్తగొంతే! అయితే ఎందుకంత కంగారుగా వుంది? ఆ కంఠస్వరంలో కంపన ఎందుక్కనబడుతోంది? కొంపదీసి....'

"జ్యోతీ! త్వరగా తలుపుతియ్...." ఈసారి మరింత భయం వుందా గొంతుకలో.

జ్యోతిలో మళ్ళీ ఆలోచన్లు....

'కొంపదీసి ఎవరికైనా ఏక్సిడెంటు చెయ్యలేదు కదా!''

ఆ ఆలోచన రాగానే ఆమె ఆగలేకపోయింది. పరుగున వెళ్ళి తలుపుతెర్చింది.

చిరునవ్వుతో నుంచుని వున్నాడు కపిల్.

"మీరా!?" అంది సంభ్రమంగా.

"అవున్నేనే!" అన్నాడతను మంద్రంగా.

"మరి ...."

"మీ ఆయన గొంతా!? నేను మిమిక్రీ ఆర్టిస్టుని...." చొరవగా లోనికొచ్చి తలుపు మూశాడతను. అతని కళ్ళు ఏదో వర్తమానం పంపుతున్నాయామెకు.

ఆమె చీదరించుకుంది. అర్చింది. తిట్టింది. ఏడ్చింది. అర్థించింది. పరిగెత్తింది. మొరపెట్టుకుంది. కొరికింది. రక్కింది. గింజుకుంది.

కాని శివుని ఆజ్ఞ అలానే వుందేమో - ఏదేవుడూ కనికరించలేదు.

## 3

"నో ....!" గట్టిగా అర్చాడు నరేంద్ర.

అతనీ నిజాన్ని వినలేకపోతున్నాడు: జీర్ణించుకోలేకపోతున్నాడు. అంచేత భరించలేకపోతున్నాడు.

జ్యోతి ఏడుస్తూంది. అతనోదార్చలేదు సరికదా, కాసేపయ్యాక ....

"ఈ నిజాన్ని నువ్వు నాకు చెప్పివుండాల్సింది కాదు" అన్నాడతను.

"సమాజ ధర్మానికి విరుద్ధమైన పనిని బుద్ధిపూర్వకంగా చేస్తే అది నేరమవుతుంది. నేరస్థులు తమ నేరాన్ని ఎదుటివారికి చెప్పటానికి జంకుతారు. దాన్ని కప్పిపుచ్చటకోసం బొంకుతారు. నా కా అవసరం లేదు. ఎందుకంటే

నేనిది బుద్ధిపూర్వకంగా చేసిన పనికాదు" అంది జ్యోతి.

"అనుసరింపబడిన కంఠస్వరాన్ని అసలైన కంఠస్వరంగా భావించటం నువ్వు చేసిన నేరం" అన్నాడు నరేంద్ర.

"వారం రోజుల క్రితం మీరు వాడి మిమిక్రీని రేడియోలో విని మెచ్చుకున్నారు. ఆ మాటలు రికార్డుచేసి యస్టీఆర్‌కి విన్పిస్తే ఈ డైలాగులు నేనెప్పుడు చెప్పానబ్బా అని ఆయనకూడా ఆశ్చర్యపోతాడని మీరే స్వయంగా అన్నారు...."

"అయినాసరే నిన్ను క్షమించను" అన్నాడు నరేంద్ర.

"మరి నన్నేం చెయ్యమంటారు?"

"నువ్వేం చెయ్యకు. నేనే చేస్తాను."

"అంటే....?"

"జ్యోతీ! నేను నిన్ను ప్రాణాధికంగా ప్రేమించాను. నేను తప్ప నిన్ను ఎవ్వరు తాకినా సహించలేను. కనీసం చూసినా భరించే సహనం నాలోలేదు. నిన్ను నేను అమితంగా ప్రేమించడమే అందుక్కారణం. అందువల్లే నిన్ను క్షమించలేక పోతున్నాను. అథవా క్షమించినా ఈ గాయం నాలో రాచపుండుగా మారి అనుక్షణం నిన్ను చిత్రవధ చేస్తుంది. ఆ చిత్రహింసలు నువ్వు భరించటం నా కిష్టం లేదు. అందుకని...."

"అందుకని....?!" భయంగా చూసింది జ్యోతి.

"నిన్ను చంపబోతున్నాను" అన్నాడు నరేంద్ర.

ఆ తర్వాత అతడు ఆమెకి మాట్లాడే అవకాశం యివ్వలేదు. అతని చేతులు ఆమె కంఠం చుట్టూ బిగుసుకున్నాయి.

నేరంచేసిన వ్యక్తి శిక్షకి అందనంత దూరం పారిపోతే—

ఆ ర్తితో అక్కున చేర్చుకోబడి ఓదార్చబడాల్సిన వ్యక్తి ఆ దానవుడి చేతుల్లో దారుణశిక్షకి గురికాబడింది.

విగతజీవిగా వికృతంగా పడున్న జ్యోతిని చూసేసరికి భయంవేసింది నరేంద్రకి. రాత్రికి రాత్రే—అదే క్షణం లోనే అతడు యిల్లు విడిచాడు గంట తర్వాత వూరు విడిచాడు.

రకరకాల పేర్లతో వివిధ రూపాలతో అతడు ఆర్నెల్ల పాటు అజ్ఞాతవాసం చేశాడు. ఆ తర్వాత గోరాసింగ్ అనే పేరుతో ఈ వేషంలో మళ్ళీ డ్రయివర్ వృత్తిలో స్థిర పడ్డాడు.

అతని పథకానికి కాంతులు నింపుతూ 'రాధేశ్యామ్ ఘాట్' చేరువకాసాగింది.

## 4

చిన్నగా నవ్వుకున్నాడు కపిల్.

అతనూ ఆలోచిస్తున్నాడు.

పూరుషెలో: ఆంధ్రప్రదేశ్‌లో విడిపోయి మధ్య ప్రదేశ్‌లో తారసపడ్డాడు.

ఆనాడు తను జ్యోతిని మానభంగం చేసి పారి పోయాడు. జ్యోతిని అమితంగా ప్రేమించే నరేంద్ర తనని చూస్తే తనకి చావు తప్పదు. అందుకనే తను అతనికి చాల దూరం పోవాలనుకున్నాడు. మధ్యప్రదేశ్ లోని ఓమ్ నగర్‌లో తన మామయ్య బ్యాంకు మేనేజర్‌గా వున్నాడు. అక్కడికి చేరుకున్నాడు. ఆయన కూతుర్ని పెళ్ళి చేసుకుని ఇల్లరికం వుండిపోయాడు. ఆ తర్వాత అతడు తనచేత ఏదో పరీక్ష రాయించి జామ్ నగర్ పేపర్ మిల్లులో మంచి వుద్యోగం వేయించాడు.

ఒకనాడు పేపర్‌మిల్లు వద్ద వెదురు అన్‌లోడ్ చేయిస్తున్నపుడు కంఠస్వరం విని గుర్తించాడు. తనని గుర్తుపడితే ప్రమాదం తప్పదని గ్రహించాడు. రహస్యంగా నరేంద్రని గురించి వాకబు చేశాడు.

నరేంద్ర ప్రతి పదిహేను రోజులకీ ఓసారి వెదురు లోడ్ తీసుకొస్తాడు!

నెమ్మదిగా పథకం రూపొందసాగింది.

తను పేపర్ మిల్లులో పని చేస్తున్నాడు. అదే మిల్లుకి నరేంద్ర వెదురు తోలుతున్నాడు.

ఏ సమయంలోనయినా తనకు ముప్పు తప్పదు.

మరో చోటికి వెళ్ళిపోదామనుకుంటే ఎలా? తను ఇల్లరికంలో ఇరుక్కుపోయాడు. లడ్డులాంటి భార్య! బంగారంలాంటి ఉద్యోగం!!

ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలి?

ప్రత్యర్థిని తన మార్గంలోంచి తప్పించాలి!

శత్రుశేషం లేకుండా చేసుకోవాలి!!

అందుకే వ్యూహం పన్నాడు. నరేంద్ర ఈ రూట్‌కి వచ్చినప్పుడు ఏ సమయంలో ఎక్కడ ఆగుతాడో ఎక్కడ భోజనం చేస్తాడో తెల్సుకొని వుండటంతో ముందుగానే అక్కడ మాటువేశాడు. స్కూటరు చెడిపోయిందని బొంకాడు. వాడు తేలిగ్గా నమ్మాడు.

మరో అయిదు నిమిషాలలో రాధేశ్యామ్‌ఘాట్ రాబోతోంది. అది చాల యిరుకు మలుపులతో వున్న కనుమ.

'నెంబర్ టూ'కు వెళ్ళాలని చెప్పి తను లారీ ఆపుతాడు. దిగి కొంతదూరం వెళ్ళి వెంటనే తిరిగొచ్చి తను రెడీగా జేబులో వుంచుకున్న కత్తిని వీపులో-గుండెలోకి దూసుకుపోయేలా దింపుతాడు. అద్దొస్తే క్లీనర్ని కూడ

సఫా చేసి శవాలతోబాటు లారీనికూడి లోయలోకి ప్రయాణం కట్టించి చేతులు దులుపుకుని చక్కాపోతాడు.' కపిల్ ఆలోచనలు అంత్యదశకి వచ్చేసరికి రాధేశ్యామ్ ఘాట్ వచ్చేసింది.

## 5

లారీ ఆగిపోయింది.

కపిల్ ఆశ్చర్యపోయాడు. ఆనందించాడు.

గుడ్! తను అక్కడ ముందే లారీని ఆపేశాడన్న మాట. పాపం! కాసేపటిలో తను ప్రాణాలు కోల్పోతాడని నరేంద్రకు తెలీదు.

నెమ్మదిగా కేబిన్ పైభాగం నుండి క్రిందికి దిగాడు.

చలికి వేళ్ళు బిగదీసుకుపోయాయి. ఓ పట్టాన సహకరించలేదు.

"మీరే దిగారా? నేనే దింపుదామనుకుంటున్నాను" అన్నాడు నరేంద్ర హిందీలో.

"మీరే లారీని ఆపుచేశారా? నేనే ఆపమని చెబుదామనుకున్నాను" అన్నాడు కపిల్.

"ఎందుకు! బాగా చలిగా వుందా?"

"కాదు. మీరెందు కాపారు? ట్రబులా!?"

"కాదు. నీ చరిత్ర ముగించటానికి...." తెలుగులో కరకుగా పలికింది నరేంద్ర కంఠం.

పెద్దగా ఆశ్చర్యపోలేదు కపిల్. "వూహించాను. మై డియర్ నరేంద్రా! నేను నిన్ను హోటల్లో పిలవగానే చటుక్కున నువ్వు మొహం చాటుచేసుకోవటం, క్లీనరు పడుకుంటాడని చెప్పి నన్ను పైకెక్కమనటం నాలో అనుమానం కల్గించాయి.

పూర్తిగా రూపం మారిన నిన్ను నేను గుర్తించగలిగి .

నప్పుడు పెద్దగా మార్పులులేని నన్ను నువ్వు గుర్తించి నందుకు పెద్దగా ఆశ్చర్యం కలగలేదు. పోతే క్లీనరు క్యాబిన్‌లో పడుకుంటాడన్న సాకుతో నన్ను పైకి పంపిం చావు. క్లీనరు డ్రయివర్‌కి సబార్డినేట్. డ్రయివర్ డ్రయివింగులో వుండగా ఏ క్లీనరూ నిద్రపోడు. అధవా పోయినా క్యాబిన్‌లో నిద్రపోయే ప్రసక్తే లేదు. దీన్ని బట్టి నువ్వు నన్నేదో చెయ్యడానికే క్యాబిన్ పయికి పంపించావని అర్థం చేసుకున్నాను."

"....అవును!"అన్నాడు నరేంద్ర. ఆ స్వరంలో వేడి వుంది. ఆ వేడిలో వివరించలేనంత కసి తొంగిచూస్తూంది "స్పీడుగా వెడుతూ సడన్‌బ్రేక్ వేద్దామనుకున్నాను. వూహించని బ్రేక్‌కి నువ్వు ఎగిరి లోయలో పడిపోతావు. నీ అడ్రసు బ్రహ్మరుద్రాదులు కూడ తెల్సుకోలేరు. అయితే యిందులో ఓ ప్రమాదం వుంది.

"యిప్పుడు వర్షం వచ్చింది. రోడ్లు జలమయ మయ్యాయి. సడన్‌బ్రేక్ వేస్తే టైర్లు స్లిప్‌అయి నాతో సహా లారీ అమాంతంగా లోయలోకి జారిపోయే అవకాశం వుంది. అదీకాక నువ్వు లారీ చేతిలో ఛస్తే ఎలా! నా చేతుల్లో చావాలి!! నా జ్యోతిని అమానుషంగా అనుభవించి నాక్కాకుండా చేసి పారిపోయినందుకు ప్రతిఫలంగా నీ భార్య విధవ కావాలి" నరేంద్ర జేబులోంచి కత్తితీశాడు.

అప్పటికే కపిల్ చేతిలో కత్తి ప్రత్యక్షమైంది.

యిద్దరు ప్రత్యర్థులూ తలపడేంతలో 'ఆగండి' అన్న గర్జన వినిపించి యిద్దరూ వెనుదిరిగి చూశారు.

క్లీనరు! అతని చేతిలో పిస్తోలు!!

"మిస్టర్ నరేంద్రా! జ్యోతి నీ భార్య కానప్పుడు

పుట్టింట్లో వుండేదికదా! వాళ్ళింటికి ప్రక్కనే నేనుండే వాణ్ని. జ్యోతి అందాన్ని పిచ్చిగా ప్రేమించాను! రాను రాను ఆమె నా కారాధ్యదేవతగా మారిపోయింది. నా ప్రేమని రకరకాలుగా ప్రదర్శించేవాడ్ని. కాని జ్యోతి అర్థం చేసుకోలేదో ఆమెకా వుద్దేశం లేదో - నా పట్ల ఉదాసీనంగా ప్రవర్తించేది.

"అయినా ఆమెపట్ల నా కారాధనా భావం తగ్గలేదు. నాలో చొరవతనం లేకపోవడం మూలాన ధైర్యం చేసి ఆమె ఎదటపడి నా ప్రేమని వెల్లడించలేకపోయాను.

"చూస్తూండగానే ఆమె నీ యిల్లాలయిపోయింది. నా హృదయం మూగగా రోదించింది. అనాడే నిశ్చయం చేసుకున్నాను, నా జీవితంలోకి మరెవర్నీ ఆహ్వానించ కూడదని.

"జ్యోతిని చూడందే మనసు నిలవని స్థితి కొచ్చేశాను. ఆమె కోసమే పేపర్ బోయ్‌గా పనిలో చేరాను. ప్రతి రోజూ ఆమెకి పేపర్ అందిస్తూ ఆమె రూపాన్ని చూసి తృప్తిచెందేవాణ్ని.

ఓ రోజు పేపర్ యివ్వటానికి వెళ్ళి పోలీసుల మధ్య ఆమె శవాన్ని చూసి గుండెలు పగిలేలా రోదించాను. ఆ తర్వాత ఇన్‌స్పెక్టర్ దర్యాప్తులో వెల్లడయింది, ఆమెని కపిల్ మానభంగం చేశాడనీ, అది సహించలేని నువ్వు ఆమెని గొంతు పిసికి చంపావనీ.

"నువ్వు డ్రయివర్‌వని తెలుసుగాని నిన్ను పెళ్ళిలో తప్ప మరెక్కడా చూడలేదు. నువ్వు వూళ్ళో వున్నా నేను పేపర్ తెచ్చే సమయానికి నిద్ర లేచేవాడివి కావు.

"చిత్రం! ధైర్యమే లేని నాలో కసి చోటు చేసు కుంది. అందాన్ని ఆరాధించకుండా బలవంతంగా ఆస్వా

దించినందుకు వాణ్ని, జరిగిన అన్యాయంలో ఆమెపాత్ర ఏమీ లేకపోయినా అంతటి సౌందర్యరాశిని కర్కశంగా హత్య చేసినందుకు నిన్ను తుదముట్టించాలని నిర్ణయించుకున్నాను.

"నీ రూపం నాకు గుర్తులేదు. నీ ఫోటో చూడ్డానికవకాశం లేకపోయింది. నువ్వు లారీడ్రయివరువని మాత్రం తెలుసు. నా ప్రయత్నం సఫలమయ్యేలా చూడమని విధిని ప్రార్థించి క్లీనరుగా చేరిపోయాను. ఎందరో డ్రయివర్లవద్ద చేరి అనుకోకుండా యిక్కడే స్థిరపడ్డాను. కలిసొచ్చిన అదృష్టమంటే యిదే కాబోలు. విధి నన్ను గమ్యం చేర్చింది. మీ రిద్దరూ దొరికారు...." అన్నాడు క్లీనరు గంభీరంగా.

అతని చేతిలోని పిస్తోలు శబ్దం చేస్తూ గర్జించింది రెండుసార్లు! □

## ఏమి జరుగునో ?

# ఆత్మకు ఆహ్వానం

ఫణిబాబు

చీకటి ప్రపంచాన్ని నిర్దాక్షిణ్యంగా ఆక్రమిస్తుంది.

పగలు ఉదరపోషణ కొరకు బయటకు వెళ్ళిన పక్షులు మెల్లిగా గూటికి చేరుకుంటున్నాయి. కంగారుగా ఇంటికి బయలుదేరాడు సుధీర్. ఒళ్ళంతా చెమట పట్టి చికాకుగా వుంది. చేతిలో షటిల్ బాట్ బరువుగా అనిపిస్తుంది.

స్కూల్ గ్రౌండ్ చీకటిగా వుంది. చివర ఎక్కడో గేటు కనబడుతుంది. ఆ దూరం చూసేసరికి విపరీతమైన నీరసం వచ్చింది సుధీర్‌కు. నడక వేగం పెంచాడు.

"సుధీర్!" చీకటిలో నుండి వినబడిందో పిలుపు. బ్రేక్ వేసినట్లు ఆగిపోయాడు సుధీర్. ఆ కంఠం వినిన

వయివు చూసాడు. ఓ ఆడమనిషి నిలుచుని వుంది. వెంటనే గుర్తుపట్టాడు.

"ఏం కావాలి ఆంటీ?" అడిగాడు దగ్గరగా వెళ్తూ.

ఏమీ మాట్లాడలేదామె. పమిట చాటునుండి తీసింది ఒక పదునైన కత్తి. చీకటిలో ఆ విషయం సుధీర్‌కు తెలియలేదు. ఆమెకు బాగా దగ్గరగా వెళ్ళాడు.

మరుక్షణం కసిగా సుధీర్ పొట్టలో పొడిచిందామె. బయటకు లాగి తిరిగి గుండెలలో పొడిచింది. ఒక్క క్షణం సుధీర్‌కు ఏమి అర్థంకాలేదు. మరుక్షణం భరించలేని బాధ శరీరంలో ప్రవేశించింది. చేతిలో బాట్ క్రింద పడి పోయింది.

"ఆంటీ" నమ్మలేనట్లుగా అరిచాడు సుధీర్.

"నువ్వే నన్ను చంపింది. నీటిలో ముంచి నన్ను చంపావుగా! అందుకే నిన్ను చంపేస్తున్నాను" చెప్పింది.

ఈసారి ఆమె కంఠం ఆడదానిలా కాక మగపిల్లవాడిలా వినిపించింది. అంత బాధలోనూ ఆ కంఠస్వరాన్ని గుర్తు పట్టాడు సుధీర్. గుర్తుపట్టిన మరుక్షణం కత్తిపోటు తిన్న ప్పటి కంటే బిగ్గరగా అరిచాడు.

మైగాడ్! ప్రవీణ్ గొంతది. నీటిలో పడి మునిగి పోయిన ప్రవీణ్ కంఠస్వరమది. అంటే చచ్చిపోయిన ప్రవీణ్ ఆత్మ ఈవిడను ఆవహించి ఇలా చంపడానికి ప్రయత్నిస్తుందా?

"దెయ్యం! బాబోయ్ దెయ్యం" బిగ్గరగా అరుస్తూ అక్కడినుండి పరిగెత్తబోయాడు సుధీర్. కొంచెంకూడా ఫలించలేదు అతని ప్రయత్నం. పిశాచంలా వికృతంగా నవ్వుతూ సుధీర్ మీదకు దూకిందామె. మెరుపుకంటె వేగంగా ఆమె చేతిలో కత్తి అతని మెడలో దిగిపోయింది.

పీక కత్తిరించబడ్డ కోడిపుంజులా గిలగిలా కొట్టుకున్నాడు సుధీర్. రెండు నిముషాలలో అతనిలో చలనం ఆగిపోయింది. ముందుకు వచ్చి కత్తిని పైకి లాగిందామె. దానికి అంటిన రక్తాన్ని అతని చొక్కాకే తుడిచింది. ఆ తర్వాత నిశ్శబ్దంగా చీకటిలో కల్సిపోయింది.

పిశాచగణాలకు వేయబడ్డ ఆహారంలా అగుపిస్తుంది సుధీర్ శవం. అది మనుష్యుల కంటబడాలంటే చాలా సమయం పడుతుంది.

## 2

ఆవిడను మరోసారి పరిశీలనగా చూశాడు దిలీప్. మామూలు ఆడవాళ్ళకంటే పొడవుగా, పొడవుకు తగ్గ లావుతో వుందావిడ. చూడగానే గౌరవం కలిగించే దుస్తులతో వుంది అందువల్ల ఆమెను చూడగానే గుళ్ళో దేవతను చూసిన అనుభూతి కలుగుతుంది. ముఖ్యంగా ఆమె ముఖంలో ప్రసన్నత చూస్తే ఎంతకాలమయినా ఆమె చెంతనే వుండిపోవాలనిపిస్తుంది.

"మిస్టర్ దిలీప్! నాపేరు రేణుక. మీ గ్లోబ్ డిటెక్టివ్ ఏజెన్సీని కాంటాక్ట్ చేసింది నేనే" చెప్పిందావిడ.

"చెప్పండి మేడమ్! ఐయామ్ ఎట్ యువర్ సర్వీస్" అన్నాడు దిలీప్.

"దిలీప్! మా నరేంద్రకు ఏ ప్రమాదం జరుగకుండా మీరు కాపాడాలి."

"నరేంద్ర....అంటే?" అడిగాడు దిలీప్.

"మా అబ్బాయి. ఈ ఊళ్ళోనే వున్న గవర్నమెంట్ కాలేజిలో ఇంటర్ చదువుతున్నాడు."

"మీకు ఇంటర్ చదివే కొడుకున్నాడా?" ఆశ్చర్యాన్ని దాచుకోలేకపోయాడు దిలీప్.

దిలీప్ ప్రశ్నకు ఆవిడ కాస్త సిగ్గుపడింది. సాధారణంగా ఆడవాళ్ళు అటువంటి సంభాషణ కొనసాగిస్తారు. కాని ఆవిడ సూటిగా విషయం లోనికి వచ్చింది.

"మా నరేంద్రకు ముగ్గురు స్నేహితులున్నారు దిలీప్. వారిలో ఇద్దరు చనిపోయారు. మా వాడికి కూడా ఏమయినా హాని జరుగుతుందేమోనని భయమేస్తుంది."

"వివరంగా చెప్పండి. వాళ్ళు ఎలా చనిపోయారు?" అడిగాడు దిలీప్.

"మొదట మరణించింది ప్రవీణ్. వీళ్ళు నలుగురు ఆ మధ్య పిక్నిక్‌కు వెళ్ళారు. అక్కడ స్విమ్మింగ్ చేస్తుండగా ప్రవీణ్ మునిగి చనిపోయాడు. అది ఎలా జరిగిందో ఎవ్వరికీ తెలీదు. కేవలం మిగిలిన ముగ్గురి మాటలే సాక్ష్యం."

ఒక్కనిముషం ఆగింది రేణుక. ఫ్రిజ్ దగ్గరకు నడిచి రస్నా రెండు గ్లాసులలో పోసి తెచ్చింది. దిలీప్‌కు ఒక గ్లాసు అందించి తిరిగి చెప్పింది.

"అ తర్వాత సుధీర్, సాయంత్రం షటిల్ ఆడి చీకటి పడుతుండగా తిరిగి వచ్చేటప్పుడు హత్యచెయ్యబడ్డాడు."

"యూమీన్! మొన్న హైస్కూల్ గ్రౌండ్‌లో హత్య చెయ్యబడ్డ అబ్బాయేనా?"

"అతనే! ఎవరో కత్తితో పొడిచి చంపేశారు. మా నరేంద్రను కూడా ఎవరైనా ఏమైనా చేస్తారేమోనని నా భయం."

"అయితే ప్రవీణ్‌కూడా హత్యచెయ్యబడ్డాడని మీ అనుమానమా?" అడిగాడు దిలీప్.

"అవేవి నాకు తెలియవు మిస్టర్ దిలీప్. నేను మీ నుంచి కోరేది మాత్రం మా అబ్బాయి రక్షణ. దానికితగ్గ

ఫీజు మీ ఏజెన్సీకి చెల్లిస్తాను" చెప్పింది రేణుక.

"ఈ నలుగురి స్నేహితులు ఎవ్వరితోనైనా ఘర్షణ పడ్డారా?"

"ఆ విషయాలు మా నరేంద్రను అడగండి. మీకు సరియైన ఇన్ఫర్మేషన్ వస్తుంది."

"ఇప్పుడు మీ నరేంద్ర ఎక్కడవున్నాడు?" సోఫాలో నుండి లేచి నుంచుంటూ అడిగాడు దిలీప్.

# 3

గిర్రున వెనక్కి తిరిగి ముందుకు పరిగెత్తాడు ఆదిత్య. చేతిలో కెమరాను గట్టిగా పట్టుకున్నాడు.

"ఆగరా బద్మాష్! ఆగు" వెనుకనుండి భీకరమైన కంఠం హెచ్చరించింది.

ఆగలేదు ఆదిత్య. ఆగితే మళ్ళీ పరిగెత్తే ఛాన్సు దొరకదని అతనికి తెలుసు. వేగంగా పరుగెత్తి నాలుగడుగుల ప్రహరీగోడ అవలీలగా దూకేశాడు. అతడిని తరుముకు వచ్చిన దృఢకాయులకు అది చేతకాలేదు. వాళ్ళు ఆ గోడ ఎక్కేసరికి కాస్త ఆలస్యమయింది. ఆ సమయాన్ని బాగా వుపయోగించుకున్నాడు ఆదిత్య.

అక్కడికి కొద్దిదూరంలో మోటార్ బైక్ పై వున్నాడు నరేంద్ర. పరిగెత్తుకొస్తున్న ఆదిత్యను చూడగానే ఒక్క కిక్ తో బైక్ స్టార్ట్ చేశాడు. వేగంగా వచ్చి వెనుక కూర్చున్నాడు ఆదిత్య. ఆ వెంటనే బండి ముందుకు పరిగెత్తింది. ప్రహరీ గోడదాటి వచ్చిన దృఢకాయులకు కనుచూపు మేరలో కనబడలేదది. బండిని వేగంగా పోనిచ్చి ఆదిత్య రూమ్ ముందు ఆపాడు నరేంద్ర.

"కమాన్! తొందరగా ఫిలిం డెవలెప్ చేసి చూడాలి. పద" మోటార్ బైక్ తాళంవేస్తూ అన్నాడు.

"రాస్కెల్స్! ఆఖరి నిముషంలో చూసేశారు గురూ. లేకపోతే ఇంకా మంచి సీన్లు ఫోటో తీద్దును" చెప్పాడు ఆదిత్య.

"నాకు తెలుసు ఇలాంటి పనులేవో చేస్తున్నారని. లేకపోతే విషయం మర్డర్లదాకా రాదు" అన్నమాటలు వినిపించాయి.

అదిరిపడ్డారు మిత్రులిద్దరూ. వెనుక ఒక యువకుడు నిల్చునివున్నాడు.

"ఎవరు మీరు?" వణుకుతున్న కంఠంతో ప్రశ్నించాడు ఆదిత్య.

"ఆ బాబాగాడి ముఠా అయివుంటాడురా! వేసెయ్" అన్నాడు నరేంద్ర.

"హోల్డ్ బాయిస్. శాంతించండి. నేను మీరనుకునే మనిషినికాను" జేబునుండి విజిటింగ్ కార్డ్ తీస్తూ చెప్పాడు దిలీప్.

"హేయ్! డిటెక్టివ్ ఫ్రం గ్లోబ్ డిటెక్టివ్ ఏజెన్సీ" అరిచేశాడు ఆదిత్య.

"మేము డిగ్రీలు పూర్తిచేశాక మీ డిటెక్టివ్ ఏజెన్సీలో చేరుదామనుకుంటున్నాం సార్" ఉత్సాహంగా చెప్పాడు నరేంద్ర.

"అలా అయితే మీరు పెళ్ళిళ్ళు చేసుకోకూడదు."

"ఏం? అది మీ సంస్థ నియమమా?" నరేంద్ర ఆశ్చర్యంగా అడిగాడు.

"కాదు. కాని మీరు పెళ్ళిచేసుకుని మా సంస్థలో చేరితే మీకు ఇద్దరు బాస్‌లుంటారు. ఒకరు మా ముసలాయన. అదే మా సంస్థ డైరెక్టర్. మరొకరు మీ భార్య. ఇద్దరి సాధింపు తట్టుకోవాలంటే కష్టంకదా?" అన్నాడు దిలీప్.

ఆ మాటలకు పెద్దగా నవ్వేశాడు ఆదిత్య. ముసిముసిగా నవ్వుతూ లోపలికి ఆహ్వానించాడు నరేంద్ర.

ఇంటిలోనికి రాగానే డార్క్ రూం లోపలికి వెళ్ళి పోయాడు ఆదిత్య.

లోనికి వచ్చి కూర్చున్న తర్వాత అసలు సంగతి బయటపెట్టాడు దిలీప్.

"ప్రవీణ్‌ది మాత్రం హత్యకాదు సార్" నరేంద్ర వెంటనే చెప్పాడు.

"ఆరోజు మేము వద్దంటున్నా వినకుండా నదిమధ్యకు వెళ్ళాడండి. రక్షించడం కష్టమైంది. సుధీర్ హత్య మాకూ ఆశ్చర్యంగానే వుంది. వాడిని చంపేటంత కక్ష ఎవ్వరికీ లేదు."

"మీరు ఎవ్వరితోనూ తగాదాలు పడటంలేదా?" అడిగాడు దిలీప్.

"కాని ఆ మనిషికి హత్యలు చేసే తెగింపు లేదుసార్"

"అవసరం ఏ పనినైనా చేయిస్తుంది మిస్టర్ నరేంద్ర. ఎవరా మనిషి?"

"తన్మయానంద బాబా. మీకు తెలిసేవుంటాడు. అతనికి ప్రజలలో పేరు వుంది. బాగా సంపాదిస్తున్నాడు" అన్నాడు నరేంద్ర.

"అయినా చదువుకునే రోజుల్లో మీకు ఈ గొడవ లెందుకు?"

"అదికాదు సార్! వాడు దేశానికి చీడపురుగు. భక్తి పేరుచెప్పి ఆడవాళ్ళను ఆశ్రమంలో చేర్చుకుని వ్యభిచారం చేయిస్తున్నాడు సార్. అంతేకాదు ఆశ్రమంలో దొంగ నోట్లు ముద్రిస్తున్నాడు కూడా. ఆదిత్య ఫిలిం డెవలప్ చేసి తెస్తాడు. చూడండి మీకే తెలుస్తుంది."

అదే సమయంలో వినబడింది ఒక పొలికేక. తరుముకు వస్తున్న మృత్యువును చూసి మనిషి చేసే ఆర్తనాదం. మెరుపులా లేచి అటు పరుగుతీశాడు దిలీప్. కొంచెం వెనుకగా అనుసరించాడు నరేంద్ర.

వంటగదినే డార్క్ రూంగా వుపయోగిస్తున్నాడు ఆదిత్య. తలుపులు లోనికి వేసివున్నాయి. బలమంతా వుపయోగించి అవి బ్రద్దలు కొట్టాడు దిలీప్. లోపలికి అడుగుపెడుతూనే బిగిసిపోయాడు. అతని వెనుకే లోపలికి వచ్చిన నరేంద్ర ఆ గదిలోని దృశ్యాని చూడగానే పిచ్చిగా కేకపెట్టాడు. కలలోకూడా గ్రహించని భయంకర దృశ్యం కళ్ళముందు కనబడేసరికి అతడు తట్టుకోలేకపోయాడు. చెవులు రెండు చేతులతో మూసుకుంటూ పెద్ద వాంతి చేసుకున్నాడు.

ఆ గదిలో నేలపై పడివున్నాడు ఆదిత్య. అతని తలపై నిలువునా దిగబడి వుంది ఒక గొడ్డలి. తల రెండుగా చీలిపోయి వికృతంగా వుంది.

కొద్దిసేపటికి తెప్పరిల్లాడు దిలీప్. ఆ గదికి అవతలి వైపు ఒక తలుపు వుంది. ఎవరో ఆ తలుపు కొట్టి వుంటారు. తీసివుంటాడు ఆదిత్య. కనీసం వచ్చిన మనిషి ఎవరో చూసే అవకాశం కూడా వుండివుండదు. గొడ్డలితో చంపేశారు. ఆ కాస్త సమయంలో నరేంద్ర కూడా కుదుట పడ్డాడు.

"రాస్కెల్ ఆ బాబాగాడే అయ్యుంటాడు సార్! వాడికి రోజులు దగ్గరకు వచ్చేశాయి" ఆవేశంగా అన్నాడు నరేంద్ర.

"కాదు నరేంద్రా! ఇది బాబా చెయ్యలేదు. వాడే అయితే ఫిలిం తీసుకుపోవాలి. చూడు డెవలప్ చేసిన ఫిలిం

క్లిప్స్‌కు వేలాడుతోంది" చెప్పాడు దిలీప్.

అప్పుడే కదిగిన రీలు క్లిప్స్‌కు వ్రేలాడుతోంది. నిజంగా బాబా యీ పని చేయిస్తే ఆ రీలు ఎత్తుకుపోవాలి. కాని అది అలాగే వుంది. అంటే యీ హత్య చేసింది బాబా కాదా? మరి....

అతని ఆలోచనలు భగ్నం చేస్తూ వినబడింది దిలీప్ కంఠం.

"నరేంద్రా! ఇక్కడ యేమీ ముట్టుకోవద్దు వెళ్ళి పోలీసులకు ఫోన్ చెయ్యి."

అక్కడి నుండి బయటకు పరిగెత్తాడు నరేంద్ర. రక్తపు మడుగులో పడివున్న ఆదిత్య శవాన్ని చూసి బాధగా తల విదిలించాడు దిలీప్.

# 4

తన్మయానందబాబా తన ముందు కూర్చున్న భక్తులను తన్మయంగా చూశాడు. తన ఆశ్రమానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా ఆడ వాళ్ళు చాలా ఎక్కువగా వస్తున్నారు

కాసేపు భగవద్గీత చెప్పాడు బాబా. ఆ తర్వాత విభూతి సృష్టించి అందరికీ పంచాడు. కొందరు ధనికులైన భక్తులకు వాచీలు, ఉంగరాలు కూడా సృష్టించి ఇచ్చాడు. ఇంకా అలాంటి మహిమలు చాలా చూపించేవాడే. కాని అదే సమయంలో గుమ్మంలో ప్రత్యక్షమయ్యిందో స్త్రీమూర్తి. ఆమెను చూడగానే ప్రక్కనున్న శిష్యులకు సైగ చేశాడు బాబా. సరిగ్గా పది నిముషాలలో భక్తులందరూ అక్కడి నుండి పంపివేయబడ్డారు.

ఒంటరిగా నిలబడి వుందా స్త్రీ. మెల్లిగా దగ్గరకు నడిచాడు బాబా. తలపై చెయ్యివేస్తూ మృదువుగా అన్నాడు.

"రండి జయలక్ష్మి! వచ్చి కూర్చోండి."

మంత్రముగ్ధలా ముందుకు నడిచిందామె. అక్కడే వున్న కుర్చీలో కూర్చుంది. ఒక్క మాట కూడా మాట్లాడ లేదు. అలాగే కూర్చొని బాబా ముఖంలోకి చూడసాగింది. ఆమె కళ్ళు రాత్రిపూట ఆకాశంలో మెరిసే నక్షత్రాలవలె వున్నాయి. సడన్‌గా బాబా కంఠం శంఖారావంలా విని పించింది.

"జయలక్ష్మి! మీరు విశ్రాంతిగా పడుకోండి. బాగా అలసిపోయి వున్నారు. అలాగే విశ్రాంతిగా పడుకోండి. చనిపోయిన మీ కుమారుడి ఆత్మ మీలో ప్రవేశించ బోతోంది. మీకు నిద్ర ముంచుకు వస్తుంది. మీకు నిద్ర.... వచ్చేస్తుంది...."

ఆమె కన్నులు అరమూతలు కాసాగాయి. బాబా నోటి నుండి వెలువడే ప్రతీ మాట ఆమె మెదడులో రికార్డ్ కాసాగింది. సుమారు అరగంట పాటు కొనసాగిందా కార్య క్రమం. ఆ తర్వాత అసలు సజెషన్స్ యివ్వడం మొదలు పెట్టాడు. అప్పటికే తన కొడుకు ఆత్మ తనలో ప్రవేశించి నట్లు ప్రవర్తిస్తుందామె.

"ప్రవీణ్? నీవు చంపవలసిన ఆఖరివాడు యింకా బ్రతికే వున్నాడు. ఈ రోజే నీవు నరేంద్రను చంపి వేయాలి. నిన్ను నీటిలో ముంచి చంపినందుకు ప్రతీ కారం తీర్చుకో" జయలక్ష్మిని వుద్దేశించి చెప్పసాగాడు బాబా.

హఠాత్తుగా వెనుక నుండి చప్పట్లు వినిపించాయి. తపోభంగమయిన ఋషి లా ఉలిక్కిపడ్డాడు బాబా. గుమ్మంలో నిలబడి వున్నాడు దిలీప్.

"ఎవరు నువ్వు?" తడబడుతున్న కంఠంతో అడిగాడు

బాబా.

"నేను ఎవరినయినా, నీవు మాత్రం చాలా తెలివైన వాడివి బాబా. భగవంతుడి పేరు చెప్పి వ్యభిచారం, దొంగ నోట్లు, హిరాయిన్ వంటి డ్రగ్స్ పంపిణీ. ఓహ్! చాలా గొప్పవాడివి బాబా. చాలా గొప్ప పనులే చేస్తున్నావు."

"అబద్ధం! నా మీద అన్యాయపు టారోపణలు చేస్తున్నావు. అసలు నిన్ను లోపలికి యెవరు రానిచ్చారు?" అరిచేశాడు బాబా.

"ఇప్పుడు ఈ ఆశ్రమం పోలీసుల అధీనంలో వుంది బాబా. కాసేపు ఆగితే అన్ని సాక్ష్యాలు బయటకు వస్తాయి" చెప్పాడు దిలీప్.

అంతవరకు బయట నిలబడివున్న పోలీసులు కొంత మంది లోపలికి వచ్చారు. వాళ్ళను చూడగానే స్థాణువులా నిలబడిపోయాడు బాబా.

"అంతేకాదు బాబా! సుధీర్, ఆదిత్యలను హత్య చేయించినందుకు కూడా నీకు శిక్ష పడుతుంది" చెప్పాడు దిలీప్.

"వాళ్ళను నేను హత్య చెయ్యలేదు" వెంటనే అన్నాడు బాబా.

"షటప్!" గర్జించాడు దిలీప్. "నీ కార్యక్రమాలకు అడ్డు తగులుతున్నారని వాళ్ళను హత్య చేయించావు. ఇదిగో ప్రవీణ్ తల్లి అయిన ఈ జయలక్ష్మిని హిప్నొటైజ్ చేసి ఆవిడతో వాళ్ళను చంపించావు."

"హిప్నోటిజమ్ ద్వారా హత్యలు చేయించానంటే ఎవ్వరూ నమ్మరు. ఎంత హిప్నొటైజ్ చేసినా తనకు యిష్టంలేని పని యేది ఆ మనిషి చెయ్యడు" అన్నాడు

బాబా.

ఒక్క-క్షణం సూటిగా బాబా ముఖంలోనికి చూశాడు దిలీప్.

"నరేంద్ర తల్లిగారయిన రేణుక యీ కేసు నా కప్ప గించారు. అప్పటికే సుధీర్ చచ్చిపోయాడు. నా ఎదురుగానే ఆదిత్య హత్య చేయబడ్డాడు. అక్కడ విచారిస్తే జయ లక్ష్మి హత్య సమయంలో ఆ ప్రాంతాలలో మసలినట్లు తెలిసింది. ఆవిడను రెండురోజులు గమనించేసరికి సూత్ర ధారివైన నీవుకూడా బయటపడ్డావు. చాలా గొప్ప ప్లాన్ వేశావు బాబా! నీకు అడ్డుగా వున్న ముగ్గురు కుర్రవాళ్ళను ఒక ఉన్మాదిచేత హత్య చేయించి తప్పించుకుందామను కున్నావు."

ఊపిరి పీల్చుకోపడానికన్నట్టు రెండు క్షణాలు ఆగాడు.

"నీవు చెప్పింది నిజమే బాబా! హిప్నొటైజ్ చేసినా ఇష్టంలేని పని ఆ మనిషిచేత చేయించలేము. కాని జయ లక్ష్మి పరిస్థితి వేరు. తన కొడుకు ఆత్మరూపంలో వున్నా డని ఆమె నమ్మింది. తన కొడుకు ఆత్మశాంతికి చేసింది ఈ హత్యలు. అయితే తెలిసి చెయ్యలేదు. నీ హిప్నొ టిజమ్‌లో పడి ఒక రకమయిన ఉన్మాదంలో చేసింది ఈ హత్యలు. ఆమె అలా కావడానికి కారణం నువ్వు. కేవలం నువ్వు...." ఆగాడు దిలీప్.

అప్పుదే బయటనుండి లోపలకు వచ్చాడు సబ్ ఇన్‌స్పెక్టర్.

"మొత్తం ఆధారాలు దొరికాయి దిలీప్! ఇక తన్మయా నంద బాబాను తన్మయం చెందేలా చెయ్యడమే తరు వాయి." అన్నాడు హాండ్‌కప్స్ బయటకు తీస్తూ. □

# దొంగాట..దొంగాట

చవాన్ సుదర్శన రావు

"హ్యాండ్సప్ : ...."

మెల్లగా, చల్లగా వినిపించిన ఆ మాటలు విని అదిరిపడ్డారు రామారావుగారు.

ఎదురుగా అయిదుగురు వ్యక్తులున్నారు. కరకుదనం, మొరటుదనం వాళ్ళ చూపుల్లోంచి జలపాతాల్లా దూకుతున్నాయి. అయిదుగురి చేతుల్లోనూ అయిదు కత్తులు

రామారావుగార్ని కసిగా చూస్తున్నాయి.

"తాళంచెవి కావాలి!" మంద్రంగా వినిపించింది వాళ్ళ పెద్దాల్నుండి.

వణికిపోయారు రామారావుగారు. ఈ బ్రాంచికి మేనేజరుగా ఆయన నాలుగు సంవత్సరాల్నుండీ వుంటున్నారు. బ్యాంకుద్వారా కష్టమర్లు, కష్టమర్లద్వారా బ్యాంకు వృద్ధి పొందటానికి ఎనలేని కృషి చేశారు. యిల్లు-బ్యాంకు.... ఈ రెండే ఆయన లోకం.

ఇవాళ కూడ యిప్పుడు - అంటే దాదాపు తొమ్మిది గంటల సమయంలో యింత చలిగా వున్నా అకవుంటెంటును బతిమాలి కూచోబెట్టుకొని లెక్కల్లో తేడా సరిజూసుకుంటున్నారు. అతను యిందాకే వెళ్ళిపోవటంతో మరుసటి వారంలో తను విజిట్ చెయ్యాల్సిన ప్రాంతాలు, చేపట్టవలసిన అభివృద్ధికార్యక్రమాలు మనసులో రూపొందించుకుంటూ వాటిని కాయితం మీద పెడుతూ వుండిపోయారు.

'ప్రాణం పోయినా సరే - పరువు పోకూడదు. తను యిన్నేళ్ళుగా సాధించిన ప్రగతికి తనవల్లే భంగం వాటిల్లకూడదు....'

నెమ్మదిగా లేచారు రామారావుగారు.

"చెప్పింది విన్పించుకో. విప్లవాన్నాహ్వానించకు...." గుర్రుమంటూ అన్నాడొక దొంగ.

"నేనివ్వను."

"గూర్ఖాకు స్పృహపోయింది. నీకు ప్రాణమే పోతుంది."

"అయినా సరే...."

"యివ్వవు?"

తల అడ్డంగా ఆడించాడు మేనేజర్.

అయిదుగురు దొంగల్లోనూ ఒక్కసారిగా చలనం వచ్చింది. వలయాకారంగా చుట్టుముట్టారాయన్ని.

## 2

"యస్సర్! ఆ తర్వాత వాళ్ళాయన్ని రకరకాలుగా చిత్రహింసలపాలు చేశారు. ముఖంమీద ఏసిడ్ చిలకరించారు బుగ్గల్లో సూదులు గుచ్చారు. రెండు చేతులూ కలిపి సూదితో కుట్టేశారు. దుస్తులన్నీ పీలికలు చేసి మొత్తమ్మీద తాళంచెవి తీసుకున్నారు. అయిరన్‌సేఫ్ తెరవటానికి చాలా శ్రమ పడ్డారు. రాలేదు. మళ్ళీ ఆయన్ని హింసించారు. ఆయన స్పృహ తప్పారు. చేసేదిలేక పగ తీరక ఆయన వంటిమీదున్న వుంగరాల్ని, పులిగోరు చైనుని లాక్కుని కత్తితో పొడిచి పారిపోయారు" గాభరాగా చెప్పాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాధవ్.

"దోపిడి, దోపిడితోబాటు హత్య! యిది చాలా ఘోరం! మేగ్జిమమ్ వారంలోగా రెస్పాన్సు రావాలి. అండర్‌స్టాండ్!?"

"యస్సర్ ...." నీరసంగా ఫోన్ పెట్టేశాడు సి.ఐ. మాధవ్.

యస్పీ అసలే చండశాసనుడు. ఏ పనయినా క్రమం తప్పకుండా చేస్తాడు. ఇతరుల నుండీ అదే ఆశిస్తాడు. మనిషి కాస్త స్వార్థపరుడు కావచ్చు. కాని ఆ మాత్రం స్వార్థం లేకపోతే పయికిరావటం ఎలా?

స్వార్థమంటే కేసుని గురించి సబార్డినేట్స్‌పై ఒత్తిడి తేవటమన్నమాట!

యిప్పుడెలా చావటం? వారంలోగా వాళ్ళని పట్టుకోలేకపోతే తనమీద కఠినచర్యలు తీసుకోవాల్సొస్తుందని

యస్పీ గట్టిగా హెచ్చరించాడు.

కాసేపు అటూ యిటూ సీరియస్‌గా పచార్లు చేసిన మీదట మాధవ్‌కి చరణ్ గుర్తొచ్చాడు.

చరణ్ నేరస్థులకే కాదు. ప్రజలందరికీ సింహ స్వప్నమే.

అతడు సబ్-ఇన్‌స్పెక్టర్।

*　　　*　　　*

"ఫింగర్ ప్రింట్స్ కోసం ఎదురు చూడ్డం వ్యర్థమని పిస్తోంది సార్!" అన్నాడు చరణ్ చిన్నగా దగ్గి గొంతు సవరించుకొని। "బ్యాంక్‌లో అయిరన్‌సేఫ్ తాళంచెవులు- ఒకటి మేనేజర్‌వద్దా మరోటి క్యాషియర్‌వద్దా వుంటాయి. ఈ చిన్న విషయం తెలీకుండా వాళ్ళు రంగంలో దూకా రంటే వాళ్ళు దొంగతనానికి బహుశా కొత్తవాళ్ళని నా అభిప్రాయం...."

"గుడ్। అప్పుడు మన పరిస్థితి మరీ ఘోరంగా తయారవుతుంది. ఆరితేరిన దొంగల నేరవిధానాల్లో ఒక్కో ముఠాకీ ఒక్కో పద్ధతి వుంటుంది. కొత్తదనం కోసం ఎంత ప్రయత్నించినా ఇంగువ గుడ్డలా పాత వాసనలు పోవు. గూర్ఖా గుర్తుపట్టగలిగే స్థితిలో లేడు. తలమీద తగిలిన దెబ్బ వాడికి మతి స్థిమితం పోగొట్టింది. ఆ దశలో వాడు తరచూ 'చింపిరిజుత్తు' అని కేకలు వెయ్యటాన్నిబట్టి జరిగిన దర్యాప్తులో అంతకితం వాడికి చింపిరిజుత్తుగల వ్యక్తులెవ్వరూ పరిచయస్థులుగా లేరని తెలుస్తూంది.

దీన్నిబట్టి అయిదుగురు దొంగల్లో ఒకడు చింపిరి జుత్తు వెధవయి వుండాలి. ఆ ఆధారంగా మనం ఎంత వరకూ ముందుకు పోగలం? ఈ కాలంలో చింపిరిజుత్తు

కూడ ఫ్యాషనయిపోయింది....'' అన్నాడు మాధవ్.

ఇంతలో కానిస్టేబుల్ కాశీపతి వచ్చి వినయంగా సెల్యూట్ చేశారు.

ఏం కావాలన్నట్టు విసురుగా చూశారిద్దరూ.

''క్షమించండి సార్! యిందాకట్నుండి మీ మాటలు వింటున్నాను. నాకో సంగతి గుర్తొచ్చింది. హత్య జరగటానికి ముందురోజు రాత్రి నేనూ ఫోర్‌నాట్టూ గస్తీ తిరుగుతోండగా ఆ బ్యాంకుకి దాదాపు వంద మీటర్ల దూరంలో పిట్టగోడ మీద కూచున్న యిద్దరు వ్యక్తుల్ని చూశాను. ఆ సమయంలో వాళ్ళని అక్కడ చూసి అనుమానంతో ప్రశ్నలు వేశాను. తడబడుతూ సమాధానాలు చెప్పారు. అనుమానం బలపడి స్టేషనుకి తీసుకుపోయి హెడ్డుగారి కప్పగించాము. వాళ్ళేదో సంజాయిషీ(?) యివ్వగా హెడ్డుగారు వాళ్ళని వదిలేశారు. వాళ్ళలో ఒకడికి చింపిరిజుత్తుంది సార్!''

పిచ్చివాణ్ణి చూసినట్టు చూశారు చరణ్, మాధవ్‌లు కాశీపతికేసి.

''ఆ అయిదుగుర్లో వాళ్ళూ....''

''మాకే క్లూస్ అందించేంత గొప్పవాడివయ్యావా?'' చరణ్ గుడ్లెర్రజేశాడు.

''అది కాదు సర్....''

''షటప్ అండ్ గెటౌట్....''

''వీడికి సెంట్రీ డ్యూటీ వెయ్....'' అన్నాడు మాధవ్ కఠినంగా.

వులిక్కిపడ్డాడు కాశీపతి. సెంట్రీ డ్యూటీ పనిష్‌మెంట్ డ్యూటీ. అదీ వేస్తే నెలకి తక్కువ వెయ్యరు.

వాళ్ళ ఎదురుగా మొహం మాడ్చుకునే ధైర్యం కూడా లేక అవతలి కెళ్ళిపోయాడు కాశీపతి.

## 3

హత్య జరిగి ఆర్రోజులైంది.

పోలీసు డిపార్టుమెంటు దొంగల్ని పట్టలేకపోయింది. ఐ. జి. అందరిక్కీ మెమోలు ఇష్యూ చేస్తున్నాడు. మాధవ్, చరణ్ పిచ్చిపట్టిన జంతువుల్లా తిరుగుతున్నారు.

మరోప్రక్క బ్యాంకు ఉద్యోగులు అలజడి లేవదీశారు తమకు రక్షణ కరువయిందంటూ. సాధ్యమయినంత త్వరలో దొంగల్ని పట్టుకుని తమకు రక్షణ సౌకర్యాలు కల్పించకుంటే సమ్మె చేస్తామని బెదిరిస్తున్నారు.

ఫలితంగా రామారావుగార్ని హత్యచేసిన వాళ్ళని పట్టిచ్చినా వారి అరెస్టుకి దోహదంచేసే ముఖ్య సమచారం అందించినా పదివేల రూపాయల నగదు బహుమతి ప్రకటించారు బ్యాంకు అధికారులు.

ఆలోచిస్తున్నాడు కాశీపతి.

ఆనాడు తను చూసిన ఇద్దరూ ఆ అయిదుగురిలోని వారేనని కాశీపతికి బాగా అనుమానంగా వుంది. అప్పటికి దాదాపు నాలుగయిదు రోజులనుండీ ఆ ప్రాంతంలో వివిధ సమయాల్లో తిరుగుతూ బ్యాంకు ఆనుపానులు తెల్సుకొని వుండాలి. ఆ ప్రాంతం రాత్రి ఎనిమిదికే నిర్మానుష్యమవుతుందని తెలిసే అయిదుగురూ రంగంలోకి ధైర్యంగా దూకారు.

'ఔరా! ఎంత ధైర్యం వీళ్ళకి? రెండు తాళంచెవుల్లో ఒకటి మేనేజరు వద్దా మరోటి క్యాషియర్ వద్దా వుంటాయనీ రెండు తాళంచెవులూ వుపయోగించి సాదిస్తే తప్ప లక్ష్మీదేవి బంధవిముక్త కాదనీ తెలీదుగాని దొంగతనానికి

బయల్దేరారు. హత్య కూడా చేశారు!'

కాశీపతి కళ్ళముందు రెండు దృశ్యాలు వలయాకారంగా తిరుగుతున్నాయి. ఒకటి: బ్యాంకువారు ప్రకటించిన పది వేలు. రెండు: చెల్లెలి పెళ్ళి!!

## 4

"అక్కడేదో గొడవ జరుగుతున్నట్టుంది. చూద్దాం పద" అన్నాడు కాశీపతి.

టైమ్ చూసుకున్నాడో కానిస్టేబుల్.

"ఇంత చలిలోనా అంతదూరమా!?" అన్నాడు మరొకడు మఫ్లర్‌ని మరింత బిగించుకుంటూ.

"మనం బీట్ తిరుగుతున్నాం. ఇది మన డ్యూటీ!" నాలుగు ఫర్లాంగులు కూడ లేదు నూకాలమ్మ గుడి. చల్లని వాతావరణం, నిశ్శబ్దం కావడంతో అస్పష్టంగానయినా మాటలు విన్పిస్తున్నాయి. అనుమానించడం మన ధర్మం."

"పెద్ద అపరాధ పరిశోధకుడు, సత్య 'డ్యూటీ' పరిపాలకుడూ బయల్దేరాడయ్యా! ఇదో కాశీపతీ! అక్కడ తాగుబోతు వెధవలూ జూదమాడేవాళ్ళూ తందనా లాడుతూంటారు. వాళ్ళ రక్షణకోసం వాళ్ళే చందాలు వేసుకొని గుడికి తలుపులు చేయించుకున్నారు. నువ్వీ ప్రాంతంలో బీటు తిరగటం యిదే మొదటిసారేమో!వాళ్ళ దగ్గర్నుండి మనకు పగటిపూట 'మామూలు' ముడుతుంది. అంచేత యెవ్వరూ అక్కడికి పోరు. నువ్వు కూడా పోమాకు...." అన్నాడు అప్పలస్వామి.

"నిజమే. ఈ ప్రాంతానికే కాదు. ఈ వుద్యోగానికే కొత్త నేను. చూడండి ఫ్రెండ్స్! అధర్మాన్ని తరిమి కొట్టే బాధ్యత మనమీదుంది. నేరాన్ని అరికట్టే శాఖ

మనది....''

"మాచెప్పొచ్చావ్ లేవయ్యా; అదంతా ఎందుకు? మేం రాం. అంతే. నీ కంతగా చూడాలని ఉబలాటం వుంటే నువ్వెళ్ళు. ఈలోగా మేం రోడ్డు చివరిదాకా గస్తీ వెళ్ళొస్తాం. మళ్ళీ యిక్కడే కలుద్దాం....''

కాశీపతి సమాధానం కోసం ఎదురుచూడకుండానే ముందుకి సాగిపోయారు వాళ్ళు.

మొండిధైర్యంతో ముందుకి అడుగేశాడు కాశీపతి.

* * *

"అదేం కుదర్దు. ఈ దోపిడీకి ప్లాన్ వేసింది నేను. అంచేత సగం వాటా నాకు రావాలి'' అన్నాడు మొదటి వాడు.

"ప్లానట ప్లాను. వెదవ ప్లానూ నువ్వూను! బ్యాంకు అయిరన్‌సేఫ్‌ని గూర్చిన పర్టిక్యులర్స్ పూర్తిగా తెలుసుకోలేక పోయావుగాని కొడితే కుంభస్థలమే కొట్టాలని లెక్చరిచ్చి రంగంలో దింపావు. నేను గూర్ఖాగాణ్ణి — గుర్తుపట్టడానికి వీల్లేకుండా పిచ్చిపట్టేలా కొట్టాను. అంతేకాదు. ముందుగా మేనేజర్‌గాడి మెళ్ళోని పులిగోరుని తెంపింది కూడ నేనే! ఆ తర్వాతే మీరు ఉంగరాలూ మెళ్ళోని గొలుసూ లాక్కున్నారు. అంచాత నాకు సగం రావాలి'' అన్నాడు రెండోవాడు.

వాడే చింపిరి జుత్తుగాడు!

"నాలుగైదు రోజులు ముందుగా బ్యాంకు చుట్టూ తిరుగుతూ వాటి ఆనుపానులు తెల్సుకున్నది మేము. సగం మాకు రావాలి'' యిద్దరు కోరస్‌గా అన్నారు.

"అంతో యింతో చదూకుని తగిన వుద్యోగం రాక

జులాయి వెధవల్లా తిరుగుతూ తలిదండ్రుల ఛీత్కారాలకు గురై ఓ చోట కలిసి ఓ పూట తినీ ఓ పూట తినకా కష్టం చేసుకునే ఓపిక లేకా అవస్థపడుతోంటే మనసు అడ్డం తిరిగి, ఆలోచనల్తో అరిగి విసిగి వేసారి దొంగతనాలకు పూనుకుందాం అన్న అయిడియా యిచ్చింది నేను. ఇది మన తొలి సంపాదన. న్యాయంగా యిందులో నాకు మూడు వాటాలు రావాలి" అన్నాడు అయిదోవాడు.

చాటునుండి చూస్తోన్న కాశీపతికి ఓ పక్క ఆనందం గానూ మరోపక్క భయంగానూ వుంది వాళ్ళసలే తెగించినవాళ్ళు. పైగా తాగివున్నారు. కళ్ళెదుట దాదాపు పది వేలు విలువచేసే నోట్లున్నాయి.

తను ఒక్కడు. వాళ్ళు అయిదుగురు, ఈ ప్రతిఘటనలో తను విజయం సాధించగలడా? తెగించి సాధించ గలిగితే తనకి పదివేలు బహుమతి + ప్రమోషన్ ఖాయం! ఆ ముగ్గురు కానిస్టేబుల్సూ వుంటే బావుండేది. వాళ్ళ సాయంతో తను సాధించి వుండేవాడు.

ఉహూఁ....తనొక్కడే సాధించాలి!!

ఆలోచిస్తూ వుండిపోయాడు కాశీపతి, వాళ్ళ కదిలికల్ని గమనిస్తూనే.

అయిదోవాడు మళ్ళీ గొంతు విప్పాడు. "వురేయ్ బాగా ఆలోచించండిరా! మనం నగలుమాత్రమే సాధించాం. కాని వాటిని రొక్కంగా మార్చిం దెవరు? నేను కాదూ! కంసాలికి వంద రూపాయలు అదనంగా యిచ్చాను. బంగారాన్ని కరగించాను. అందుకోసం నాలుగు రోజుల్లో పదహారు వూళ్ళు తిరిగాను ఎవ్వరికీ అనుమానం రాకుండా. కనీసం నాకు మూడో భాగమన్నా యివ్వకపోతే దేవుడు

మిమ్మల్ని క్షమించదు.”

“అలా వీల్లేదు. ఏది యెవరు చేసినా ఫలితం సమానంగా దక్కాల్సిందే!” అన్నారు మిగతావాళ్ళు.

కాశీపతి ఆలోచనలు వేగాన్నందుకున్నాయి. గది లోపల కిరసనాయిలు దీపం వెలుగుతోంది. కాశీపతికి పరిశీలనగా చూసినమీదట గాని గుడి తలుపులకు వెలుపలి భాగంలో వున్న గొళ్ళెం కన్పించలేదు.

అతని బుర్రలో మెరుపు మెరిసింది.

అనుమానంగా తలుపులకేసి మరోసారి చూశాడు.

బలమైన తలుపులే. ఇనుపచువ్వలతో బాటు డైమండ్ జాలి కూడ బిగించబడి వుంది.

వాళ్ళ ధోరణిలో వాళ్ళున్న సమయం. అందులోని ఏమరపాటుతనం కనిపెట్టి చప్పుడు చెయ్యకుండా అడుగులు వేస్తూ ఒక్కసారిగా తలుపులు వేసి గొళ్ళెం పెట్టాడు కాశీపతి. వాళ్ళు విషయం గ్రహించి కొయ్యబారే లోగా తగిన సైజులో ఎంచుకుని ముందుగానే సిద్ధంగా వుంచుకున్న చెట్టుకొమ్మ తాలూకు సన్నని ముక్కని తాళానికి బదులుగా అందులో యిరికించాడు. రాయితో బిగించాడు.

ఉగ్రులయ్యారు దొంగలు. కోపగించుకున్నారు. బతిమాలారు. సగం వాటా యిస్తామన్నారు.

“మీరు పూర్తి సొమ్ము యిచ్చినా నాకక్కర్లేదు. పది వేల రూపాయల్ని ప్రభుత్వంద్వారా అవార్డుగా పొందడంలో నాకు ఎంతో తృప్తి వుంటుంది. అన్నిటికీ మించి నా ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చానన్న ఆనందం అన్నింటికీ అతీతమైంది.” గిరుక్కున వెనుదిరిగాడు కాశీపతి.

అదే అతడు చేసిన మంచిపని.

అతడు మొదటి అడుగు వెయ్యబోతోండగానే 'ఢాం' అంటూ నాటుపిస్తోలు పేలిన ధ్వనితోబాటు ఎడమజబ్బలో నిప్పుకణిక దూరిన అనుభూతి కలిగింది.

పరిగెడుతున్నాడు కాశీపతి. బాధని పళ్ళబిగువున సహిస్తున్నాడు. వంకరటింకరగా పరిగెత్తటంలో రాళ్ళూ రప్పలూ తట్టుకుని క్రింద పడుతున్నాడు. వెనక పిస్తోలు గర్జిస్తూనే వుంది. అదృష్టవశాత్తూ కాశీపతికి తగల్లేదు.

రెండు ఫర్లాంగులు పరిగెత్తాడో లేదో, నీరసంవల్ల స్పృహతప్పిందతనికి.

## 5

"బ్యాంకు.... దొంగలు.... చింపిరిజుత్తు...." నీరసంగా పలికింది కాశీపతి కంఠం.

"పిస్తోలు పేలిన ధ్వని విన్పించి మీతోటి బీట్ కానిస్టేబుల్స్ పరిగెత్తుకొచ్చారు. మిమ్మల్ని చూశారు. మీరు అక్కడ కూడ యిలాగే కలవరించారు. దాన్నిబట్టి మీవాళ్ళు విషయం గ్రహించి యస్సయ్‌ని సి. ఐ. ని, తీసుకొచ్చారు. దొంగలు పట్టుబడ్డారు" మృదువుగా చెప్పింది నర్స్.

తననితాను చూసుకున్నాడు కాశీపతి. ఎడమజబ్బకి బ్యాండేజి వుంది. బెడ్‌పైన కూచుని తల్లి, చెల్లెలు ఆత్రంగా తనకేసే చూస్తున్నారు.

అంత బాధ, నీరసంలోనూ కాశీపతి ఛాతీ పొంగింది. చెల్లాయిని ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు.

అతని కళ్ళముందు....

కాశీపతి డ్యూటీలో చేరి వారం కావస్తోంది.

అతనికి చాల ఆత్రంగా వుంది. బ్యాంకువారు ప్రకటించిన పదివేలు తనకు బహుమతిగా ఎప్పుడు ప్రదానం చెయ్యబడతాయో! తనకి ప్రమోషన్ ఎప్పుడు వస్తుందో!

ఎస్సయ్‌ని అడగటానికి మొహమాటం కాదు భయం అడ్డొచ్చింది. పోలీస్ డిపార్టుమెంటులో చిన్నవాడు పెద్దవాడి కెప్పుడూ లోకువే. కానిస్టేబుల్స్ అయితే మరీను. రక్షక భటుడుగా కాదు, భృత్యుడి కన్నా హీనంగా చూడబడతారు.

స్టేషన్‌లో అడిగే కంటే యింటివద్ద అడగటం బావుంటుందనుకున్నాడు కాశీపతి.

యింటికి వెళ్ళాడు. మనసు చంపుకొని 'అమ్మగారు' చెప్పిన పనులన్నీ చేశాడు. మాట్లాడదామని చరణ్ గది కొచ్చి అడుగు ముందుకి వెయ్యబోయి ఆగిపోయాడు.

చరణ్, సి.ఐ. మాధవ్‌తో మాట్లాడుతున్నాడు.

"యస్సర్....అంతా అయిపోయింది సర్! గూర్ఖా మామూలు మనిషి కావటంతో మెజిస్ట్రేట్‌గారు జరిపిన ఐడింటిఫికేషన్ పేరెడ్‌లో ముద్దాయిల్ని ముఖ్యంగా అతని తలమీద కొట్టిన వాణ్ణి గుర్తించాడు. వాళ్ళు తమ నేరం ఒప్పేసుకున్నారు. ఛార్జిషీటు కూడ దాఖలు చెయ్యడమైంది...."

"గుడ్...." అన్నాడు మాధవ్ అవతలి నుండి.

"మరో శుభవార్త సార్!" మెల్లిగా అన్నాడు చరణ్.

"ఏమిటది?"

"ఐ. జి. ఆఫీసులో మా బామ్మర్ది వున్నాడుగా! యిందాకే ట్రంకాల్ చేశాడు.

"రేపు అక్టోబర్ రెండోతేదిన బ్యాంకువారు మనకి అభి

నందన సభ ఏర్పాటుచేసి ప్రకటించిన పదివేలూ అందించ బోతున్నారు. మన ప్రమోషన్ ఆర్డర్సు కూడ ఆ రోజే మనచేతికి అందనున్నాయి...."

"గుడ్ ....డ్ ...."

"థాంక్యూ సార్. వుంటాన్సార్ ...." ఫోన్ క్లిక్ మంది.

....కాశీపతి అప్రతిభుడయ్యాడు.

అంటే ...అంటే ?!

ఇక ఆలోచించలేకపోయాడు కాశీపతి. అతని అడుగులు అప్రయత్నంగా వెనక్కి పడుతున్నాయి.

"దొంగలు....దొంగలు" అంటూ ఆక్రోశించసాగింది అతని హృదయం.... □

## అల్లుడి దక్షిణ



సీరియల్



వసుంధర

(గత సంచిక తరువాయి)

"తెలియదు. స్మశానంలో కప్పెట్టిన కొత్త గోతులు చాలా ఉన్నాయి. తెలుసుకోవడం చాలా కష్టం—"

"విచిత్ర చనిపోయి ఎంతకాలమైంది?"

"నాలుగు రోజులు...."

మరిదయ్య కళ్ళు మూసుకుని కాసేపు మాట్లాడకుండా ధ్యాననిమగ్నుడై పోయాడు. తర్వాత కళ్ళు తెరిచి-"నేను నీకు సాయపడగలను. కానీ...." అన్నాడు.

"ఊఁ కానీ....ఏమిటి?"

"ఆమెకు మీపైన పగ ఉంది. మీపై పగ చల్లారేదాకా ఆమె శాంతించదు" అన్నాడు మరిదయ్య.

"అది నాకూ తెలుస్తూంది. ఆ పిల్ల వెళ్ళిన మర్నాటి నుంచీ రోజూ రాత్రి కలలోకొచ్చి భయపెడుతోంది—" అన్నాడు నాంచారయ్య.

"చనిపోయే ముందా పిల్ల పట్నంలో ఇంకెవరో శ్రావణ్ మీద పగ తీర్చుకుంటానందన్నారు కదూ?"

"అవును. ఆ శ్రావణ్ నా కొడుకని కూడా అంది."

మరిదయ్య మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. నాంచారయ్య కుతూహలంగా అతడి వంకే చూస్తున్నాడు. కాసేపటికి మరిదయ్య కళ్ళు తెరిచి - "తమకు అయిదు వందలు

ఖర్చవుతుంది. దెయ్యాన్నాళ్ళోంచి తరిమేస్తాను" అన్నాడు.

నాంచారయ్య కళ్ళొత్రబడ్డాయి - "మరిడయ్యా! నేను దెయ్యాలకు భయపడనని నీకు తెలుసు. నేనిక్కడికెందుకొచ్చానంటే - అసలా పిల్లెవరో అనుపానులు చెబుతావని!"

"బాబూ - తమరు నా మాట వినండి. ఆ పిల్లెవరో నాకూ తెలియదు. అయినా నేను సాయపడ్డాను. ఆ పిల్ల దెయ్యమై మిమ్మల్ని సాధించి తీరుతుంది. మీరు నాతో వాదనకు దిగొద్దు. నేను మీ ఊరి స్మశానానికి వస్తాను. నా మంత్రశక్తితో గోతిలోంచీ దెయ్యాన్ని పైకి లేపుతాను. ఊళ్ళోంచి బైటకు తరుముతాను. అంతా మీ కళ్ళ ముందే జరుగుతుంది. అలా జరక్కపోతే మీ డబ్బు మీకు వాపసిచ్చుకుంటాను.

"నేను చెప్పిన మంత్రంతో ఆపిల్ల దెయ్యమయింది. కాబట్టి నా కొక్కడికే ఆ దెయ్యం మీద అంతో యింతో అదుపుంటుంధి. కాబట్టి నేను ౹ప్ప మీకింకెవ్వరూ సాయ పడలేరు. ఆ పిల్ల మిమ్మల్ని పీడించేలోగానే నేనైనా సాయపడగలుగుతాను. తర్వాత మీకు నావల్ల కూడా ప్రయోజనముండదు. మీరు బాగా ఆలోచించండి" అన్నాడు మరిడయ్య.

నాంచారయ్య మరిడయ్యవంక ఆశ్చర్యంగా చూశాడు. తను మనుషుల గురించి మాట్లాడినట్లే అతడు దెయ్యం గురించి మాట్లాడుతున్నాడు.

నిజంగా దెయ్యాలున్నాయా?

విచిత్ర పేరుతో తనింటికొచ్చిన యువతి దెయ్యంగా

మారిందా?

మరిడయ్య ఆ దెయ్యాన్ని గోతిలోంచి లేపుతాడా?

అసలు దెయ్యం గోతిలో ఎందుకుంటుంది?

ఇలాంటి ఆలోచనలతో నాంచారయ్య సతమతమవు తూంటే - మరిడయ్య నిమ్మకు నీరెత్తినట్లున్నాడు. నాంచారయ్య ఎప్పటికీ మాట్లాడకపోవడంతో-"చెప్పండి బాబూ!" అన్నాడతడు.

"నాకు దెయ్యాలంటే నమ్మకం లేదు" అన్నాడు నాంచారయ్య.

"నమ్మకం పుడుతుంది మీకు - కళ్ళారా చూసేక!"

"అదే నాకు చిత్రంగా ఉంది. మనిషికున్న పరిమితుల కారణంగా గోతిలో కప్పెడితే కదలలేడు. కానీ గాలిలో తేలుతూ విహరించగల దెయ్యం - ఇంకా ఆ గోతిలోనే ఎందుకుంటుంది?" అన్నాడు నాంచారయ్య.

"మీకు తెలియనిదేముంది బాబూ?" అన్నాడు మరిడయ్య - "శరీరానికి సంబంధించిన మమకారాలు చావకే కదా మనిషి దెయ్యమై తన కోర్కెలు తీర్చుకోవాలను కుంటాడు. మనిషి చావగానే శరీరంలోంచి దెయ్యం బయటకు వస్తుంది. దానికి శరీరం మీద మమకారం చావదు. దాన్నే అంటిపెట్టుకుని కొన్నాళ్ళుంటుంది. అలా దెయ్యమంటిపెట్టుకుని ఉన్నన్నాళ్లూ శరీరం కూడా కుళ్ళకుండా తాజాగా వుంటుంది. క్రమంగా దెయ్యం గోతిలో జీవితానికి విసిగిపోతుంది. తన కర్తవ్యం గుర్తు చేసుకుంటుంది. ఒకసారి దెయ్యం-మమకారాన్ని వదిలిపెట్టి శరీరాన్ని విడిచిపెట్టిందా - ఇక దాన్నాపడం కష్టం.

"నేను దెయ్యాన్ని శరీరంతోసహా బయటకు తెస్తాను. అప్పుడది శరీరధర్మాలు పాటించవలసి ఉంటుంది. అప్పుడే

నావంటివాడు దాన్నదుపు చేయగలుగుతాడు. సశరీరంగా గోతిలోంచి బైటకు వచ్చిన దెయ్యానికి శరీరం భారమై పోతుంది. ఆ శరీరాన్ని వదిలించుకోవటం దానికి సులభం కాదు....

"జానపద కథలా ఉంది" అన్నాడు నాంచారయ్య.

"ఈ కథ మీ కళ్ళముందు జరుగుతుంది".

"ఎప్పుడు?"

"వచ్చే శనివారం రాత్రి పదకొండున్నరకు - మీ ఊరి స్మశానంలో...."

ఎందుకో నాంచారయ్య శరీరం జలదరించింది - "నేను రాకపోతే?" అన్నాడతడు.

"భయపడుతున్నారా బాబూ?" అన్నాడు మరిడయ్య.

"నేను దెయ్యాలకు భయపడను...."

"మీరు కలకాలం దెయ్యాలకు భయపడకూడదనే నా కోరిక. బాబూ! నా మాట విని మొండితనం వదిలిపెట్టి అయిదు వందలు నాకిచ్చుకోండి. నేను అన్నదన్నట్లుగా జరక్కపోతే డబ్బు వాపసిస్తాను...."

నాంచారయ్య జేబులోంచి నోట్లు తీశాడు. వాటిలోంచి అయిదు వందలు లెక్కపెట్టి మరిడయ్య కందించాడు.

మరిడయ్య నాంచారయ్యకు వంగి నమస్కరించాడు.

నాంచారయ్య లేచి నిలబడ్డాడు - "శనివారం రాత్రి పదకొండున్నర గంటలకన్నావు కదూ - అప్పుడు నేనేం చేయాలి?"

"మీరేమీ చేయనక్కర్లేదు. సరంజామా అంతా నేనే తెచ్చుకుంటాను. ఆ సమయంలో స్మశానంలో కెవరూ రాకుండా చూడండి. తమరు కూడా ఒంటరిగా వస్తే మంచిది. కావాలనుకుంటే ధైర్యం కోసం ఒకరిద్దరు

నమ్మకస్థుల్ని కూడా తెచ్చుకోండి. అందుకు నా కర్తవ్యం తరం లేదు" అన్నాడు మరిడయ్య.

నాంచారయ్య గుడిసెలోంచి బైటకు వెళ్ళి జట్కా ఎక్కాడు.

మరిడయ్య గుడిసె గుమ్మం ముందు నిలబడి అటే చూస్తున్నాడు.

గుర్రబ్బండి కదిలింది. నాంచారయ్య చేయూపాడు.

మరిడయ్య తనూ చేయూపాడు. గుర్రబ్బండి కనుమరుగైనా గుర్రపు డెక్కల చప్పుడు వినపడుతున్నంత సేపూ అతడు లోపలకు వెళ్ళలేదు.

*　　　　*　　　　*

శనివారం రాత్రి పదకొండున్నర కావస్తోంది.

స్మశానంలో ఒకచోట పులితోలుమీద కూర్చుని వున్నాడు మరిడయ్య. అప్పుడతడు మామూలు మనిషిలా కాక మాంత్రికుడిలా కనబడుతున్నాడు. అతడి కనులు తెరచి లేవు. అతడి ముందు హోమగుండం....

మరిడయ్యకు కాస్త దూరంగా కాటికాపరి సుబ్బన్న వణుకుతూ జరుగుతున్న తంతు చూస్తున్నాడు. ఎల్ల వేళలా స్మశానంలో ఉండడంవల్ల అతడికి శవాలన్నా, దెయ్యాలన్నా భయం లేదు. కానీ అర్ధరాత్రిపూట శవాలు లేకుండా అక్కడికి వచ్చే మనుషులంటే అతడికి చచ్చేంత భయం....

సుబ్బన్నకు కాస్త పక్కగా ముగ్గురు వ్యక్తులు నిలబడి ఉన్నారు. వారు సుకుమార్, నాంచారయ్య, అతడి పాలేరు.

విచిత్ర మరణానికి సుకుమార్ మనసు క్షోభించింది. అయితే ఆమె దెయ్యమై నాంచారయ్యను బాధిస్తుందన్న

నమ్మకం అతడికి లేదు. నాంచారయ్యకు మనశ్శాంతి లేకుండ చేయాలన్న భావంతో సుకుమార్ జరిగిందతడికి చెప్పాడు. కానీ యిప్పుడు మరిడయ్య గోతిలోంచి శవాన్ని లేపుతానని సవాలు చేస్తున్నాడు. అదెలా జరుగు తుందోనని అతనికి కుతూహలంగా ఉంది. సుకుమార్‌కి శవం పాతిపెట్టబడ్డ స్థలం గుర్తుంది. మాటి మాటికీ అత డటే చూస్తున్నాడు. అక్కడేదో విడ్డూరం జరుగుతుం దంటే అతడికి నమ్మశక్యం గాలేదు.

నాంచారయ్యకైతే మాటిమాటికీ వళ్ళు జలదరిస్తోంది. విచిత్రను తను మళ్ళీ చూస్తాడా? ఇప్పుడామె రూపమెలా ఉంటుంది? నిజంగా ఆమె దెయ్యమవుతుందా? అంతా మరిడయ్య చెప్పినట్లే జరుగుతుందా లేక ఏదైనా మోసం....?!

నాంచారయ్య పాలేరు కక్కడేం జరుగుతుందో తెలి యదు. వాడు తన యజమానిని వేయి కళ్ళతో కనిపెట్టు కుని చూస్తున్నాడు.

మరిడయ్య మంత్రోచ్చారణ చేస్తున్నాడన్నట్లుగా పెద వులు కదుల్తున్నాయి. కానీ గొంతునించి మాట పెగలడం లేదు.

అంతటా నిశ్శబ్దం....స్మశాన నిశ్శబ్దం....!

ఆ సమయంలో ఉన్నట్లుండి మరిడయ్య పెద్దగా కేక పెట్టాడు.

నాంచారయ్యతో సహా, అక్కడున్నవారందరూ ఉలిక్కి పడ్డారు.

"అటు చూడండి...." అన్నాడు మరిడయ్య.

అందరూ అటు చూశారు.

అక్కడ నేలమీద మట్టి ఎగిరెగిరి పడుతోంది.

లోపల్నుంచెవ్వరో బయటికి రావాలని ప్రయత్నం చేస్తు న్నట్లుంది.

అక్కడే విచిత్ర పాతిపెట్టబడినట్లు సుకుమార్‌కు గుర్తుంది. కుతూహలంతో అతడడుగు ముందుకు వేయ బోయాడు.

"ఎవ్వరూ ముందుకు వెళ్ళవద్దు. నేను దెయ్యాన్నిక్క ణించి దూరంగా తరిమేస్తున్నాను. ఎవరు ముందుకు వెళ్ళినా అందరికీ ప్రమాదం...." హెచ్చరించాడు మరి దయ్య.

అందరూ మంత్రం వేసినట్లాగిపోయారు.

అందరి దృష్టి ఒకేచోట కేంద్రీకరించబడింది.

అక్కడ....

లోనుంచి ఎవరో విసురుతున్నట్లుగా మట్టి బైటపడు తోంది. పడిన మట్టి చుట్టూ గుట్టలా ఏర్పడుతోంది. లోపల గొయ్యి తయారవుతోంది.

అప్పుడు....

గోతిలోంచీ ఓ మానవాకారం బయటకు లేచి వళ్ళు విరుచుకుంది.

నాంచారయ్యకు వళ్ళు జలదరించింది.

సుకుమార్‌కు గుండె అదిరింది.

పాలేరు యజయాని విషయం మరిచి ఆ ఆకారాన్నే చూస్తున్నాడు.

సుబ్బన్న శరీరంలో వణుకు హెచ్చింది.

ఆ మానవాకారం వంటిమీది మట్టిని దులుపుకుంది.

రెండు చేతులూ ఆన్చి నెమ్మదిగా గట్టెక్కింది.

నల్లటి పొడవాటి జుత్తు విరబోసుకుని ఉందా ఆకారం.

ఆమె కట్టిన చీరను నాంచారయ్య గుర్తించాడు.

పోలీఎస్టర్ చీరకు—అన్ని రోజులైనా మట్టి అంటినట్లు లేదు.

చూడ్డానికి సజీవమైన వ్యక్తిలా కనబడుతోం దామె.

హోమగుండంలోని మంటల వెలుగులో—ఆ ఆకారం శవంతో లేచిన దెయ్యంలాకాక—జీవం నింపుకున్న స్త్రీ మూర్తిలా ఉంది.

సుకుమార్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

ఆరోజు—తనూ ఉన్నాడామెను కప్పెట్టినప్పుడు!

వెంటనే తవ్వితీసినా ఆమె బ్రతికే అవకాశంలేదు.

ఇప్పుడిదెలా సాధ్యపడింది?

దెయ్యాలున్నాయా?

ఆమె హోమగుండం వైపు తిరిగి ముందడుగు వేయ బోయింది.

"అటు తిరుగు....అటు తిరుగు...." అన్నాడు మరి దయ్య.

ఆమె చటుక్కున వెనక్కి తిరిగింది.

"ముందుకు వెళ్ళు....ముందుకు వెళ్ళు...." ఆజ్ఞాపిస్తు న్నట్లుగా అరిచాడు మరిదయ్య.

ఆమె ముందుకు నడుస్తోంది.

"పరుగు . పరుగు...."

అప్పుడామె పరుగు ప్రారంభించింది.

అది సామాన్యమైన వేగం కాదు. గాలిలో తేల్తున్న ట్లుగా వెళ్ళిపోతోందామె. ఆమె కనుమరుగు కావడాని కెంతోసేపు పట్టలేదు.

మరిదయ్య తన చేతిలోంచి—ఏవో గింజలు దూరంగా విసిరాడు. తర్వాత నాంచారయ్యవైపు తిరిగి—"దెయ్యం వెళ్ళిపోయింది. ఇక ఈ ఊళ్ళో అడుగుపెట్టదు. మీరు

విశ్రాంతిగా ఉండండి" అన్నాడు.

నాంచారయ్య ఏదో అనాలనుకున్నాడు. కానీ వెంటనే అతడికి గొంతు పెగలలేదు.

"అంతా అనుకున్న ప్రకారం సక్రమంగా జరిగి పోయింది. అది మీ అదృష్టం!" అన్నాడు మరిడయ్య మళ్ళీ.

సుకుమార్ ముందుకు నడిచి దెయ్యంలేచిన గోతి దగ్గరకు వెళ్ళాడు. భయపడుతూనే లోపలకు చూశాడు.

అక్కడేమీ లేదు....

ఈలోగా నాంచారయ్యతో పాటు మరిడయ్య కూడా అక్కడకు వచ్చాడు.

"ఇదంతా యెలా జరిగింది?" అన్నాడు సుకుమార్ ఆశ్చర్యంగా.

"శవం మట్టిని పెకలించుకుని బయటకు వచ్చింది—...."

"నేను నమ్మలేను...."

"కళ్ళారా చూశారు—...." అన్నాడు మరిడయ్య.

నాంచారయ్య భయంగా—"మరిడయ్యా! దెయ్యం మళ్ళీ మనూరినికి రాదుకదూ!" అన్నాడు. అతడి కిప్పుడు దెయ్యం ఉనికిలో బాగా నమ్మకం కుదిరినట్లుంది.

"రాదు. కానీ కొంతకాలం పాటు మీ రూరు కదల కూడదు. దెయ్యం మిమ్మల్ని గుర్తించే ప్రమాద ముంది—". అన్నాడు మరిడయ్య. అతడి కనులలో విజయగర్వం — మాటల్లో గర్వం .... తెలుస్తూనే వున్నాయి.

"కొంతకానికి దెయ్యం నన్ను మర్చిపోతుందా?" ఆశగా బేలగా అడిగాడు నాంచారయ్య.

ఇప్పుడతడి మాటలో హుందాతనం లేదు.

"తప్పకుండా!"

"అందు కెంతకాలం పడుతుంది?"

"కనీసం మూడుమాసాల పాటు మీ రీ ఊరు వదలి పెట్టకూడదు...."

"కనీసం కాదు. కచ్చితంగా యెంత కాలమో చెప్పు ...."

"ఆరుమాసాలు....తర్వాత మీరు ప్రపంచంలో ఎక్కడైనా వెళ్ళవచ్చు...."

"ఇప్పుడా దెయ్యమేం చేస్తుంది?" అనుమానంగా అడిగాడు నాంచారయ్య.

"అదేదో పేరు చెప్పారు—శ్రావణ్ కదూ!"

"ఆఁ శ్రావణ్—" అన్నాడు నాంచారయ్య.

"ఇప్పుడు సరాసరి వెళ్ళి అతడి పనే పడుతుందామె...."

"ఆ తర్వాత?"

"ఆ శ్రావణ్‌కీ మీకూ యే సంబంధమూ లేకపోతే ఫరవాలేదు. లేకుంటే అతడిద్వారా మీ రా దెయ్యానికి గుర్తొస్తూనే ఉంటారు...."

నాంచారయ్య ముఖం పాలిపోయింది.

"బాబూ—ఆ శ్రావణ్ మీకు తెలుసా?" అన్నాడు మరిడయ్య.

"ఆ గొడవలన్నీ నీ కెందుకు?"

"చాలా అవసరం బాబూ—ప్రస్తుతం ఆ దెయ్యం పగంతా ఆ శ్రావణ్ మీదనే! పగ తీర్చుకుందు కతగాణ్ణి వేటాడుతుందామె! అయితే నే నిప్పుడు నా మంత్రశక్తితో దెయ్యాన్ని శరీరానికి కట్టిపడేశాను. ఆ శరీరాన్ని వదల

లేకపోవడంవల్ల దెయ్యానికి కొన్ని పరిమితు లేర్పడ తాయి. శ్రావణ్‌ని మూడుమాసాల లోపున కనుక్కోలేక పోతే ఆ శరీరాన్ని తాజాగా ఉంచడం దెయ్యానికి సాధ్య పడదు. శరీరంతో పాటు దెయ్యమూ అంతమవు తుంది...."

"దెయ్యం శ్రావణ్‌ని కనుక్కొని సాధిస్తే...."

"సాధిస్తే అప్పుడది మిగతా పనులు సాధించడానికి మరో మూడు నెలల పాటు శరీరాన్ని తాజాగా ఉంచ గల ఆత్మశక్తి, ఉత్సాహాన్నీ పొందుతుంది...."

నాంచారయ్య ఆలోచనలో పడ్డాడు.

"బాబూ—మీరు నాకా శ్రావణ్ వివరాలు చెప్పారంటే మూడునెలల పాటు—అతడు దెయ్యానికి దొరక్కుండా కాపాడ్డానికి ఉపాయం చెప్పగలను...."

"ఏమిటా ఉపాయం?"

"అది మీకు చెప్పలేను బాబూ—స్వయంగా నేను ఆ శ్రావణ్‌బాబుకి చెప్పాల్సిన మంత్రోచ్చారణ...."

నాంచారయ్య మరిడయ్య వంక అనుమానంగా చూసి- "ఆదిలో ఆ దెయ్యాన్నుంచి నన్ను రక్షించడం సాధ్యం కాదని చెప్పావు. ఇప్పుడు శ్రావణ్ నెలా రక్షించగలవు? ఇది నమ్మతగ్గ విషయమేనా?" అన్నాడు.

"ఆదిలో నేను చెప్పింది శరీరంలేని దెయ్యం గురించి. ఇప్పుడు నేను చెబుతున్నది శరీరాన్నావహించుకుని ఉన్న దెయ్యం గురించి. మీ మేలుకే చెబుతున్నాను. నా కా శ్రావణ్ వివరాలు చెప్పండి—" అన్నాడు మరిడయ్య.

"నన్నో క్షణం ఆలోచించుకోనీ—" అన్నాడు నాంచారయ్య.

"అంటే మీకు శ్రావణ్ అనే పేరుగల కొడుకున్నా

దన్నమాట....నేనైతే విచిత్ర అబద్ధం చెప్పిందను కున్నాను—" అన్నాడు సుకుమార్.

నాంచారయ్య అతడివంక కోపంగా చూసి—"శ్రావణ్ నాకు తెలుసు. కానీ వాడు నాకు కొడుకు కాదు—" అన్నాడు.

"శ్రావణ్ మీకేమవుతాడో నా కక్కర్లేదు. నాక్కావల సిందతడి వివరాలు. అర్జంటుగా నే నతణ్ణి కలుసుకో వాలి...." అన్నాడు మరిడయ్య.

నాంచారయ్య సుకుమార్‌వంక అదోలా చూసి— "నేను మరిడయ్యతో ప్రైవేటుగా మాట్లాడాలి —" అన్నాడు.

సుకుమార్ వెంటనే వారిద్దరికీ కాస్త దూరంగా వెళ్ళాడు.

"మరిడయ్యా! నిజం చెబుతున్నాను. నాకా శ్రావణ్ గురించేమీ తెలియదు. అంజనం వేసి వాడి వివరాలు తెలు సుకోగలవా నువ్వు?" అన్నాడు మరిడయ్య.

"బాబూ—నాకు సంబంధించని విషయాల్లో నేను జోక్యం చేసుకోకూడదు. ఇలాంటి విషయాల్లో నా పరి మితులు నాకుంటాయి. శ్రావణ్ గురించి తమకు నిజంగా తెలియక పోతే దెయ్యంవల్ల తమకు యే యిబ్బందీ వుండదు. శ్రావణ్ గురించి తమకు నిజంగా తెలిస్తే— తమకు తెలిసిన విషయాన్ని తమకోసమే అంజనం వేసి తెలుసుకోవడం నా అమ్మవారు సహించదు. రెండు విధాలా కూడా నే నంజనం వేయలేను. అందుకే పదే పదే ఆ శ్రావణ్ గురించడుగుతున్నాను. తమకు నిజంగా ఆ శ్రావణ్ యెవరో తెలియకపోతే — యింటికి వెళ్ళి గుండెలమీద చేయేసుకుని హాయిగా నిద్రపొండి—"

అన్నాడు మరిడయ్య.

"నువ్వు చాలా మొండివాడివి—" అన్నాడు నాంచారయ్య.

"బాబూ—నేను భూత ప్రేత పిశాచగణాలతో వ్యవహరిస్తున్నాను. మొండిగా ఉండకపోతే నా ప్రాణాలకే ప్రమాదం. కానీ మీ విషయం వేరు. మీకు తంత్రాలు తెలిసుండచ్చు కానీ మంత్రాలు తెలియవు. అలాంటప్పుడు మొండితనం మీ ప్రాణాలకే ప్రమాదం—" అన్నాడు మరిడయ్య హెచ్చరికగా.

నాంచారయ్య ఓ క్షణం తటపటాయించి—"శ్రావణ్ నాకు తెలుసు—" అన్నాడు.

అప్పుడు స్మశానంలో ఎక్కణ్ణించో నక్కల ఊళ వినిపించింది.

# 8

"ఎవరో కాలింగ్ బెల్ మ్రోగిస్తున్నారండీ—" అంది పార్వతి.

"వెళ్ళి తలుపు తీయి—" అన్నా డాంజనేయులు స్నానాల గదిలోంచీ.

"డోర్ వ్యూలోంచి చూస్తే—ఎవరో కుర్రాడు కనిపిస్తున్నాడు. సన్నగా, పొడుగ్గా బాగున్నాడు...."

"అయితే?"

"తలుపు తీయాలంటే భయంగా ఉందండీ—అసలే అత్యాచారపు రోజులివి—...."

"పార్వతీ - ఇలాంటి కబుర్లు చెప్పేటప్పుడు నీ వయసు నువ్వు మరిచిపోకుండా గుర్తు చేసుకుంటూండాలి...."

"ఏమో-నన్ను చూసిన వాళ్ళంతా నా వయసు పాతి

కంటారు. నాకూ అంతేననిపిస్తుంది - మిమ్మల్ని తల్చు కునేదాకా....''

''సగం స్నానంలో ఉన్నాను. నేనెలా వచ్చేది! నీమీ దేదయినా అత్యాచారం జరిగితే నేను క్షమించి నిన్నేలు కుంటాను కానీ ముందు వెళ్ళి తలుపుతీయ్....'' అన్నా డాంజనేయులు విసుగ్గా.

''అత్యాచారం జరిగితే - మీరు నన్ను క్షమించినా నన్ను నేను క్షమించుకోలేనండీ'' అంది పార్వతి.

''నీలో అంత పాతివ్రత్యమే మండిపోతే - నీ కొడు కీడు పిల్లల్ని చూసినప్పుడల్లా అత్యాచారం చేస్తారేమో నన్న ఆలోచనలే రావు కానీ వెళ్ళి తలుపు తీయి'' అంటూ స్నానాల గదిలోంచి గసిరాడు ఆంజనేయులు.

ఏమనుకుందో పార్వతి వెళ్ళి తలుపు తీసింది.

''నమస్కారమమ్మా!'' అన్నాడొక యువకు డామెను చూస్తూనే రెండు చేతులూ జోడించి.

పార్వతి ముఖం చిట్లించి - ''నేను నీకు అమ్మలా కనిపిస్తున్నానా?'' అనాలనుకుని ఆగిపోయింది.

ఆమె డోర్ వ్యూలోంచి చూసినప్పుడు యువకు డొక్కడే కనిపించాడు కానీ అతడికి కాస్త పక్కగా ఓ యువతి కూడా ఉంది, ముఖం కనిపించకుండా ఆమె ముసుగు ముందుకు లాక్కుంది.

''ఎవరు కావాలి?'' అంది పార్వతి.

''ఇల్లు కావాలి - అద్దెకు'' అన్నాడా యువకుడు.

పార్వతి గుమ్మం పక్కకు తప్పుకుంది. వెంటనే యువకుడు లోపలకు వచ్చాడు. యువతి అతడి ననుస రించింది.

''తలుపు వేసేయండమ్మా!'' అన్నాడా యువకుడు.

"అమ్మా - అమ్మా అంటున్నావు. చూస్తాండు. నీ చేత పార్వతీ అనిపించుకుంటాను" అనుకుంది పార్వతి మనసులో కసిగా. ఆమె తలుపు వేయలేదు.

యువకుడు తనే వెళ్ళి తలుపు వేసివచ్చాడు.

"తలుపెందుకేశావు?" అంది పార్వతి.

"అన్నీ మీకు వివరంగా చెబుతానమ్మా" అన్నాడా యువకుడెంతో వినయంగా.

"ఆ స్తమానూ అమ్మా అమ్మా అనకు. నాకు చిరాకు" అనేసింది పార్వతి ఉండబట్టలేక.

అప్పుడక్కడ ఆంజనేయులు ప్రవేశించాడు. ఆయన్ని చూస్తూనే యువతి ముఖం మీద ముసుగును మరింత కిందకు లాక్కుంది.

యువకు డాయనకు నమస్కరించి—"ఆంజనేయులు గారు మీరే ననుకుంటాను—" అన్నాడు వినయంగా.

ఆంజనేయులు ముఖం చిట్లించి—"నీకెలా తెలుసు?" అన్నాడు.

"ఇంటి బయట బోర్డు చూశాను. లోపల మీ ముఖం చూశాను. ఆ కళే చెబుతుంది—మీరే ఈ యింటి యజమాని అని—"

"ఊఁ సరే — యెవరు మీరు?" అన్నాడాంజనేయులు!

"ఇల్లద్దెక్కావాలిట—" అంది పార్వతి.

"అద్దెక్కావాలా?" అంటూ ఆంజనేయులు వారివంక అదోలా చూశాడు. ఆయన పెదాల వెనుక సంతోషం దాగీదాగనట్లు కనబడుతోంది.

"అవునండి—మీరు కాదనకూడదు—" అన్నాడా యువకుడు.

ఆంజనేయులు భార్య వంక చూశాడు. సంతోషం దాచుకోవడం ఆమెకూ కష్టంగానే ఉన్నదని ఆయనకర్థ మయింది.

కొత్తగా పెళ్ళయిన దంపతుల్లా కనబడుతున్నారు వాళ్ళు. అలాంటి వాళ్ళు తమింట్లో అద్దెకుండడం అపూర్వమే అవుతుందని ఆంజనేయులికి తెలుసు.

"మా గురించి తెలుసా నీకు?" అన్నాడాయన.

"అంటే?" అన్నాడు యువకుడు.

"ఇంట్లో నేను, పార్వతి మాత్రమే ఉన్నాం. మా అబ్బాయికి బొంబాయిలో ఉద్యోగం. అల్లుడికి ఢిల్లీలో ఉద్యోగం. వాళ్ళను చూడ్డానికి మేము వెళ్ళాలితప్ప వాళ్ళిక్కడకు రారు. అందువల్ల పిల్లలపట్ల ప్రేమ మాలోనే ఉండిపోయి పొంగి పొరలిపోతూండడం సహజం. ఆ ప్రేమను మేము మా యింట్లో అద్దెకుండే వాళ్ళమీద చూపిస్తూంటాం. అది భరించలేక యెందరో వచ్చిన నెలిరోజుల్లోనే యిల్లు కాళీచేసి పోతున్నారు. అందుకే ముందుగా హెచ్చరిస్తున్నాను. మీరు మా కుటుం బంలోని మనుషుల్లా కలిసిపోవాలి. అలాగైతేనే ఉండండి. అంతేకాదు. ఓ నెల్లాళ్ళుండి పోయేవాళ్ళు మాకక్కర్లేదు. కాస్త చనువై వెంటనే వెళ్ళిపోతే మాకు కన్న ఓడ్డల్ని దూరం చేసుకున్నట్లే యెంతో బాధగా ఉంటుంది—" అన్నాడాంజనేయులు.

"కన్నబిడ్డలంటే నాకీ అమ్మాయి కస్తురితో సమానం. నువ్వాయనకు కొడుకుతో సమానం." అంటూ పార్వతి భాష్యం చెప్పి స్పష్టం చేసింది.

"నేనూ చాలా కష్టాల్లో ఉన్నాం. మీవంటి వారి అభి మానం నాక్కావాలి...." అన్నాడా యువకుడు.

"కష్టాలంటున్నావు. అద్దె డబ్బు లిచ్చుకోగలవాః కన్న బిడ్డలంటే అద్దివ్వకూడదని కాదు—" అన్నాడాంజ నేయు లనుమానంగా

"డబ్బుకు లోటులేదు నాకు. కానీ కొందరు శత్రువు లున్నారు నాకు...."

"శత్రువులాః" అంది పార్వతి ఆశ్చర్యంగా.

"మాది ప్రేమ వివాహం. నాకేమో అయినవారెవ్వరూ లేరు. నా భార్య కలవారింటి ఆడపడుచు. నేనెవరో వారికి తెలియదు. నా భార్యద్వారా నా పేరు మాత్రం విని ఉన్నారు. ఈ పెళ్ళికి తనవాళ్ళొప్పుకోరని నా భార్యకు తెలుసుః అందుకే నాతో రహస్యంగా వచ్చేసింది. మే మిద్దరం పెళ్ళి చేసుకున్నాం. అయితే మమ్మల్నెవరో అనుసరిస్తూ ఓ కంట కనిపెడుతున్నారని నా కనుమానంగా ఉంది. నా భార్య నపహరించడానికి-నా ప్రాణాలు తీయ డానికీ ప్రయత్నాలు జరగొచ్చు. మీ యింట్లో మా ఉనికి రహస్యంగా వుంచాలని కోరుతున్నాను. అంటే కొంత కాలంపాటు మే మజ్ఞాతంగా ఉంటాం. అందుకు మీరు సహకరించాలి-" అన్నాడాయువకుడు. అతడి గొంతులో కలవరముంది.

"సహకరించడమంటే ఎలాః"

"ఇంటికెవరొచ్చినా మా వివరాలు చెప్పకూడదు. ఆ వచ్చినవాళ్ళు జిత్తులమారులై ఉంటారు. ఒకోసారి పోలీసుల వేషాల్లో వచ్చినా రావచ్చు. మీరు మాత్రం యెవరికీ నా భార్య ముఖం కనపడనివ్వకూడదు... నేను బైటకు వెళ్ళినప్పుడెవరైనా వస్తే—ఆమె కూడా ఇంట్లో లేదనే చెప్పాలి...."

"నీ అత్తారి కోపం నీమీదే కానీ నీ భార్యమీదకాదుగా.

ఆమెకే ప్రమాదమూ ఉండదుగా....." అన్నాడాంజ నేయులు.

"ప్రమాదమామెకూ ఉంది. ఓ అమ్మాయి నన్ను ప్రేమించింది. నేనామెను ప్రేమించలేదు. నన్ను లొంగ దీసుకునేందుకెన్నో 'విఫలయత్నాలు చేసింది. నేను వేరే అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు తెలిసి నన్ను సుఖపడ నివ్వనని ప్రతిజ్ఞ పట్టింది. ఆమె శత్రుత్వం—నా మీద కాదు—నా భార్యపైన...."

"అంటే రెండుపక్షాలవాళ్ళు మీ యిద్దరిమీదా పగబట్టా రన్నమాట—చాలా తమాషాగా ఉంది" అంది పార్వతి.

"తమాషా వినేవాళ్ళకే-అనుభవించేవాళ్ళకి కాదు...."

"నిజమే-కానీ వీళ్ళందర్నించీ నువ్వెలా తప్పించు కుంటావు?"

"నా భార్య తలిదండ్రులకు నేనెలాగుంటానో తెలి యదు. అందువల్ల నేను ధైర్యంగా బైట తిరగ్గలను. కానీ విచిత్రకు నేనెలాగుంటానో తెలుసు. నాద్వారా నా భార్య ఆచూకీ కనిపెట్టి నేను లేనప్పుడిక్కడికి వస్తుంది. అప్పుడే మీరు నా భార్యను రక్షించాల్సొంటుంది."

"విచిత్ర ఎవరు?"

"నన్ను ప్రేమించిన అమ్మాయి...."

"నిజంచెప్పు నువ్వామెను మోసంచేయలేదూ?"

"నన్ను చూస్తే మీకలా అనిపిస్తోందా?" ఎదురు ప్రశ్న వేశాడాయువకుడు.

ఆంజనేయులతణ్ణి చూశాడు.

"కుర్రాడు బాగున్నాడు. మోసం చేయాలనుకుంటే ఆడపిల్లలు వలలో పడిపోతారు." అనిపించిందాయనకు.

మోసంచేసేవాళ్ళ మోసం ముఖంలోనే కన్పించిపోతే – అమాయకులు మోసపోవడమెందుకు జరుగుతుంది?

"చెప్పండి-నేనలా కన్పిస్తున్నానా?" అన్నా డా యువకుడు మళ్ళీ.

"నువ్వు చెప్పు పార్వతీ!" అన్నాడాంజనేయులు.

"బాగుంది వరస-" అంది అంతవరకూ అతడినే శ్రద్ధగా గమనిస్తున్న పార్వతి. భర్త ప్రశ్న అడగ్గానే ఆమె పైటకొంగు భుజంచుట్టూ కప్పుకుంది.

"పద-యిల్లు చూద్దువుగాని-" అన్నాడాంజనేయులు.

ఇల్లు చూడ్డం అయింది.

రెండు గదుల వాటా అది. కిచెన్ బాత్రూం వేరే ఉన్నాయి. గదులన్నీ విశాలంగా ఉన్నాయి.

"ఫర్నిచర్ కూడా మాదే! మరో నూటయాభై మాసాయ లదనంగా యిస్తే!" అన్నాడాంజనేయులు.

"ఎప్పుడైనా పిల్లలొస్తారేమోనని - ఈ వాటా రెడీగా ఉంచుతాం కానీ వాళ్ళు రారు—" అంది పార్వతి.

"అద్దె రెండువందలయాభై . ఫర్నిచర్ కు నూటయాభై అంటే నెలకు నాలుగువందలు. మూడు వందలయాభై అయితే న్యాయం—" అన్నాడా యువకుడు.

ఎక్కువ బేరం అవసరం లేకుండానే ఆంజనేయులందు కంగీకరించాడు.

"తనిక్కడే ఉంటుంది. నేను వెళ్ళి సామానుతీసుకొస్తాను-" అన్నాడాయువకుడు.

"మీ పేర్లు చెప్పలేదు—" అన్నాడాంజనేయులు.

"ఈమె నా భార్య. పేరు సంధ్య...."

"ఊఁ"

"నా పేరు శ్రావణ్—" అన్నాతతడు.

# 9

"వెళ్ళివారు సాయంత్రం ఆరింటికొస్తారు. నువ్వు కాలేజీకి వెళ్ళిరావచ్చు." అంది వందన తల్లి.

"ఈరోజు నాకు తలనొప్పిగా ఉంది. నేను కాలేజీకి వెళ్ళను." అంది వందన.

"నీ యిష్టం. అయినా నేను వెళ్ళమంటే వెడతావా. మానమంటే మానతావా. పిల్లలు పెద్దల మాటలు వినే రోజులు కావివి." అనుకుంటూ వందన తల్లి తన పనిలోకి వెళ్ళిపోయింది.

వందన పుస్తకం ముందేసుకుని కుర్చీలో కూర్చుంది.

ఆమెకు పాఠం ఎక్కడంలేదు.

తన్ను హెచ్చరించిన యువకుడామె మనసులో మెదుల్తున్నాడు.

ఎవరతడు? తననెందుకు హెచ్చరించాడు? అసలతడికి తనపై ఆసక్తి కలగడానికి కారణమేమిటి?

వద్దనుకున్నా వందన హృదయంలో ఆ యువకుడికి స్థానం లభించింది. నానాటికీ ఆస్థానం సుస్థిరమవుతోంది.

అతడికీ తనకూ ముమ్ముందింకా పరిచయం పెరిగి బల పడుతుందని ఆమెకనిపిస్తుంది.

అలా జరిగితే బాగుండుననీ ఆమెకు తోస్తుంది.

తనకు రానున్న ఆపద స్వరూపస్వభావాల గురించి ఆమెకు తెలియదు.

అయితే ఆమె ఆలోచనల్లో ఆపదలేదు. ఆపదకు చోటులేకుండా ఆమె మనసునంతా ఆ యువకుడే ఆక్ర మించేశాడు.

అలా ఆలోచిస్తూడంగానే ఆమెకు తల్లి కేక వినిపించింది.

"వందూ—నీకోసం రాధొచ్చింది"

వందన ఆలోచనల్లోంచి బైటపడింది. వెంటనే పుస్తకం మూసింది. ఆ వెంటనే డ్రాయింగ్ రూంలోకి పరుగెట్టింది.

రాధ ఆమెను చూసి — "హాయ్" అని "వరస చూస్తూంటే నువ్వింకా స్నానం చేసినట్లులేదు" అంది నవ్వుతూ.

రాధమాత్రం అప్పుడే విరిసిన పువ్వులాగుంది.

"లేదు" అంది వందన.

"కొంపదీసి నువ్వు నిజంగానే ఈరోజు కాలేజీకి రావడం లేదేమిటి?" అంది రాధ.

"నిజంగానే అంటే?" అంది రాధ ఆశ్చర్యంగా.

"ఈరోజు నీకు పెళ్ళిచూపులు గదా—రావని అంది ఊర్మిళ. పెళ్ళిచూపులు సాయంత్రమైతే— పొద్దుట్నించీ మన్ని చూడ్డం మానేస్తుందా అని నేనన్నాను" అంది రాధ.

"నేను రావడంలేదే" అంది వందన.

"రానంటే కుదరదు. వచ్చి తీరాలి" అంది రాధ.

"ఎందుకు?"

"ఈరోజు డిబేటింగ్ కాంపిటీషనుంది. ఎదురుగా నువ్వుంటే నాకు వెయ్యేనుగుల బలం. నువ్వు రాకపోతే నేను ఫినిష్...." అంది రాధ

"సారీ" అంది వందన.

"సారీ అనేయకు...."

"నాకు తలనొప్పిగా ఉంది...."

"ఉన్నాసరే — రానంటే నామీదొట్టే—ఈ ఒక్క రోజుకూ...."

"రాలేనంటూంటే నీ మొండితనమేమిటే?" అంది

వందన విసుగ్గా.

"తలవొప్పి మినహాయించి మరో కారణం చెబితే ఒప్పుకుంటాను. లేకుంటే నాతో రావాల్సిందే...."

వందనకు చెప్పడానికి మరే కారణమూ తోచలేదు.

ఆ యువకుడి హెచ్చరిక మాత్రం ఆమె చెవుల్లో గింగురుమంటోంది.

ఎలాంటి పరిస్థితుల్లోనూ యిల్లు కదలొద్దన్నాడతడు. ఎందుకు?

ఇల్లు కదిలితే ఏం జరుగుతుంది?

మరీ ప్రమాద మేర్పడితే మిస్ మిస్టరీని తల్చుకో మన్నాడు. ఎవరా మిస్ మిస్టరీ?

తానింట్లోనే ఉండిపోతే ఏ ప్రమాదమూ జరుగదు. ఎవరో వరుడొచ్చి తన్ను చూసుకుని వెడతాడు. నచ్చితే తామిద్దరకూ పెళ్ళైపోతుంది. అక్కణ్ణించి....

వంట....పిల్లలు....భర్తసుఖం....

తను చదువుకున్నదంతా వృధా....వృధా....

ఇప్పుడిల్లు కదిలితే....

ఏదో ప్రమాదం జరుగుతుంది. ఆ ప్రమాదం నుంచి తన్ను మిస్ మిస్టరీ రక్షిస్తుంది. తర్వాత....

తనూ ఆ యువకుడూ కలుసుకుంటారు.

అతడు బాగున్నాడు. తనకు నచ్చాడు.

తన జీవితం మరోవిధంగా నడుస్తుంది.

"నువ్వు కాలేజీకి వచ్చి తీరాలి" అంది రాధ.

"వస్తాన్లేవే బాబూ" అంది వందన.

"అయితే సరిగ్గా గంటలో వస్తాను. సిద్ధంగా ఉండు" అని వెళ్ళిపోయింది రాధ. ఆమె యిల్లావీధిలోనే ఉంది.

"అమ్మా! నేను కాలేజీకి వెడుతున్నాను. వంటవు

తోంది కదూ?" అంటూ కేకపెట్టింది వందన తల్లికి విన పడేలా.

*　　　*　　　*

కాలేజీలో మొదటి పీరియడ్ అయింది. వెంటనే రెండో పీరియడ్ మొదలయింది కానీ రాధ క్లాసులో లేను.

"ఏమయింది చెప్మా?" అనుకుంది వందన. ఆలోచన లతో ఆమెకు పాఠంకూడా ఎక్కలేదు.

"నన్ను రమ్మని బలవంతపెట్టి తను మాయమవు తుందా? ఉండు దీని పని చెబుతా" అనుకుందామె.

రెండో పీరియడ్ అయ్యాక రాధ క్లాసుకు వచ్చింది.

"ఎక్కడికెళ్ళావే?" అంది వందన.

రాధ ఆమెకో వందరూపాయల నోటిచ్చి—"ఇది నీ వాటా. తీసుకో" అంది.

"వాటా ఏమిటి?"

"నిన్న సినిమా హాలగ్గిర నాకో అమ్మాయి తగిలింది. పేరు లీల. మన కాలేజీలోనే చదువుతోందిట. మాటల మధ్యలో స్నేహం ప్రసక్తి వచ్చింది. ఆ పిల్ల వెంటనే మగాళ్ళలో ఉండే స్నేహభావం ఆడపిల్లల కుండదనీ — పెళ్ళైనా మగాళ్ళు స్నేహం కొనసాగిస్తారనీ—ఆడాళ్ళు మాత్రం పూర్తిగా మొగుడికే కట్టుబడిపోయి అయినవాళ్ళని కూడా మర్చిపోతారనీ అంది. అప్పుడు నేను మన స్నేహం గురించి చెప్పాను. దానికి లీల—"ఆ అమ్మాయి పెళ్ళిచూపుల రోజున కాలేజీకి రప్పించు చూద్దాం. తర్వాత స్నేహంగురించి మాట్లాడుకోవచ్చు" అంది. రెండు వందల రూపాయలు పందెం వేసుకున్నాం. నేను నెగ్గా నుగా—పందెం డబ్బు తెచ్చుకుందుకు ప్రిన్సిపాలాఫీసుకు వెళ్ళాను. అది మా సంకేత స్థలం" అంది రాధ.

వందన ఆశ్చర్యంగా—"అయితే నీకీ రోజు డిబేట్ లేదా?" అంది.

"లేదు...."

"నువ్వు నన్ను చాలా మోసం చేశావు...."

"ఇందులో మోసమేముందే—నీ వాటా వందా నీకిచ్చేశానుగా...."

"కాదు—డబ్బుకోసం నన్నో పెద్ద ప్రమాదంలో పడేశావు...."

"ప్రమాదమా—అదేమిటి?" అంది రాధ.

వందన చెప్పాలనే అనుకుంది కానీ చెప్పలేదు.

ఈలోగా మూడో పీరియడ్ స్టార్టయింది. అదయ్యాక "ఇంతకీ ఆ లీలెవరే?" అంది వందన.

"ఏమో—నిన్ననే మొదటిసారి చూశాను" అంది రాధ.

"వంద రూపాయలు సంపాదించి పెట్టిందిగా. ఓసారి నేనూ దానిముఖం చూస్తాను" అంది వందన.

"తను సెకండ్ బీయస్సీ చదువుతోందిట. బీసెక్షనని చెప్పింది...."

"అయితే ఆ సెక్షన్‌లోనే కనుక్కుందాం—" అంది వందన.

ఇంటర్వల్లో యిద్దరూ సుమతిని కలుసుకున్నారు. సుమతి సెకండ్ బీయస్సీ చదువుతోంది. ఆమె సెక్షన్ బీ. ఆమె రాధకు స్నేహితురాలు.

"మా క్లాసులో లీల పేరుగల వారెవ్వరూ లేరు—" అంది సుమతి.

రాధ తెల్లబోయింది. సుమతికి జరిగినదేమీ చెప్పలేదు.

వందన గుండెల్లో అదురు ప్రారంభమయింది. ఇల్లు

కదలొద్దన్న ఆ యువకుడి హెచ్చరిక మళ్ళీ చెవుల్లో గింగురుమనసాగింది.

ఇద్దరూ సుమతి దగ్గర్నుంచి వచ్చేశారు.

"పందెం వేసింది. డబ్బుకూడా యిచ్చేసింది. పెన్షన్ విషయంలో అబద్ధ మెందుకు చెప్పిందంటావు?" అంది రాధ. "నా అనుమానం ఆమె మన కాలేజీ స్టూడెంటు కాదని...."

"ఎవరై నప్పటికీ నన్నీరోజు కాలేజీ కొచ్చేలా చేయడం ఆమె ధ్యేయం. అది సాధించింది...."

"నువ్వు కాలేజీకొ స్తే ఆమెకేం లాభం?"

వందన ఏదో అనపోతూండగా అక్కడికి నీలిమ వచ్చింది.

"ఏమిటి విశేషం?—ఎప్పుడూ నన్నొదిలేదానివి కాదు. ఈరోజు నన్ను తప్పించుకుని తిరుగుతున్నావు" అందామె వందనతో.

"ఎప్పుడూ వాళ్ళన్నయ్య స్కూటరుమీద వెళ్ళే రాధ. ఈరోజు సెలవు పెట్టాలనుకున్న నన్ను బలవంతంగా కాలేజీకి రప్పించడం కోసం—నాతో కలిసి నడిచి వచ్చింది. అందుకని దానితో తిరుగుతున్నాను. కానీ సాయంత్రం తిరిగి వెళ్ళేటప్పుడు రాధతోపాటు నువ్వూ నాకు సాయం రావాలి—ఇంటివాకా!"

నీలిమ నవ్వి "సాధ్యంకాదు" అంది.

"ఏం—కోపమా?"

"కాదు. నేను కాలేజీ అయ్యేదాకా ఇక్కడే ఉంటా నుగా...."

"నేనూ ఉంటాను...."

"అది చెప్పడానికే నేనిక్కడి కొచ్చాను. ఇప్పుడే మీ

యింటి దగ్గర్నుంచి ఫోనొచ్చిందని ప్రిన్సిపాల్ నాతో చెప్పింది” అంటూ స్వరం తగ్గించి “పెళ్ళివారు సాయంత్రం కాకుండా మధ్యాహ్నం నాలుగింటికే వస్తున్నారట. నిన్ను వెంటనే బయల్దేరి రమ్మన్నారు. అర్థమయిందా?” అందామె.

వందన తెల్లబోయి “నిజమా?” అంది.

“కావాలంటే ప్రిన్సిపాల్ నడుగుదాం పద” అంది నీలిమ.

“వద్దులే” అని “నాకు సాయంగా మీరెవరైనా వస్తారా?” అనడిగింది వందన—బ్రతిమాలుతున్నట్లుందామె స్వరం.

“సాయానికిదేమైనా అడివా? ఇక్కణ్ణించి నీ యింటి దాకా జనసంచార ముంటుంది” అంది నీలిమ.

“నువ్వొస్తావా రాధా?”

“నీకైతే పెళ్ళిచూపులు. అందుకని నేను కాలేజీ ఎగ్గొడితే మా యింట్లో నువ్వుతారు, తిడతారు....” అంది రాధ.

వందన ముఖంలో భయం....

“ఏమిటే—అప్పుడే పెళ్ళి చూపులు మొదలైనట్లు బెదురు చూపులు చూసేస్తున్నావు....” అంది నీలిమ.

“నాకు సాయం రండే!” అంది వందన.

నీలిమ, రాధ కలిసి ఆమె భయాన్ని దుయ్యబట్టారు. చివరకు వందనకు పౌరుషం వచ్చి అక్కణ్ణించి బయల్దేరి వెళ్ళిపోయింది.

“పాపం రానంటే బలవంతపెట్టి తీసుకొచ్చాను. ఇప్పు డర్థాంతరంగా వెళ్ళిపోవాల్సొచ్చింది....” అంటూ జాలి పడింది రాధ.

"జాలిపడకు. వందరూపాయలు సంపాదించుకుందిగా"

"వందరూపాయలేమిటి?"

"ఓ గంటక్రితం నేనో అమ్మాయితో పందెం కట్టాను. వందన నొక్కదాన్నీ ఒంటరిగా ఇంటికి పంపితే రెండొంద లిస్తానందామె. పందెం డబ్బుకూడా అడ్వాన్సుగా ఇచ్చేసి ఓడిపోతే తనకు నాలుగొందలివ్వాలంది...."

"ఎందుకూ ఆ పందెం?" అంది రాధ.

"ఎంత చదువుకున్నా ఆడపిల్లల్లో పిరికితనం పోవడం లేదంటుంది. అందుకు వందననే ఉదాహరణగా కూడా యిచ్చింది. నేను వందన తరఫున వాదించాను ...."

"ఎవరా అమ్మాయి?"

"ఎవరో నాకూ తెరియదు. తన పేరు లీల అని చెప్పింది —"

రాధ ఉలిక్కిపడి—"లీలా — యిప్పుడెక్కడుంది?" అంది.

"ప్రిన్సిపాలాఫీసు దగ్గర నా కోసం యెదురుచూస్తూం టుంది...."

"లీలకు వందన పిరికిదన్న అభిప్రాయ మెందు కేర్ప డింది?"

"ఆమెకు వందన బాగా తెలుసుట. పెళ్ళిచూపుల పేరుతో ఫోన్ వచ్చిందని చెప్పమన్న అయిడియా కూడా ఆమే నా కిచ్చింది— ...."

"చిత్రంగా ఉంది. పద—నేనూ ఆ లీలను చూస్తాను" అంది రాధ. తనను సినిమాహాలువద్ద కలిసిన లీలా, ఈమే ఒక్కరేనని రాధ కర్థమయింది. ఆ లీల తమతో యిలా ఎందుకాడుకుంటోందో—తన డబ్బు నెందుకిలా వృథా చేసుకుంటోందో తెలుసుకోవాలనుకుంది రాధ.

ఇద్దరూ ప్రిన్సిపాలాఫీసు దగ్గిరకు వెళ్ళారు.

అక్కడ లీల లేదు.

"ఫరవాలేదులే — తనిక్కడ లేక్కపోతే క్లాసుకు వచ్చి కలుసుకోమంది లీల—" అంది నీలిమ నమ్మకంగా.

"సెకండ్ బీయస్సీ—బీ సెక్షనేనా?" అంది రాధ వెంటనే.

"నీకెలా తెలుసు?" అంది నీలిమ ఆశ్చర్యంగా.

"అంటే నాకు తెలిసిందే నీకూ తెలుసన్నమాట—" అంటూ నిట్టూర్చింది.

జరిగింది రాధ నోట విని మరింత ఆశ్చర్యపడి— "ఇదంతా ఏమిటంటావ్?" అంది.

"ఏమో—తనకేదో ప్రమాదం జరుగుతుందని వందన భయపడుతోంది. ఆ భయంలో ఎంతో కొంత నిజం లేక పోలేదనిపిస్తోంది...." అంది రాధ!

"ఇప్పుడేం చేద్దాం? వందన యింటికి ఫోన్ చేసి తను బయల్దేరి వస్తున్నట్లు చెబుదామా?"

"వాళ్ళింట్లో ఫోన్ లేదుగా...."

నీలిమ ఉలిక్కిపడి—"అవును. కానీ వాళ్ళింట్లో ఫోన్ లేదని తెలిసీ—యింటి నుంచి ఫోనొచ్చిందనగానే నమ్మేసిందేమిటి?" అంది.

"ఫోన్ చేయడాని కింట్లోనే ఉండా లేమిటి?" అంది రాధ.

"అవున్లే—మరి మనమిప్పుడేం చేద్దాం?"

"చేయడాని కేముంది? సాయంత్రం ఇంటి కెళ్ళేటప్పుడోసారి వందనను పలకరించి వెడదాం—" అంది రాధ.

ఎందుకో నీలిమ కిప్పుడు కొద్దిరోజులుగా వందన నను

సరించి వెడుతున్న యువకుడు గుర్తుకొచ్చాడు. వద్దన్నా ఆమె మనసు కీడును శంకించసాగింది.

* * *

వందన రోడ్డుమీద కొచ్చింది.

"రిక్షా కావాలా అమ్మా?" అన్నాడో రిక్షావాడు.

వందన రిక్షాలో వెళ్ళాలనుకుంది. బేరమాడదామని వాడివంక చూసింది.

గళ్ళ లుంగీ—అడ్డచారల బనియన్—మెలితిరిగిన మీసాలు—ఎర్రగా మెరుస్తున్న కళ్ళు—

వాడు అసలుసిసలు గూండాలా ఉన్నాడు.

తనకోసమే వాడి నెవరైనా పంపారేమో? వాడు తనని రిక్షా ఎక్కించుకుని యే సందులోకో తీసుకునిపోయి....?!

"వద్దు—" అంటూ ముందడుగు వేసిందామె.

"మీ కెంత తోస్తే అంతిచ్చి ఎక్కండమ్మా—ఇంత దాకా బోణీ కాలేదు—" అన్నాడు వాడు ప్రతిమాలు తున్నట్లు.

వందన అనుమానం మరింత పెరిగింది.

"వద్దు—" అంటూ ఆమె వడి వడిగా అడుగులు వేసింది. కొంతదూరం వెళ్ళి ఆ రిక్షావాడు కానీ తన్ననుసరించి వస్తున్నాడా అని వెనక్కి చూసింది. వాడక్కడే ఆగిపోవటం చూసి—"హమ్మయ్య—" అని నిట్టూర్చింది.

రిక్షా ఎక్కడం క్షేమం కాదు. అలాగని నడిచి వెళ్ళడమూ మంచిది కాదు. అందుకని బస్సులో వెళ్ళాలనుకుందామె.

కాలేజీ నుంచి వాళ్ళిల్లు మూడున్నర కిలో మీటర్లుంటుంది.

బస్సుస్టాపు పక్కసందులో ఉంది. అక్కడ బస్సె క్కితే—యింటికి కిలోమీటరు దూరంలో దింపేస్తుంది బస్సు.

వందన సందు తిరగబోతుండగా ఆమె పక్కన ఓ కారాగింది.

"హలో—మిస్ వందనా!" అన్న పిలుపా కార్లోంచీ వచ్చింది.

వందన అటు చూసేసరికి కార్లోంచీ ఓ యువకుడు దిగాడు.

ఆమె అతణ్ణి గుర్తుపట్టింది.

"ఇంటికి వెడుతున్నారా? నడిచివెళ్ళడం క్షేమం కాదు. రండి—లిఫ్టిస్తాను—...." అన్నాడతడు చనువుగా, మర్యాదగా.

ఆమె మొహమాట పడినా ఎంతో సమయం వృధా చేయలేదు. ఎలా వెళ్ళాలో అతడికి చెప్పబోతూంటే - "మీ యిల్లు నాకు తెలుసు...." అన్నాడతడు.

వందన కారెక్కింది.

అతడు కారు డ్రైవ్ చేస్తూంటే యెంతో హుందాగా ఉన్నాడు.

"అతడే తన వరుడైతే ఎంత బాగుండును?" అనిపించిందామెకు.

అత డాట్టే మాట్లాడడం లేదు. కారు తూనీగలా జారిపోతోంది.

వందన మన సెక్కడెక్కడో విహరిస్తోంది. ఇప్పుడామె మనసులో భయంలేదు. ఆ యువకుణ్ణి చూడగానే తన కెక్కడ లేని రక్షణా లభించినట్లే ఉన్నదామెకు.

ఉన్నట్లుండి కారు సడెన్ బ్రేకుతో ఆగింది.

వందన ఉలిక్కిపడింది.

రోడ్డు కడ్డంగా యిద్దరు మనుషులు....

ఒక యువకుడు.... ఒక యువతి....

కారాగగానే డ్రైవింగ్ సీట్లోని యువకుణ్ణి సమీపించి- "నా తమ్ముడు హాస్పిటల్లో ఉన్నాడు. అర్జంటుగా రక్తం కావాలి నన్ను హాస్పిటల్‌కు చేర్చండి—" అన్నాడు కారాపిన యువకుడు.

అతడు మాట్లాడుతూంటే ఆ యువతి కళ్ళొత్తుకుంటోంది.

"ఎక్కండి—" అన్నాడు డ్రైవింగ్ సీట్లోని యువకుడు.

యువకు డతడిపక్కనే కూర్చున్నాడు. యువతి వెనుక సీట్లో వందన పక్కన కూర్చుంది.

కారు స్టార్టయింది.

అప్పుడు....

"అటుకాదు.... యిటు...." అన్నాడు కారెక్కిన యువకుడు. అతడి చేతిలో రివాల్వరుంది. అది డ్రైవింగ్ సీట్లో యువకుడికి గురిపెట్టబడి ఉంది.

వందన భయపడి ఏదో అనబోయింది. అంతలోనే ఆమె నడుముకు చల్లగా తగిలింది రివాల్వర్.

"అరవకు" అంది వందన పక్క యువతి.

కాసేపట్లో కారు కుమారస్వామి భవనం ముందాగింది.

"దిగు—" అంది వందన పక్కనున్న యువతి.

వందన కారు దిగింది.

"స్టార్ట్—" అన్నాడు రివాల్వర్ యువకుడు.

"అయాం సారీ మేడమ్—ఇల్లు కదలొద్దని చెప్పాను. కదిలారు.... నేను మీకు సాయం చేయాలనుకున్నాను. అస

# అపరాధ పరిశోధన పోటీ-229

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో౦. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-8-'87 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు అక్టోబరు'87 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. భారతీయ ఉత్సవాలు ఇప్పుడు యీ దేశంలో జరుగుతున్నాయి—? (రష్యా. ఫ్రాన్సు)
2. ఇవంటే పిల్లలకు చాలా ఇష్టం—? (ఆటలు, పాటలు)
3. ప్రధానికి ఇతను వ్రాసిన లేఖలు ప్రజలలో గొప్ప సంచలనం కలిగించాయి—? (జైల్‌సింగ్, జెఠ్మలానీ)
4. ఈ జిల్లాలో నక్సలైట్ల కార్యక్రమాలు మళ్ళీ ముమ్మరమైనాయి—? (నిజామాబాద్, కరీంనగర్)
5. ఇటీవల రాష్ట్రంలో వీటికి ఎన్నికలు జరిగాయి—? (సహకార సంఘాలకు, పంచాయితీలకు)

హోయణ్ణయిపోయాను....'' అన్నాడు డ్రైవింగ్ సీట్లోని యువకుడు.

వందనకంతా అయోమయంగా ఉంది.

కారక్కణ్ణించి వెళ్ళిపోయింది. కొంతదూరం వెళ్ళేక-

''వెల్‌డన్'' అన్నాడు రివాల్వర్ యువకుడు

డ్రైవింగ్ సీట్లో యువకుడు విజయసూచకంగా నవ్వాడు.

* * *

అందమైన ఆ గదిమధ్యలో గుండ్రటి మెత్తటి పరుపుంది. పరుపు చుట్టూ ఆరుగురు యువకులున్నారు. వంటికి అతికినట్లున్న నల్లటి పాంటు, తెల్లటి చొక్కా ధరించి వాళ్ళు గ్రీకు శిల్పాల్లా ఉన్నారు.

వాళ్ళకు కాస్త దూరంలో ఓ సోఫా—ఆ సోఫాలో కుమారస్వామి!

కుమారస్వామి పక్కనే నిలబడి ఉన్నాడు కెమెరామన్ శేషాద్రి. అతడి చేతిలో వీడియో కెమెరా ఉంది.

శేషాద్రి పక్కన ఉన్నాడు కొండల్రావు.

''హీరోయినింకా రాలేదేం?'' అన్నాడు కుమారస్వామి విసుగ్గా.

''ఇంకా రెండు నిముషాలు టయిముందండి—'' అన్నాడు కొండల్రావు వినయంగా.

''ఒంటిగంటకల్లా కాలేజీ వదిలిన పిల్ల నిక్కడికి తీసుకురావడానికి గంటన్నరా?'' అన్నాడు కుమారస్వామి అసహనంగా.

''మరి హీరోయిన్‌కి మేకప్ కావాలి కదండీ'' అన్నాడు కొండల్రావు.

కుమారస్వామి ఓసారి లేచి నిలబడి మళ్ళీ కూర్చు

# వెలువడింది!

ప్రతి మనిషి గుండె తలుపులు ఓర వాకిలిగా తెరిచే ఉంటాయి, ఎవరి పాదాల సవ్వడి కోసమో ఎదురు చూస్తున్నట్లు!

పుస్తకం మూసిన తరువాత గూడా మీ గుండెల్లో సవ్వడి చేసే నవల —

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి

## చీకటిలో చిరుదీపం

వెల : రు. 25

నేడే అడ్వాన్సుతో పాటు మీ ఆర్డర్సు పంపండి. పోస్టు ఖర్చులు పూర్తిగా మీరే భరించుకోవలెను.

ఫోన్ నెం : 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ-520 002.


APANA 13

న్నాడు.

గదిలో నిశ్శబ్దం....

కుమారస్వామి మళ్ళీ లేవబోతూండగా తలుపు తెరుచుకుంది.

ఎవరో తోసినట్లుగా ఓ యువతి లోపలకు వచ్చింది. ఆ వెంటనే తలుపులు మూసుకున్నాయి.

"ఆ అమ్మాయే వందనను!" అన్నాడు కొండల్రావు.

కుమారస్వామి ఆమెను చూశాడు.

నీలిరంగు పట్టుచీర — పూలు కుట్టిన బారెడు జడ — ముందుగా అతడి నాకర్షించాయి.

వందన బెదురు కళ్ళతో చుట్టూ చూస్తోంది.

"కడిగిన ముత్యంలా ఉంది పిల్ల—" అన్నాడు కుమారస్వామి.

ఆ మాటలు వందన వింది.

తానేదో ప్రమాదకరమైన వాతావరణంలో ప్రవేశించినట్లామె కర్థమైంది. జరుగనున్నది చూచాయగా అర్థమైనప్పటికీ— ఊహించుకుందుకామె భయపడుతోంది.

"ఇలారా —" అన్నాడు కుమారస్వామి.

వందన తటపటాయిస్తూనే అతడి ముందుకు వచ్చింది.

"బాగున్నావు —" అన్నాడతడామెను గుచ్చి గుచ్చి చూస్తూ.

"ఎవరు మీరు?" అంది వందన ధైర్యం తెచ్చుకుని.

కుమారస్వామి తమాషాగా నవ్వి — "ముందు ముందు నేనెవరో చెప్పకుండానే తెలుస్తుందిలే—" అన్నాడు.

"నన్నెందు కిక్కడికి తీసుకొచ్చారు?" అంది వందన మరింత ధైర్యంగా.

"నీకీ రోజు పెళ్ళిచూపులు కదా—అందుకే ఇక్కడికి

# "హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జులై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించ నవసరం లేదు.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియ జేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా మరియు రెండేసి నెలలకు V.P. ద్వారా పత్రికలు తెప్పించు కునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెల కానెల రు. 19-60 లు, రెండేసి నెలలకు రు. 30/-లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం ఏది కావలసినా మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

**హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!**

తీసుకొచ్చి అలంకరణ చేయించాను...."

"ఎందుకు?" అంది వందన.

"నేను చెప్పేది శ్రద్ధగా విను—" అన్నాడు కుమార స్వామి.

అతడి స్వరం గద్దిస్తున్నట్లుగా ఉండటంతో ఆమె భయపడింది. ఏదో మాట్లాడాలనుకున్నదే ఆగిపోయి శ్రద్ధగా వినసాగింది.

"నువ్విప్పుడా పరుపు మీదకు వెడతావు. నీ చుట్టూ వున్న ఆరుగురు యువకుల్లో ఒకడి నెన్నుకుంటావు. అప్పుడు మీరిద్దరూ దంపతులు. గదిలో యింకెవ్వరూ లేనట్లూ మీ రిద్దరే ఉన్నట్లూ మసలాలి. ఆ తర్వాత నిన్ని ప్పటికంటే చక్కగా అలంకరించి పెళ్ళి చూపుల సమయానికి పువ్వులా నీ యింటికి చేర్చే బాధ్యత నాది. అలా కాదని రగడ చేశావా - ఆరుగురు యువకులొక్కసారిగా నీమీద అత్యాచారం చేస్తారు. నలిగిన పువ్వులా యిల్లుచేరి పెళ్ళివారి కంటబడతావు. ఆలోచించుకో - ఎంతో వ్యవధి లేదు...."

వందన శరీరం జలదరించింది.

ఎంతో జుగుప్సాకరమైన విషయాన్నత డెంతో సింపుల్‌గా చెప్పాడు.

అంతవరకూ పరపురుషుడి స్పర్శ కూడా ఎరుగని తాను పక్కా వ్యభిచారిణిలా యింతమంది మగాళ్ళ ముందు సిగ్గు విడిచి ప్రవర్తించాలి. అది సాధ్యమా?

సాధ్యపడితే తన పరువు నిలబడుతుంది.

లేకుంటే తను కులట అని వాడ వాడలా తెలుస్తుంది.

పది మందీ తన్ను కులటగా భావించకూడదనుకుంటే తాత్కాలికంగా తను కులట కావాలి.

# ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీద బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్ కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్ ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-8-'87 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు అక్టోబరు'87 నెల సంచికలో ప్రకటిస్తాము.

## జూన్ '87 పోటీ ఫలితాలు

(1) జూన్ '87 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

కన్నె వదనంలో అలజడి !
కదన రంగంలో నిలబడి !!

పంపినవారు: శ్రీమతి ఆర్. జ్యోతి, W/O ఆర్. విశ్వేశ్వర రావు, 3 సి-1-12, కమ్మలవారి వీధి, ఏలూరు-1.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

చలాకీ గుబ్బం !
పిశాచ గృహం !!

పంపినవారు: శ్రీ బి. ప్రభాకరరావు, ప్రభాల్ పాన్ అండ్ బుక్స్, మెయిన్ రోడ్, బెల్లంపల్లి—504 251.

వందన గదిలో చుట్టూ చూసింది.

ఆరుగురు యువకులు మదపుటేనుగుల్లా ఆమె వంక చూ స్తున్నారు. వాళ్ళందరూ ఒక్కసారి తనమీద దాడి చే స్తే....?

"ప్లీజ్ - నన్ను వదిలిపెట్టండి" అంది వందన.

"నేను చెప్పిన రెండిట్లోనూ ఏదో ఒకటి జరిగేకనే నిన్ను వదిలిపెడతాను. త్వరగా ఆలోచించుకో."

వందన ఆలోచిస్తోంది. ఆలోచనలతో మనసు చిక్క బట్టుకుందుకు ప్రయత్నిస్తూంది.

స్వతహాగా వందన ధైర్యవంతురాలు కాదు.

తానొక సంప్రదాయంలో పెరిగింది. ఆ సంప్రదాయం కోసం ప్రాణాలర్పించగల ధైర్యమామెకు లేదు. కానీ ఆ సాంప్రదాయాన్ని కాదన్నాక మామూలు మనిషిలా జీవించగల ధైర్యమూ ఆమెకు లేదు.

అప్పుడామెకా యువకుడు గుర్తుకొచ్చాడు.

"ఇల్లు వదలొద్దు...." అని మరీ మరీ హెచ్చరించాడతడు.

అతడి హెచ్చరిక పెడచెవిని పెట్టినందు కిప్పుడీ ఫలితం....

"త్వరగా నిర్ణయం చెప్పకపోతే - అరుగురూ నీ పైకి దుముకుతారు. ఇంక ఒకే ఒక్క నిముషం గడువు" అన్నాడు కుమారస్వామి.

"అరవై ...." అన్నాడు కొండప్రావు.

వందన ఏదో అనబోయే లోగానే అతడంకెలు లెక్కించుకు పోతున్నాడు.

యాభై తొమ్మిది....యాభై ఎనిమిది .... యాభై ఏడు.... ....

మావద్ద ప్రముఖ రచయిత[త్రు]ల
సాంఘిక నవలలు డిటెక్టివ్ రచనలు,
బాలసాహిత్యం, హిందీ, ఇంగ్లీషు నవలలు,
పురాణేతిహాసగ్రంథములు హోల్‌సేల్
మరియు
రిటైల్‌గా ఆకర్షణీయమైన కమీషన్ పై
లభించును

స్కూలు, కాలేజి అచ్చుపుస్తకములు
మరియు జనరల్ పుస్తకములు, విద్యార్థు
లకు కావలసిన నోటు పుస్తకములు
సరసమైన ధరలకు లభించును

నేడే సంప్రదించండి

శ్రీ గణేశ్ బుక్ హౌస్
పాత కూరగాయల మార్కెట్ వద్ద
మెయిన్ రోడ్డు, రాజమండ్రి
Phno : 3444

గదిలో కొండ్రావు స్వరం మినహా అంతా నిశ్శబ్దం.

నలభై రెండు....నలభై ఒకటి....నలభై ....ముప్పై తొమ్మిది....

వందన ఎక్కువ జాప్యం చేయలేదు. ఆమె తెగించిన దానిలా పరుపు మీదకు వెళ్ళి మధ్యలో నిలబడింది.

పరుపు మీద వందన.

పరుపు చుట్టూ ఆరుగురు యువకులు.

ఆ దృశ్యం చూస్తున్న కుమారస్వామి, సింహాద్రి, కొండ్రావు....

కొండ్రావు అంకెలు లెక్కపెట్టటం ఆపేశాడు.

"స్టార్ట్" అన్నాడు కుమారస్వామి.

సింహాద్రి కెమేరా అడ్జస్టు చేసుకున్నాడు.

కుమారస్వామి తన పక్కనే వున్న బైనాక్యులర్స్ తీశాడు.

ఆరుగురు యువకులూ పరుపు చుట్టూ వలయాకారంలో తిరుగుతూ నృత్యం చేస్తున్నారు.

"వందనా - వారిని బాగా గమనించు. వారిలో ఒకరిని నీ వెన్నుకోవాలి" అన్నాడు కుమారస్వామి.

వందన ఆ యువకుల వంకనే చూస్తున్నదల్లా నిశ్చేష్టురాలైంది.

నృత్యం చేస్తూనే వారందరూ ఒకటొక్కటిగా దుస్తులు దిగవిడిచారు.

అప్రయత్నంగానే వందన కళ్ళు మూసుకుంది.

"స్టాప్" అన్నాడు కుమారస్వామి. (సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page

Regd. no: H/HD-48

'PRABHAKAR'